సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 362

సోమవారం 23-3-2020



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

'టోక్యో' వాయిదా తప్పదేమో!

ఆ దిశగానే ఐఓసీ, జపాన్ నిర్వాహకుల అడుగులు – స్పోర్ట్స్‌లో

కరోనాపై ఆర్‌బీఐ 'వార్'..

ఆర్థిక కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా చర్యలు – బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ప్రధాని పిలుపు మేరకు అత్యవసర సేవల సిబ్బందికి మద్దతు తెలుపుతూ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రగతి భవన్‌లో చప్పట్లు కొడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి కేటీఆర్ సహా సీఎం కుటుంబ సభ్యులు, మంత్రి సబిత, ఎంపీ సంతోష్ కుమార్

మీ స్ఫూర్తి, స్వీయ నియంత్రణకు థ్యాంక్స్..

సుదీర్ఘ సంగ్రామానికి ఆరంభం: మోదీ

కరోనాపై పోరాటానికి సంఘీభావం తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు

అంతా ఇళ్లలోనే..

మార్మోగిన చప్పట్లు..

- వివరాలు 5లో

31 దాకా లాక్‌డౌన్

ప్రజారవాణా వాహనాలపై నిషేధం.. సరుకు రవాణాకు మాత్రం మినహాయింపు: కేసీఆర్

కూరగాయలు, పాలు, కిరాణా షాపులు, ఎల్పీజీ, పెట్రోల్ బంకులు తెరిచే ఉంటాయి	తెల్లకార్డుదారులకు ఒక్కొక్కరికీ ఉచితంగా 12 కిలోల బియ్యం
వైన్ షాపులు మాత్రం మూసి ఉంటాయి	సరుకుల కోసం కుటుంబానికి రూ. 1,500 చొప్పున పంపిణీ

మొత్తం రూ. 2,417 కోట్లు తక్షణమే విడుదల

- రాష్ట్రంలో అంటురోగాల నియంత్రణ చట్టం–1897 ప్రయోగం
- కలెక్టర్లు, సబ్ డివిజన్ మేజిస్ట్రేట్లకు విశేష అధికారాలు
- నిత్యావసరాల కొనుగోళ్ల కోసం ఇంటికొకరికే అనుమతి
- అత్యవసరం కాని శస్త్రచికిత్సలు నెలపాటు వాయిదా
- 20% మంది చొప్పున రొటేషన్ పద్ధతిలో ఉద్యోగులకు విధులు
- అంగన్‌వాడీల నుంచి లబ్ధిదారుల ఇళ్లకే పౌష్టికాహారం
- కరోనా నియంత్రణ చర్యలపై ఉన్నతస్థాయి భేటీలో సీఎం కేసీఆర్

2 లో

జనతా కర్ఫ్యూతో ఆదివారం నిర్మానుష్యంగా మారిన అసెంబ్లీ పరిసర ప్రాంతం..

మరో 6 పాజిటివ్ కేసులు..

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 27కు చేరింది. ఆదివారం ఒక్కరోజే ఆరు కేసులు నమోదయ్యాయి. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి కోవిడ్ పాజిటివ్ రావడంతో తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ ఉలిక్కిపడింది. 4 రోజుల క్రితం దుబాయ్ నుంచి వచ్చిన వ్యాపారికి కోవిడ్ పాజిటివ్ రాగా, తర్వాత ఆయన కుమారుడికి శనివారం పాజిటివ్ వచ్చింది. ఆదివారం వ్యాపారి భార్య (50)కు కూడా కోవిడ్ సోకింది. ఆమె కూడా భర్తతో కలిసి దుబాయ్ వెళ్లొచ్చారు. ఆమెతోపాటు మరో ఐదుగురికి ఆదివారం కోవిడ్ పాజిటివ్ నిర్ధారణైంది. వీరిలో ఐదుగురు పురుషులు, ఒక మహిళ ఉన్నారు.

- రాష్ట్రంలో 27కు చేరిన కోవిడ్ పాజిటివ్ కేసులు
- ఒకే కుటుంబంలోని ముగ్గురికి..
- ఇకపై జిల్లాల్లోనే ఐసోలేషన్.. చికిత్సకైతేనే హైదరాబాద్‌కు..
- విదేశాల నుంచి వచ్చిన వారి కోసం మరింతగా జల్లెడ

- గుంటూరుకు చెందిన 24ఏళ్ల (పెళ్లి కాలేదు) యువకుడు లండన్ నుంచి దుబాయ్ మీదుగా హైదరాబాద్ వచ్చాడు. అతను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా కోవిడ్ పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.
- హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన యువకుడు (23) లండన్ నుంచి దోహా మీదుగా హైదరాబాద్ చేరుకోగా అతడికి కూడా కోవిడ్ పాజిటివ్ అని తేలింది. ఈ కేసు వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.
- ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజోలుకు చెందిన 26 ఏళ్ల ఐటీ విద్యార్థి ఈనెల 16న స్వీడన్ నుంచి హైదరాబాద్ రాగా.. కోవిడ్ పాజిటివ్

మిగతా 2వ పేజీలో ▶

మావో పంజా

- 17 మంది జవాన్ల మృతి
- 19 మందికి గాయాలు
- డ్రోన్ల సాయంతో జవాన్ల మృతదేహాల గుర్తింపు
- బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించిన మావోల ఆకస్మిక దాడి

- 5లో

హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో చప్పట్లతో మద్దతు తెలుపుతున్న దృశ్యం

జయహో జనతా..

ఉద్యమ స్ఫూర్తిని చాటి చెప్పిన రాష్ట్ర ప్రజానీకం

సాక్షి, హైదరాబాద్

పోరాటాల పురిటిగడ్డ తెలంగాణ ఆదివారం 'జనతా కర్ఫ్యూ' పేరుతో ఉద్యమ స్ఫూర్తిని చాటిచెప్పింది. కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు స్వచ్ఛందంగా కర్ఫ్యూ విధించుకుంది. కులం, మతం, ప్రాంతం, వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు జనతా కర్ఫ్యూను పాటించారు. ఉదయం 6 గంటల నుంచి ఆదివారం రోజంతా ఎవరూ బయటకు రాలేదు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలు, పల్లెల్లోని ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ముందే ఖరారైన పెళ్లిళ్లు మినహా అన్ని శుభకార్యాలను రద్దు చేసుకున్నారు. రోడ్లపైకి ఎవరూ రాకపోవడంతో రాష్ట్రంలోని అన్ని రోడ్లు నిర్మానుష్యమయ్యాయి. రోజూ కిటకిటలాడే ప్రాంతాలు, మార్కెట్లు, రైతు బజార్లు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ఎవరూ కనిపించలేదు. ప్రయాణాలు వాయిదా వేసుకోవడంతో ప్రజా రవాణా కోసం వాహనాలను నడపాల్సిన అవసరం కూడా రాలేదు. అత్యవసర సర్వీసులు మినహా అన్ని రంగాలు లాక్‌డౌన్ కావడంతో ఆదివారం రాష్ట్రంలో జనజీవనం స్తంభించింది.

- జనతా కర్ఫ్యూకు అనూహ్య స్పందన
- స్వచ్ఛందంగా కర్ఫ్యూలో పాల్గొన్న ప్రజలు
- నిర్మానుష్యమైన రోడ్లు.. మూతపడిన దుకాణాలు.. ఆగిపోయిన ప్రజా రవాణా
- రాష్ట్రాలతో సరిహద్దులు మూసివేత
- పట్టణ, గ్రామాల్లోనూ ప్రజా చైతన్యం
- ఇళ్ల నుంచి బయటకు రాని జనం
- చప్పట్లు కొట్టే కార్యక్రమానికి నీరాజనం

అంతటా అద్భుత స్పందన...

ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ పిలుపులకు రాష్ట్రంలో అద్భుత స్పందన లభించింది. హైదరాబాద్ నుంచి రాష్ట్ర సరిహద్దు గ్రామాల వరకు అన్ని ప్రాంతాల్లోని ప్రజలు కర్ఫ్యూలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు ఆదివారం సెలవు కావడం, స్వచ్ఛందంగా ప్రజలు కరోనాపై యుద్ధం ప్రకటించడంతో రాష్ట్రమంతా 144 సెక్షన్ తలపించింది. వ్యాపార వర్గాలు కూడా సహకరించడంతో రాష్ట్రంలోని దాదాపు అన్ని దుకాణాలు బందయ్యాయి. నిత్యపూజలు మినహా ప్రార్థన మందిరాల్లో

మిగతా 4వ పేజీలో ▶

మరో 3..

- దేశంలో కరోనాతో మరో ముగ్గురి మృతి
- ఇప్పటివరకు ఏడుగురి మృత్యువాత
- 360కి చేరిన కరోనా కేసులు
- దేశవ్యాప్తంగా 80 జిల్లాల్లో లాక్‌డౌన్‌కు కేంద్రం ఆదేశం
- 31 వరకు అన్ని రైళ్లు, అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు నిలిపివేత
- దేశ రాజధాని సహా పలు రాష్ట్రాలు లాక్‌డౌన్‌లోకి

13,444

అంతర్జాతీయంగా కరోనా మరణాలు

- ఇటలీలోనే 4,825 మంది మృతి
- ప్రపంచవ్యాప్తంగా 3,08,130 కేసులు
- 170 దేశాలకు వ్యాపించిన కోవిడ్
- యూరప్‌పై తీవ్ర ప్రభావం

- వివరాలు 5లో

...బాధితులందర్నీ చైనా పంపిస్తే పోలా!

31 వరకు ఏపీ లాక్‌డౌన్..

మీడియా సమావేశంలో సీఎం వైఎస్ జగన్

- రాష్ట్ర సరిహద్దులు మూసివేత.. రవాణా వాహనాల నిలిపివేత
- అత్యవసర సేవలు, నిత్యావసరాలు అందుబాటులో ఉంటాయి
- ప్రతీ పేద కుటుంబానికి ఈనెల 29 నాటికి రేషన్ సరుకులు రెడీ
- వాటితోపాటు కేజీ పప్పు ఉచితంగా ఇస్తాం.. ఏప్రిల్ 4న వెయ్యి ఆర్థిక సాయం అందజేస్తాం

3 లో

వైద్యులు, అత్యవసర సేవల సిబ్బందికి చప్పట్లతో మద్దతు తెలుపుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్, మంత్రి ఆళ్ల నాని, సీఎస్ నీలం సాహ్ని తదితరులు

పల్లె గప్‌చుప్..

జనతా కర్ఫ్యూకు గ్రామాల మద్దతు ఇళ్ల నుంచి బయటకు రాని జనం

- వివరాలు 14లో

epaper.sakshi.com

జనతా కర్ఫ్యూ ఎఫెక్ట్: హైదరాబాద్ నాగార్జున సర్కిల్

రాజ్‌భవన్

ఆదివారం వైద్య, పారిశుద్ధ్య, పోలీసు సిబ్బందికి చప్పట్లతో సంఘీభావం తెలుపుతున్న గవర్నర్ తమిళిసై కుటుంబ సభ్యులు

జగిత్యాల

31 దాకా లాక్‌డౌన్

కరోనా నియంత్రణ చర్యలపై ఉన్నతస్థాయి భేటీలో సీఎం కేసీఆర్ సంచలన నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్

'అత్యవసర పరిస్థితుల్లో విశేష అధికారాల కోసం అమలు చేసే అంటురోగాల నియంత్రణ చట్టం -1897ను రాష్ట్రంలో ప్రయోగించాం. మార్చి 31 వరకు తెలంగాణ రాష్ట్రం లాక్‌డౌన్‌లో ఉంటది. ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ ఇళ్లు దాటి బయటకు రావొద్దు. ఐదుగురికి మించి బయట గూమికూడొద్దు. ఈ నిబంధన చాలా సీరియస్‌గా ఉంటది. బయట కొచ్చిన వ్యక్తుల మధ్య కనీసం 3 అడుగుల దూరం ఉండాలి. ఇంటి కోసం కావాల్సిన మందులు, పాలు, కూరగాయలు, నిత్యావసర, అత్యవసర వస్తువుల సేకరణ కోసం కుటుంబానికి ఒక వ్యక్తిని మాత్రమే బయటకు అనుమతిస్తారు. బయటకు వెళ్లినప్పుడు వీలైనంత వరకు 2-3 రోజుల వస్తువులు తెచ్చుకోవాలి'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. కోవిడ్-19 నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సారథ్యంలో ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ సమావేశమై చర్చించింది. అనంతరం సీఎం కేసీఆర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. దయచేసి ఆదివారం జనతా కర్ఫ్యూ సందర్భంగా చూపిన క్రమశిక్షణ, పట్టుదలను కచ్చితంగా మార్చి 31 వరకు చూపాలి. అప్పటివరకు ఎవరి ఇళ్లకే వారు పరిమితమై ఉంటే కరోనాను తరిమికొట్టొచ్చు. మనం, మన కుటుంబాలు, మన పిల్లలు

ఆదివారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఈటల, తలసాని, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి

తా కర్ఫ్యూ పాటించాలని ప్రధాని మోదీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు ప్రజలు కనీవినీ ఎరుగని రీతిలో అద్భుతంగా స్పందించి ఇళ్లకే పరిమితమయ్యారు. అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించారు. ఏదైతే నేను కోరానో దాన్ని గౌరవించారు. వ్యక్తుల మధ్య దూరాన్ని పాటిస్తూ ఇళ్లకే పరిమితమై వ్యాధి వ్యాప్తి కాకుండా ప్రపంచ మానవాళికే తెలంగాణ అద్భుతమైన కంట్రిబ్యూషన్ చేసింది. మేమంతా ఒకటే. దేన్నైనా ఎదుర్కోగలమని సంఘీభావ సంకేతమిచ్చేందుకు సాయంత్రం 5 గంటలకు చప్పట్లు కొట్టాలన్న పిలుపునకు సైతం ప్రజలు అద్భుతంగా స్పందించారు. బాల్కనీల్లో, రోడ్లపై, ఇళ్ల ముందుకు వచ్చి ప్రజలు అద్భుతంగా ఇందులో పాల్గొన్నారు. ఇంత సంఘీభావ ప్రదర్శన, ఐక్యత, విజ్ఞతను చాటిచెప్పిన ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డకు పేరు పేరునా నా తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నా. హైదరాబాద్, ముంబై నంబర్ వన్ స్థానంలో లాక్‌డౌన్ అయ్యాయని జాతీయ వార్తా చానళ్లు పేర్కొన్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులకు...

ప్రభుత్వ ఉద్యోగులు కూడా కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదు. విద్యుత్, వైద్య వంటి కొన్ని అత్యవసర శాఖల సిబ్బంది విధిగా 100 శాతం రావాల్సి ఉంటుంది. మిగిలిన శాఖల వారు 20 శాతం రొటేషన్ పద్ధతిలో హాజరు కావాలి. కరోనా బారిన పడకుండా క్షేమంగా ఉండొచ్చు. ఇవి సర్వజనుల హితం కోరి చెప్పే మాట కాబట్టి అందరూ తు.చ. తప్పకుండా పాటించాలి'అని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వారం రోజులపాటు ఎవరి ఇళ్లలో వారు ఉండి ఇళ్లలో చేసుకోవాల్సిన మొక్కలు నాటడం వంటి పనులు చక్కబెట్టుకుంటూ గడిపితే ఈ మహమ్మారి బాధ నుంచి తప్పించుకోవచ్చన్నారు. సీఎం కేసీఆర్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

అద్భుత దృశ్యం ఆవిష్కరణ..

ప్రపంచాన్ని చుట్టుముట్టి భయకంపితం చేస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి నిర్మూలనకు ఆదివారం జనతా కర్ఫ్యూ పాటించాలని ప్రధాని మోదీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు ప్రజలు కనీవినీ ఎరుగని రీతిలో అద్భుతంగా స్పందించి ఇళ్లకే పరిమితమయ్యారు. అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించారు. ఏదైతే నేను కోరానో దాన్ని గౌరవించారు. వ్యక్తుల మధ్య దూరాన్ని పాటిస్తూ ఇళ్లకే పరిమితమై వ్యాధి వ్యాప్తి కాకుండా ప్రపంచ మానవాళికే తెలంగాణ అద్భుతమైన కంట్రిబ్యూషన్ చేసింది. మేమంతా ఒకటే. దేన్నైనా ఎదుర్కోగలమని సంఘీభావ సంకేతమిచ్చేందుకు సాయంత్రం 5 గంటలకు చప్పట్లు కొట్టాలన్న పిలుపునకు సైతం ప్రజలు అద్భుతంగా స్పందించారు. బాల్కనీల్లో, రోడ్లపై, ఇళ్ల ముందుకు వచ్చి ప్రజలు అద్భుతంగా ఇందులో పాల్గొన్నారు. ఇంత సంఘీభావ ప్రదర్శన, ఐక్యత, విజ్ఞతను చాటిచెప్పిన ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డకు పేరు పేరునా నా తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నా. హైదరాబాద్, ముంబై నంబర్ వన్ స్థానంలో లాక్‌డౌన్ అయ్యాయని జాతీయ వార్తా చానళ్లు పేర్కొన్నాయి.

ఇళ్లకే పౌష్టికాహారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో జనం గూమికూడితే సమస్య అని మూసేస్తున్నం. మహిళలు, చిన్న పిల్లలకు పోషకాహార లోపం రావొద్దని ఇళ్ల వద్దకే సరుకులు పంపిణీ చేస్తాం. ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణుల వివరాలు సిద్ధం చేస్తున్నం. వారి కోసం ప్రత్యేకంగా అమ్మ ఒడి వాహనాలు ఏర్పాటు చేస్తున్నం. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసరం కాని సర్జరీలను నెల వాయిదా వేయాలి. అత్యవసర వైద్య సేవలు కొనసాగుతాయి. ప్రతిరోజూ రాష్ట్రంలో ఆరోగ్య స్థితిగతులపై ఆరోగ్యశాఖ మంత్రి బులెటిన్ విడుదల చేస్తరు.

బీమారీ దిగుమతి బంద్...

దేశీయ, అంతర్జాతీయంగా ఈ వైరస్ ద్వారా సంభవిస్తున్న పరిణామాలపై ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ సమావేశమై చర్చించింది. విదేశాల నుంచి ప్రయాణికుల రాక బంద్ కావడంతో ఆదివారం నుంచి ఓ ప్రమాదం తప్పిపోతోంది. పోర్టులు, ఎయిర్‌పోర్టులు బంద్ అయ్యాయి. షికాగో నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన ఒక విమానం ఇప్పటికే ఢిల్లీలో ల్యాండ్ అయింది. వస్తే ఒక ఫ్లైట్ శంషాబాద్‌కు వస్తది. విదేశాల నుంచి దిగుమతి అయ్యే బీమారీ అవస్థ ఈ రోజు నుంచి తప్పింది. అయితే దురదృష్టవశాత్తూ ఆదివారం కూడా ఐదు కోవిడ్-19 పాజిటివ్ కేసులు వచ్చాయి. మొత్తం కేసుల సంఖ్య 26కు (అప్పటివరకు ఉన్న సమాచారం మేరకు సీఎం ఆ వివరాలు చెప్పారు. అధికారికంగా 6 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 27 మంది వైరస్ బారినపడ్డారు) చేరింది. వారందరూ కోలుకొని ఇళ్లకు వెళ్లాలని కోరుకుంటున్నా.

అదృష్టవశాత్తూ స్థానికవ్యాప్తి లేదు

రాష్ట్రంలో స్థానికంగా ఒకే వ్యక్తికి కరోనా సోకింది. అదృష్టవశాత్తూ రాష్ట్రంలో స్థానిక వ్యక్తులకు వ్యాధి వ్యాప్తి చెందడం లేదు. విదేశాల నుంచి వ్యక్తుల రాక నిలిచిపోయింది కాబట్టి ఇక్కడ వ్యాధి వ్యాప్తి చెందకుండా నిలపాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉంది. మనకు ఎవరో వచ్చి సాయం చేసే సమయం కాదిది. మన కోసం మనం.. జనం కోసం జనం.. అందరి కోసం అందరం పరితపించి పట్టుదలతో పని చేసుకోవాల్సిన పరిస్థితి.

పాలు, కూరగాయలు ఓకే..

కూరగాయలు, పాలు, కిరాణా షాపులు తెరిచి ఉంటాయి. అయితే ఇంటికో వ్యక్తి మాత్రమే బయటకు వెళ్లి అవసరమైనవి కొనుగోలు చేయాలి. పాసులేవీ ఉండవు. ఇది కర్ఫ్యూ లాంటి పరిస్థితి కాదు. మద్యం దుకాణాలు మాత్రం బంద్ చేస్తరు. ఐటీ ఉద్యోగులకు ఇళ్ల నుంచి పనిచేసుకోవడానికి కంపెనీలు అనుమతించాయి. ఐటీ మంత్రి కేటీఆర్ ఇప్పటికే ఐటీ కంపెనీలతో మాట్లాడి ఒప్పించారు.

కలెక్టర్లకు విశేష అధికారాలు..

అంటురోగాల నియంత్రణ చట్టం కింద కలెక్టర్లు, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్లకు విశేష అధికారాలు కట్టబెట్టుతున్నం. ఏ జిల్లాలో ఏ వాహనాన్ని అయినా అధికారులు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు వాడుకోవచ్చు. నా కారును సైతం ఆపి అత్యవసర పరిస్థితి ఉందని తీసుకెళ్లొచ్చు.

మనకు ఇటలీ దుర్గతి రావొద్దు..

ఆదివారం నాటికి ప్రపంచవ్యాప్తంగా 3,08,047 మందికి కరోనా వచ్చింది. కొత్తగా 3,557 కేసులు బయటపడ్డాయి. ఇప్పటివరకు కరోనాతో 13,069 మంది మరణించారు. ప్రధానంగా ఇటలీ దెబ్బతింటున్నది. వారంతట వారే చెడగొట్టుకున్నరు. రోజుకు ఐదారొందల మంది చనిపోతున్నరు. ఆ దుర్గతి మనకు రావొద్దంటే స్వీయ నియంత్రణే మనకు శ్రీరామరక్ష.

ఇళ్లలోనే ఉండండి..

విదేశాల నుంచి వచ్చిన వ్యక్తులు జిల్లా కలెక్టర్, ఎస్పీ, డాక్టర్లు, మున్సిపల్ అధికారులకు స్వయంగా రిపోర్టు చేయాలి. మీకు వ్యాధి ఉంటే తక్షణమే చికిత్స ప్రారంభిస్తరు. మీకు, సమాజానికి క్షేమం. మన దగ్గర 800 మంది హోం క్వారెంటైన్‌లో ఉన్నరు. వారందరికీ స్టాంప్ వేసి పంపాం. వారిలో కొందరు దుర్మార్గులు బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నరు. వారిని పట్టుకొని ప్రజలు రైళ్ల నుంచి దించేస్తున్నరు. ఒకాయనను ఆలేరు దగ్గర రైలు లోంచి దించేశారు. రాష్ట్రమే లాక్‌డౌన్ అయింది.. ఎక్కడికీ వెళ్లలేరు. ఇది వినోద సమయం కాదు. దుఃఖ సమయం. దయచేసి ఆషామాషీగా తీసుకోకుండా అందరూ ఇళ్లలోనే ఉండాలి. ఒక వారం నియంత్రణ ఒక జీవిత కాలాన్ని కాపాడుతుంది. భవిష్యత్తు తరాలను, భారత దేశాన్ని కాపాడుతుంది. మనలో ఎవరు బాగున్నరో తెలియదు.

తల్లిదండ్రుల వల్లే కొడుక్కి రోగం

సికింద్రాబాద్‌లో ఫస్ట్ లోకల్ ట్రాన్స్‌మిషన్ కేసు నమోదైంది. దుబాయ్ నుంచి వచ్చిన తల్లిదండ్రులు క్వారంటైన్‌లో ఉండకుండా ఇంటికి వెళ్లి కొడుక్కి తగిలించారు. ఈరోజు కొడుక్కి ఆ బీమారీ అంటించింది వారే. కనీసం కన్నబిడ్డల మీద ప్రేమ ఉండకపోతే ఎలా? మన కుటుంబాన్ని మనమే ధ్వంసం చేసుకుంటామా? విదేశాల నుంచి తిరిగి వచ్చినవారు ఇళ్లకు వెళ్లకుండా క్వారంటైన్‌కు వెళ్లండి. మిమ్మల్ని వైద్యులు పరీక్షించి స్టాంప్ వేసి ఇళ్లకు పంపిస్తరు. మీకోసం వందల కోట్లు ఖర్చు చేసి చికిత్స అందిస్తుంటే మీరు ఇలా చేస్తే ఎలా? విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించేందుకు 6 వేల బృందాలు పనిచేస్తున్నాయి.

కుక్కలు జోక్ చేసుకుంటున్నయి...

బల్దియా సిబ్బంది సాధారణంగా కుక్కలను పట్టుకొని పోతారు. జనతా కర్ఫ్యూ రోజున రోడ్ల మీద మనుషులు కనబడలేదు. 'మనుషులు ఏమయ్యారు. మునిసిపాలిటీవాళ్లు పట్టుకొనిపోయారా? అని కుక్కలు మాట్లాడుకుంటున్నట్టు సోషల్ మీడియాలో జోకులు వినిపిస్తున్నాయి.

రాజ్‌భవన్‌లో మార్మోగిన చప్పట్లు

సాక్షి, హైదరాబాద్: తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కోవిడ్-19 రోగులకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి సంఘీభావంగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన కుటుంబ సభ్యులు, సిబ్బందితో కలిసి గట్టిగా చప్పట్లు కొట్టి అభినందనలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు రాజ్‌భవన్ పోర్టికో ముందు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జనతా కర్ఫ్యూకు పిలుపునిచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీకు గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల నుంచి వచ్చిన కోవిడ్ అనుమానిత రోగులు ప్రజల్లో మమేకమై తిరుగుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా అందరూ ఇళ్లకే పరిమితమై ఉండాలని పిలుపునిచ్చారు.

మరో ఆరు పాజిటివ్ కేసులు..

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చింది. అతనికి నగరంలోనే చికిత్స చేస్తున్నారు.

- రంగారెడ్డి జిల్లా మణికొండకు చెందిన వ్యక్తి (34)కి కూడా కోవిడ్ సోకింది. ఇతడు ఈనెల 14న స్వీడన్ నుంచి వచ్చాడు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంకు చెందిన ఒక పోలీస్ అధికారి కొడుకు (23) ఈ నెల 18న లండన్ నుంచి వచ్చాడు. అతనికి కూడా కోవిడ్ నిర్ధారణైంది.

రెండో దశకు చేర్చింది అతడే..

ఒకే కుటుంబంలో ముగ్గురికి కోవిడ్ పాజిటివ్ రావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. దుబాయ్ నుంచి భార్యతో కలిసి వెళ్లొచ్చిన సికింద్రాబాద్‌కు చెందిన వ్యాపారికి మూడ్రోజుల క్రితం పాజిటివ్ నిర్ధారణ కాగా, శనివారం ఆయన కుమారుడికి, ఆదివారం ఆయన భార్యకు పాజిటివ్ వచ్చింది. రాష్ట్రంలో తొలి లోకల్ కాంటాక్ట్ కేసు ఇదే. వైరస్‌ను రెండో దశకు చేర్చింది ఈ కేసే అంటున్నారు వైద్య నిపుణులు. ఈ ముగ్గురు.. 11 మందితో కాంటాక్ట్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. వారందరికీ పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఆ కుటుంబం నివసిస్తున్న ఇంటి పరిధిలో కిలోమీటర్ వరకు అందరి ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తూ లక్షణాలున్న వారిని గుర్తిస్తున్నారు. దీనిపై నిఘా బృందాలు జల్లెడ పడుతున్నాయని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. అయితే వ్యాపారి కొడుకు ద్వారా రాష్ట్రంలో రెండో దశకు కోవిడ్ చేరినట్టుగా అధికారులు విశ్లేషిస్తున్నారు.

జిల్లాల్లోనే 'ఐసోలేషన్'..

రాష్ట్రంలో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాల్లో నమోదయ్యే కోవిడ్ అనుమానిత కేసులను హైదరాబాద్ పంపొద్దని వైద్య ఆరోగ్యశాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఆదివారం ఉన్నతాధికారులతో మంత్రి ఈటల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సమావేశమై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటికే జిల్లాల ప్రధాన ఆస్పత్రుల్లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. కరోనా అనుమానిత లక్షణాలున్న వారిని ఇకపై తొలుత అక్కడికే తీసుకెళ్తారు. అక్కడే నమూనాలను సేకరించి హైదరాబాద్ పంపుతారు. ఒకవేళ పాజిటివ్ వస్తే తదుపరి చికిత్సకు హైదరాబాద్ తరలించాలని ఆదేశించారు. ఇక కోవిడ్ కట్టడికి ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందంతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల ఆదివారం భేటీ అయ్యారు. కోవిడ్ కేసుల్లో ఎవర్ని రిఫర్ చేయాలనే దానిపై ఈ బృందం కొన్ని మార్గదర్శకాలు రూపొందించి, ప్రభుత్వానికి అందజేసింది. ప్రస్తుతం గాంధీ, ఛాతీ ఆస్పత్రుల్లో ఏర్పాటుచేసిన కోవిడ్ ప్రత్యేక వార్డులు దాదాపు నిండిపోయాయి. దాంతో కింగ్‌కోఠి ఆస్పత్రిలో పూర్తిగా కోవిడ్ కేసులకు చికిత్స అందించాలని నిర్ణయించారు. దీంతో ఆ ఆస్పత్రిలోని ఇతర రోగుల్ని ఇప్పటికే తరలించారు. మున్ముందు కేసులు పెరిగే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు. గచ్చిబౌలిలోని క్రీడాగ్రామాన్ని ఐసోలేషన్ కోసం సిద్ధం చేయగా, అవసరాన్ని బట్టి దాన్ని పూర్తిస్థాయి ఆస్పత్రిగా మార్చాలనుకుంటున్నారు.

ఈ పని అప్పుడే చేసి ఉంటే..

ఇప్పటిదాకా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగిన వారిని తొలుత సర్కారు ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాలకు పంపేవారు. తమకు ఇంటివద్ద సదుపాయాలున్నాయని, స్వచ్ఛందంగా క్వారంటైన్‌లో ఉంటామని హామీ ఇవ్వడంతో వారందర్నీ ఇళ్లకు పంపేశారు. కొందరి ఇళ్ల వద్ద అటువంటి సౌకర్యాలు లేవని తెలిసింది. దీంతో ప్రభుత్వం 6 వేల మందితో కూడిన ఇంటెలిజెన్స్ బృందాలను రంగంలోకి దింపింది. ఒక గ్రామంలో సర్పంచ్, వీఆర్వో, ఆశ, కానిస్టేబుల్‌ను బృందంగా ఏర్పరిచి, వారి ద్వారా ఊళ్లోకి విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలను సేకరిస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు లో సేకరించిన వివరాలను స్థానిక వివరాలతో పోల్చి చూస్తున్నారు. ఎవరైనా మిస్ అ యితే వారి కోసం పోలీసు బృం దాలతో గాలి స్తున్నారు. మార్చి 1 తర్వాత విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలను ఇలా సేకరిస్తున్నారు. ఒక గ్రామం నుంచి అసలు ఎంతమంది విదేశాలకు వెళ్లారు? వారి పేర్లు, వయసు, ప్రస్తుతం ఏ దేశంలో ఉంటున్నారో గ్రామస్థాయిలోనే జాబితా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం విదేశాల నుంచి వస్తున్న వారి చేతికి ప్రత్యేకమైన ఇంకుతో 'క్వారంటైన్'ముద్ర వేస్తున్నారు. తప్పించుకు తిరుగుతున్న వారు ఈ ముద్ర ద్వారా ఎక్కడికిపోయినా దొరికిపోతున్నారు. ఈ విధానాన్ని మార్చి 1 నుంచే అమలు చేసి ఉండాల్సిందని వైద్య ఆరోగ్యశాఖ ఇప్పుడు తలలు పట్టుకుంటోంది.

ఉచితంగా బియ్యం.. రూ. 1,500

కూలి పనులకు వెళ్లే నిరుపేదలు రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్నరు. సంక్షేమంలో మనం నంబర్ వన్‌లో ఉన్నం. బడ్జెట్‌లో సంక్షేమానికి రూ. 40 వేల కోట్లు పెట్టి ఖర్చు చేస్తున్నం. కాబట్టి నిరుపేదలు ఎట్టిపరిస్థితుల్లో ఆకలికి గురికాకూడదు. వారం రోజులకు సరిపడే సరుకులు మాత్రమే మనం ఇవ్వడం లేదు. వారంపాటు పనులు ఆగిపోతే మళ్లీ సాధారణ పరిస్థితికి రావాలంటే మరో 15 రోజులు పడుతుంది. కాబట్టి నెల రోజులకు సరిపడే రేషన్ బియ్యం మార్చి నెల బియ్యానికి అదనంగా ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలో కోటీ మూడు లక్షల కుటుంబాలుంటయి. 87.59 లక్షల మందికి తెల్లరేషన్ కార్డులున్నయి. అందులో ప్రతి వ్యక్తికి ఉచితంగా 12 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నం. తెల్ల కార్డుదారులకు ప్రతి నెలా లక్షా 50 వేల టన్నుల బియ్యం ఇస్తాం. ఇప్పుడు డబుల్ చేసి 12 కేజీలిస్తున్నం కాబట్టి 3 లక్షల 36 వేల టన్నులకుపైగా బియ్యాన్ని ఉచితంగా ఇస్తున్నం. దాని విలువ రూ. 1,103 కోట్లు. పప్పు, ఉప్పు, చింతపండు, నూనె వంటి సరుకులు కొనుక్కోవడానికి ప్రతి రేషన్‌కార్డుగల కుటుంబానికి రూ. 1,500 ఇస్తున్నాం. దీనికి రూ. 1,314 కోట్లు ఖర్చు అవుతున్నది. రెండింటికి కలిపి రూ. 2,417 కోట్లు విడుదల చేస్తున్నం.

ప్రైవేటు ఉద్యోగులకు వారం జీతం

ఎపిడమిక్ యాక్ట్-1897 ప్రకారం వారం రోజులు టోటల్ లాక్‌డౌన్ చేస్తున్న సందర్భంగా నిర్మాణ కార్మికులు, ప్రైవేటు పరిశ్రమల్లో పనిచేసే వర్కర్లకు కాంట్రాక్టర్లు, యాజమాన్యాలు ఈ కాలానికి సంబంధించిన వేతనాలను విధిగా చెల్లించాలి. ప్రభుత్వం సైతం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు విధిగా జీతాలు చెల్లిస్తుంది. ఒక విపత్కర పరిస్థితి ఉన్నప్పుడు అందరూ బాధ్యత తీసుకోవాలి. కచ్చితంగా ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి. ప్రైవేటు ఉద్యోగులకూ యాజమాన్యాలు జీతాలు చెల్లించాలి. మీ వ్యాపారానికే సహకరించే వారు కాబట్టి యాజమాన్యాలు వారిని ఆదుకోవాలి. ఈ చట్టం ప్రభుత్వానికి ఈ మేరకు అధికారం కల్పిస్తున్నది.

రవాణా బంద్...

ప్రజారవాణా 100 శాతం మూసివేతే. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ట్యాక్సీలు రోడ్లపైకి రావొద్దు. రైళ్లను కూడా ఇప్పటికే బంద్ చేశారు. ప్రజలు గూమికూడొద్దనే ఈ నిర్ణయాలు. ఎవరి ఇళ్లకు వారు పరిమితం కావాలి. అన్ని రాష్ట్ర సరిహద్దులు మూసివేస్తున్నాం. కూరగాయలు వంటి నిత్యావసర సరుకులు తీసుకొచ్చే రవాణా వాహనాలను అనుమతిస్తరు. అన్ని ప్రజారవాణా వాహనాలపై నిషేధం. అత్యవసర వస్తువులు తప్ప రాష్ట్రంలో చీమ, దోమను కూడా రానీయం. అన్ని అత్యవసర వైద్య సేవలు ఉంటాయి. విద్యుత్, వాటర్ సప్లై, సివరేజీ సేవలు, ఎల్పీజీ, పెట్రోల్ బంకులకు అనుమతి ఉంటది.

10 రోజులు ప్రజారవాణా బంద్

సాక్షి, హైదరాబాద్

దేశ చరిత్రలో తొలిసారి ప్రజారవాణా వ్యవస్థ అధికారికంగా స్తంభించింది. ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా 10 రోజులు ప్రజా రవాణాకు బ్రేక్ పడింది. ఇటు రైళ్లు, అటు బస్సులు.. ఇన్ని రోజులపాటు ప్రజలకు అందుబాటులో లేకపోవటం ఇదే తొలిసారి. రైల్వే వ్యవస్థ ప్రారంభమైన ఈ 174 ఏళ్లలో, రాష్ట్రంలో బస్సు రవాణా మొదలైన 8 దశాబ్దాల్లో పాలక వ్యవస్థనే స్తంభింపచేయటం తొలిసారి చోటు చేసుకుంది. జనతా కర్ఫ్యూ నేపథ్యంలో ఆదివారం రైళ్లు, బస్సులు నిలిచిపోగా, దాన్ని కొనసాగిస్తూ ఈనెల 31 వరకు లాక్‌డౌన్ చేయటంతో వచ్చే 9 రోజులు కూడా రైళ్లు, బస్సులు అందుబాటులో ఉండవు. సాధారణంగా సమ్మెలు, హర్తాళ్‌లు, బంద్‌ల సమయంలో వీటిని నిలిపేయటం సహజం. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలగొద్దన్న ముందు జాగ్రత్త చర్యలతో అధికారులు వాటిని పాక్షికంగా నిలిపేస్తారు. ఇక సమ్మెల సమయంలో ఉద్యోగులు, కార్మికులు విధులు బహిష్కరిస్తే వాటిని నడిపే అవకాశం లేక నిలిపేస్తారు. కానీ ప్రభుత్వమే నిలిపేయటం, అది పది రోజులపాటు కొనసాగటం తొలిసారి. దేశ చరిత్రలో మహమ్మారులు ప్రబలటం గతంలోనూ చోటు చేసుకుంది. కానీ అవి కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యేవి. ప్రజా రవాణా వల్ల ఆ వ్యాధులు ప్రబలుతున్నాయన్న కారణంతో ఇలాంటి నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు చరిత్రలో లేవు.

అధికారికంగా స్తంభింపజేసిన ప్రభుత్వాలు

- దేశవ్యాప్తంగా నిలిచిపోనున్న 13 వేల రైళ్లు
- రాష్ట్రంలో ఎక్కడికక్కడే ఆగిన 9,600 బస్సులు
- చరిత్రలో ఇదే తొలిసారి..
- కోవిడ్ వైరస్ విస్తరణ నేపథ్యంలో నిర్ణయం

ఆదివారం: నాంపల్లి రైల్వేస్టేషన్

రైల్వే

దేశ వ్యాప్తంగా	ద.మ.రై. పరిధిలో
13,000 రైళ్లు	744 రైళ్లు

రోజువారీ ప్రయాణికులు: 2.5 కోట్లు

టీఎస్‌ఆర్టీసీ

మొత్తం బస్సులు	రోజువారీ ప్రయాణికులు
9,600	87 లక్షలు

నిపుణుల హెచ్చరికలతో..

రైళ్లలో వేల మంది ప్రయాణికులు అతి సమీపంలో ఉంటూ ప్రయాణించటం పెను విపత్తుకు కారణమవుతుందంటూ గత వారం రోజులుగా నిపుణులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ వస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ వైరస్ ప్రభావం తీవ్ర రూపం దాల్చటంతో మన దేశంలో కూడా ప్రమాద ఘంటికలు మోగాయి. ఇతర కొన్ని ప్రభావిత దేశాలతో పోలిస్తే మన దేశం కొంత సురక్షితంగానే అనిపించటంతో, ప్రమాదం పెరిగే లోపు మేల్కొనటం ఉత్తమమని నిపుణులు కేంద్రం దృష్టికి తెచ్చారు. రైళ్లను నిలిపేస్తే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి జన ప్రవాహం బాగా తగ్గి వైరస్ విస్తరించే అవకాశం అంతమేర తగ్గిపోతుందని వారు పేర్కొంటూ వస్తున్నారు. ఇదే విషయాన్ని కొందరు రైల్వే అధికారులు కూడా రైల్వే బోర్డు, రైల్వే శాఖ మంత్రి దృష్టికి తెచ్చారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కానీ ఒకేసారి రైళ్లను ఆపితే ప్రజా రవాణా స్తంభించి తీవ్ర ఇబ్బందులు వస్తాయని కేంద్రం తటపటాయించింది. కానీ గత నాలుగు రోజులుగా సంభవిస్తున్న పరిణామాలు కేంద్రాన్ని ఆలోచించేలా చేశాయి. విదేశాల నుంచి వచ్చిన వారు ఇంటిలో స్వీయ నిర్బంధంలో ఉండాల్సి ఉన్నప్పటికీ, విచ్చలవిడిగా ప్రయాణాలు చేస్తుండటం, నిత్యం రైళ్లలో అలాంటి వారిని తోటి ప్రయాణికులు గుర్తించి ఫిర్యాదు చేయటంలాంటివి దీనికి కారణం. పరిస్థితి ఇలాగే ఉంటే చేయిదాటిపోయే ప్రమాదం ఉండటంతో కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి శనివారం రాత్రి పొద్దుపోయే వరకు వరస సమావేశాలు నిర్వహించిన రైల్వే శాఖ చివరకు విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లటంతో ఆయన పచ్చజెండా ఊపారు. ఇటు హైదరాబాద్‌లో ఉన్న 121 ఎంఎంటీఎస్ రైళ్లను కూడా 31 వరకు నిలిపేయాలని నిర్ణయించారు.

అన్ని బస్సులూ బంద్

అన్ని రైళ్లను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తరహాలోనే రాష్ట్రం పరిధిలో ఆర్టీసీ బస్సులన్నింటిని నిలిపేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవలే సమ్మె సమయంలో 52 రోజుల పాటు బస్సులు స్తంభించినా, ప్

టీచర్లకు సెలవులే..

- బడికి వెళ్లాల్సిన అవసరం లేదు
- ఇంటర్ స్పాట్ వ్యాల్యుయేషన్ బంద్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 31వ తేదీ వరకు రాష్ట్రం లాక్ డౌన్ నేపథ్యంలో ఇకపై టీచర్లు కూడా ఇంటికే పరిమితం కానున్నారు. కోవిడ్ కారణంగా రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థులకు ఇటీవల సెలవులిచ్చిన విద్యాశాఖ.. టీచర్లు మాత్రం పాఠశాలలకు వెళ్లి పెండింగ్ పనులను చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో టీచర్లు స్కూళ్లకు వెళ్తున్నారు. అయితే బడుల్లో పదుల సంఖ్యలో టీచర్లు ఒకేచోట ఉండటం ప్రమాదకరమని, తమకు కూడా సెలవులివ్వాలని గత మూడ్రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. అయినా దీనిపై విద్యాశాఖ పెద్దగా స్పందించలేదు. అయితే రోజు రోజుకూ కోవిడ్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆదివారం లాక్‌డౌన్ ప్రకటించింది. ఇందులో భాగంగా నిత్యావసరాలు, సేవలకు సంబంధించిన రంగాలు, ప్రభుత్వ ఉద్యోగులు రొటేషన్ పద్ధతిలో 20 శాతమే పని చేయాలని పేర్కొంది. బడులకు సెలవులిచ్చిన నేపథ్యంలో ఇక టీచర్లు బడికి వెళ్లేది లేదని స్పష్టం చేసింది. మరోవైపు ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రధాన పరీక్షల మూల్యాంకనం వాయిదా వేయాలని జూనియర్ కాలేజీల లెక్చరర్లు మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. గత రెండ్రోజులుగా ఆందోళన చేశారు. వందల మంది ఒకే చోట ఉండి మూల్యాంకనం చేయడం వల్ల ఎవరికైనా కోవిడ్ సమస్య ఉంటే అది అందరికీ వచ్చే ప్రమాద ముందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే రాష్ట్రంలో విద్యాశాఖ మాత్రం మూల్యాంకనాన్ని యథావిధిగా కొనసాగించింది. ఆదివారం జనతా కర్ఫ్యూ నేపథ్యంలో ఒక్కరోజు మూల్యాంకనాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన ఇంటర్మీడియట్ బోర్డు సోమవారం నుంచి మూల్యాంకనం కొనసాగుతుందని శనివారమే ప్రకటించింది. అయితే ఆదివారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఇంటర్మీడియట్ మూల్యాంకనం కూడా నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించడంతో లెక్చరర్లకు ఊరట లభించింది.

నేటి ఇంటర్ పరీక్షలు వాయిదా..

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించాల్సిన పరీక్షలను బోర్డు వాయిదా వేసింది. జియోగ్రఫీ-2, తెలుగు పేపర్-2, ఉర్దూ పేపర్-2, హిందీ పేపర్-2లను వాయిదా వేస్తున్నామని, ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ వెల్లడించారు.

ఓ అవ్వ నిశ్శబ్ద యుద్ధం

జనతా కర్ఫ్యూ రూపంలో కోవిడ్‌పై రాష్ట్రం మొత్తం యుద్ధమే చేస్తోంది. ఆదివారం సాయంత్రం ఐదు గంటలు కాగానే ఇళ్లలో నుంచి అంతా బయటకు వచ్చి తమ కోసం పని చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది కోసం చప్పట్లు కొడుతూ సంఘీభావం తెలిపారు. ఐదున్నర గంటల సమయంలో నిశ్శబ్దంగా ఉన్న దిల్‌సుఖ్‌నగర్ రహదారి పక్కనే ఓ అవ్వ కూర్చుని కంచంపై శబ్దం చేస్తూ కనిపించింది. 'సాక్షి' ఫొటోగ్రాఫర్ అవ్వను పలకరించగా.. 'గిట్ల సప్పుడు జేస్తే గా కరోనా మన తానికి రాదు బిడ్డా' అని తనకున్న అవగాహన మేరకు చెప్పింది.

అమిత్‌షా అభినందనలు

సాక్షి, హైదరాబాద్: జనతా కర్ఫ్యూ కార్యక్రమం రాష్ట్రంలో అద్భుతంగా అమలు కావడం పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సీఎం కేసీఆర్‌కు అభినందనలు తెలిపారు. ఆదివారం సీఎంతో ఫోన్‌లో మాట్లాడిన అమిత్ షా.. తెలంగాణ ప్రజల స్ఫూర్తిని, ప్రభుత్వ కార్యాచరణను కొనియాడారని సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంలో తెలంగాణ దేశంలోనే ముందువరుసలో నిలిచిందని షా వ్యాఖ్యానించినట్లు తెలిపాయి.

కోవిడ్‌ను నిర్మూలించేంతవరకు పోరాడండి: కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ మహమ్మారిని పారదోలేంతవరకు రాష్ట్ర ప్రజలు ఐక్యంగా పోరాడాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈనెల 31 వరకు ప్రజలంతా స్వచ్ఛందంగా స్వీయ నియంత్రణ పాటించి ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి జి.నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. లాక్‌డౌన్ సందర్భంగా పేదలకు రూ.1,500 నగదు, మనిషికి 12 కిలోల బియ్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు.

ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలి: సీపీఎం

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలని సీపీఎం డిమాండ్ చేసింది. జనతా కర్ఫ్యూ కార్యక్రమానికి ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆదివారం పార్టీ కార్యాలయంలో చప్పట్లు కొట్టి సంఘీభావం ప్రకటించారు.

లాక్‌డౌన్ హర్షణీయం: సీపీఐ

సాక్షి, హైదరాబాద్: ఈనెల 31వరకు రాష్ట్రంలో లాక్‌డౌన్ ప్రకటించడాన్ని సీపీఐ స్వాగతించింది. రేషన్ కార్డుదారులకు రూ.1,500 నగదుతో పాటు మనిషికి 12 కిలోల బియ్యం ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కరోనా విపత్తును ఎదుర్కొనేందుకు స్వీయ నియంత్రణ తప్పనిసరని, ప్రజలంతా జనతా కర్ఫ్యూను విజయవంతం చేసినట్టే రాష్ట్రంలో పరిస్థితి చక్కబడేంతవరకు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని కోరారు.

31వరకు ఏపీ లాక్‌డౌన్

- రాష్ట్ర సరిహద్దులు మూసివేత
- ప్రభుత్వ, ప్రైవేటు రవాణా వాహనాల నిలిపివేత
- మీడియా సమావేశంలో ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'దేశాన్ని భయపెడుతున్న కరోనా వైరస్ కట్టడికి ప్రజలందరం కలిసికట్టుగా పోరాడదాం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల రాకపోకలను కట్టడి చేయడం ద్వారానే కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చని ఆయన చెప్పారు. అందుకోసం ఈనెల 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా లాక్‌డౌన్‌ను ప్రకటించారు. అత్యవసర, నిత్యావసర వస్తువులు, సేవలు మాత్రం యథావిధిగా ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అంతర్రాష్ట్ర సరిహద్దులను మూసివేయడంతోపాటు రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ప్రజా రవాణా వ్యవస్థను నిలిపివేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అదే సమయంలో పేదలకు ఇబ్బంది కలగకుండా ఆదుకునేందుకు ప్రతి ఇంటికి రూ.వెయ్యితోపాటు ఉచితంగా రేషన్, కిలో పప్పు సరఫరా చేస్తామని తెలిపారు. కరోనా కట్టడి చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు పూర్తిగా సహకరించి ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో సీఎం వైఎస్ జగన్ మాట్లాడారు. కరోనా కట్టడికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సీఎం ఏమన్నారంటే..

అందరికీ అభినందనలు

- గ్రామస్థాయి నుంచి దేశం మొత్తం ఒక భయానక వాతావరణంలో కదులుతోంది. కానీ, రాష్ట్రం మాత్రం అటువంటి పరిస్థితిలోకి వెళ్లకుండా సురక్షితమైన స్థానంలోనే ఉంచిన ప్రతి గ్రామ వలంటీరుకు, గ్రామ, వార్డు సచివాలయంలోని ప్రతి మెడికల్ అసిస్టెంట్, ఆశా వర్కర్లు, పీహెచ్‌సీలలోని డాక్టర్లు, నర్సులు, మొత్తంగా ఆరోగ్యశాఖ, కలెక్టర్లు, అధికారులకు మనస్ఫూర్తిగా అభినందనలు.
- దేవుడి దయతో మిగిలిన రాష్ట్రాలు అన్నింటి కంటే మన రాష్ట్రం చాలా మెరుగ్గా ఉంది.
- రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ చర్యలు తీసుకుంటాం.
- ప్రతి నియోజకవర్గంలో 100 పడకలతో ఐసోలేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పాం.



- ప్రతి జిల్లా కేంద్రంలో కనీసం 200 పడకలతో ఐసోలేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించాం.
- రాష్ట్రంలో పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు అన్నింటినీ మార్చి 31 వరకు మూసివేయించాం. ఆ తరువాత పరిస్థితిని సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటాం.
- టెస్ట్ పరీక్షలు మాత్రం యథావిధిగా జరుగుతాయి. అక్కడ కూడా విద్యార్థుల మధ్య కనీసం రెండు మీటర్ల దూరం ఉండేలా చూడాలని ఆదేశించాం. ఎవరైనా జ్వరం, జలుబు, దగ్గు వంటి వాటితో బాధపడుతుంటే వారిని ప్రత్యేక గదిలో ఉంచి పరీక్షలు రాయించాలని అధికారులకు చెప్పాం.

పేదలకు ప్రభుత్వ సాయం

- రాష్ట్రం లాక్‌డౌన్ అంటే మొదట పేదల గురించే ఆలోచించాను. వాళ్లు ఇబ్బంది పడతారు. కానీ చేయకతప్పదు. కరోనా కట్టడి కోసం అందరం కలిసి కట్టుగా పని చేయాలి. మొత్తం మీద ఎక్కువ చేయలేకపోయినా కూడా కొద్దోగొప్పో వారి నష్టంలో భాగస్వామిని అవుతాను. అందులో భాగంగా..
- ఈనెల 29 నాటికి రేషన్ పూర్తిగా అందుబాటులో ఉంచుతాం.
- రేషన్ సరకులు ఉచితంగా ఇస్తాం. దాంతో పాటు ఒక కేజీ పప్పు ఉచితంగా ఇస్తాం.
- అంతేకాక.. రూ.వెయ్యి చొప్పున ప్రతి కుటుంబానికి ఏప్రిల్ 4న గ్రామ వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తాం.
- అందుకు రూ.1,500 కోట్లు ఖర్చు అవుతోంది.

ఏపీలో మరో పాజిటివ్

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: ఏపీలో మరో కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. ఆదివారం రాత్రికి మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య ఆరుకు చేరింది. మక్కా యాత్రకు వెళ్లి వచ్చిన 65 ఏళ్ల విశాఖ వృద్ధుడికి ఇప్పటికే కరోనా సోకగా.. తాజాగా అతడి భార్య కూడా కరోనా బారినపడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో విశాఖలో రెండు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే ఆ వృద్ధుడు ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతూ కోలుకుంటుండగా.. అతడి భార్యను ఐసోలేషన్ వార్డులో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వారి కుమార్తెకు కూడా పరీక్షలు చేయించగా నెగెటివ్ రావడంతో మరోసారి పరీక్ష కోసం నమూనాలను పంపించారు. బాధితులకు సన్నిహితంగా మెలిగిన వారి వివరాలను ఆరా తీస్తున్నారు. ఇప్పటికే బాధితుడు కలిసిన వారిని క్వారెంటైన్‌లో చేర్చించారు. అలాగే బాధితుల నివాస ప్రాంతాన్ని ఇప్పటికే అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అక్కడ మూడు కిలోమీటర్ల పరిధిలో రసాయనాలు చల్లారు. ఆ చుట్టు పక్కల వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ 164 అనుమానితుల నుంచి నమూనాలను సేకరించగా.. 142 కేసులకు సంబంధించి కరోనా వైరస్ లేదని తేలింది. 6 కేసులు మాత్రమే పాజిటివ్‌గా తేలగా, మరో 16 రిపోర్టులకు సంబంధించి ఫలితాలు రావాల్సి ఉందని వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది.

యాసంగి కొనుగోళ్లలో ఇబ్బందుల్లేకుండా చూడండి

సీఎం కేసీఆర్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీచేశారు. ఐకేపీ సెంటర్లు, పీఏసీఎస్‌లు, మార్కెట్ కమిటీల ద్వారా గ్రామస్థాయిలోనే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌లకు సూచించారు. లక్ష టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎఫ్‌సీఐ సిద్ధంగా ఉందని, సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోళ్లకు విధివిధానాలు రూపొందించాలని సీఎం తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆర్.కృష్ణయ్య లేఖ

సాక్షి, హైదరాబాద్: ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించి విధుల్లోకి తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ పథకంలో భాగంగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వంతో ఎన్నోసార్లు సంప్రదించారని, సంబంధిత శాఖ మంత్రి, అధికారుల దృష్టికి సమస్యల్ని తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతోనే ఉద్యమ బాట పట్టారన్నారు. ప్రభుత్వం వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలని, బేషజాలకు పోకుండా వారికి ఇచ్చిన నోటీసులను రద్దుచేయాలని కోరారు. ఈమేరకు ఆదివారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు లేఖ రాశారు. రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తిని అరికట్టే కార్యక్రమాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను భాగస్వామ్యం చేయాలని విన్నవించారు.

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో కోవిడ్ కోసం పడకలు

ఐసోలేషన్ కోసం కేటాయించాలని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 25 చొప్పున పడకలను కోవిడ్ అనుమానితుల కోసం ఐసోలేషన్ వార్డులుగా కేటాయించాలని ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న అన్ని ప్రైవేట్ ఆస్పత్రులూ ఈ నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. ఐదు పడకలను ఐసీయూ వార్డుల్లో, మిగిలిన 20 పడకలను ఐసోలేషన్ అవసరాల కోసం రిజర్వ్ చేసి ఉంచాలని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పేర్కొంది. ఈ సర్క్యులర్‌ను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులన్నింటికీ పంపారు. కోవిడ్ పాజిటివ్ కేసులకు చికిత్స అందించే ఉద్దేశంతో ఈ పడకలను రిజర్వ్ చేసి ఉంచాలని పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయం ఎప్పట్నుంచి అమల్లోకి వస్తుందనే విషయాన్ని స్పష్టం చేయలేదు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఇప్పటికే ఆపరేషన్ల కోసం తేదీలను నిర్ణయించిన కేసులను మరో తేదీకి వాయిదా వేయాలని ఆదేశించింది. అత్యవసర కేసులను మాత్రం యథావిధిగా ప్రాధాన్యతను బట్టి చూడొచ్చని పేర్కొంది. అయితే నిర్ణీత సర్జరీలను ఎన్ని రోజులకు వాయిదా వేయాలనే దానిపై మాత్రం సర్క్యులర్‌లో స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటిదాకా సుమారు వెయ్యికి పైగా పడకలు సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వం చెప్పింది. అవికాకుండా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల పరిధిలో ఉన్న దాదాపు 300కు పైగా ఆస్పత్రుల్లో 25 చొప్పున పడకలను అదనంగా ప్రభుత్వం సమకూర్చుకుంటోంది.

మహారాష్ట్ర నుంచి వచ్చిన వాహనాలను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మద్నూర్ మండలం సలాబత్‌పూర్ చెక్‌పోస్టు వద్ద నిలిపివేసిన దృశ్యం

మహారాష్ట్ర సరిహద్దుల మూత

బోధన్/మద్నూర్: కరోనాను కట్టడి చేసేందుకు ప్రభుత్వం అంతర్రాష్ట్ర సరిహద్దులను మూసివేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్, బోధన్ మండలంలోని సాలూర గ్రామ శివారులో గల రహదారులను మూసివేశారు. దీంతో రెండు వైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. రోడ్డుకు అడ్డంగా బారికెడ్లు పెట్టి మహారాష్ట్ర నుంచి ఎలాంటి వాహనాలను అనుమతించడం లేదు. నడుచుకుంటూ వచ్చిన వారిని కూడా తిప్పి పంపించేశారు. దీంతో జాతీయ రహదారి పూర్తిగా నిర్మానుష్యంగా కనపడింది.

జనతా కర్ఫ్యూకు వ్యతిరేక ప్రచారం

ముగ్గురిపై కేసు నమోదు

సంగారెడ్డి అర్బన్: జనతా కర్ఫ్యూకు వ్యతిరేకంగా ప్రజలందరూ రోడ్లపైకి రావాలని ప్రధాన మంత్రిపై తీవ్ర పదజాలంతో ప్రజలను రెచ్చగొట్టిన సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదైంది. డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ప్రధాని నరేంద్ర మోదీపై అసభ్య పదజాలంతో ఈ నెల 21న సాయంత్రం మహ్మద్ షమీ(34వ వార్డు కౌన్సిలర్), మహ్మద్ ఆర్ఫాత్, వాహిదోద్దీన్ అహ్మద్‌లు కలసి వీడియో రికార్డింగ్ చేసి వాట్సాప్‌లో పెట్టారు. ఈ వీడియో వైరల్ కావడంతో ప్రజా శాంతికి భంగం కలిగే విధంగా, ప్రజల మధ్య విదేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడటంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మహ్మద్ షమీపై గతంలో మత అల్లర్లలో నేర చరిత్ర ఉంది.

పోలీసుల వ్యూహం.. జనతా కర్ఫ్యూ జయప్రదం

జయహో జనతా..

- 33 జిల్లాల్లో విజయవంతంగా అమలు
- ఉదయాన్నే ఎస్పీలు, కమిషనర్లతో మహేందర్‌రెడ్డి టెలీకాన్ఫరెన్స్

'జనతా కర్ఫ్యూ'లో పాల్గొనకుండా రోడ్లపై తిరుగుతున్న యువకుల చేత ఖైరతాబాద్‌లో కోవిడ్ ప్రచారం చేయిస్తున్న పోలీస్

సాక్షి, హైదరాబాద్ : కరోనా మహమ్మారి కట్టడిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూ అమలుకు పోలీసులు తమదైన వ్యూహంతో ముందుకు సాగారు. ఓవైపు కేంద్రం పధ్నాలుగు గంటలు, రాష్ట్రం 24 గంటల పరిధిలో కర్ఫ్యూ విధించడంతో రెండింటిని ఒకేసారి విజయవంతంగా అమలు చేశారు. ముందురోజైన శనివారం రాత్రి అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో డీజీపీ మహేందర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారం ఉదయం కూడా మరోసారి సమావేశమై పలు సూచనలు చేశారు. జనతా కర్ఫ్యూపై ఇప్పటికే విస్తృతమైన ప్రచారం కల్పించడంలో సఫలమైన పోలీసులు బందోబస్తు విషయంపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల ఎస్పీలకు డీజీపీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్‌ల నుంచి ఎలాంటి వాహనాలను రానీయకుండా చెక్‌పోస్టుల ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. దీంతో రాష్ట్ర రహదారులతోపాటు, జాతీయరహదారులు వాహనాలు లేక సైతం బోసిపోయాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూకు అదనంగా సీఎం కేసీఆర్ కర్ఫ్యూ వేళలు పొడిగించడంతో పోలీసులు డబుల్ డ్యూటీ నిర్వహించాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి సోమవారం ఉదయం వరకు ఈ కర్ఫ్యూను అమలు చేసేందుకు ముందుగా నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం వ్యవహరించి విజయవంతమయ్యారు.

ప్రజల నుంచి అపూర్వ స్పందన..

పట్టణాల్లో, జిల్లాల్లో జనతా కర్ఫ్యూకు పెద్ద ఎత్తున ఆదరణ లభించింది. విపత్కర సమయమని తెలిసినా... తమకోసం మాస్కులు వేసుకుని మరీ విధులు నిర్వహిస్తోన్న పోలీసులకు పలుచోట్ల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. సోషల్ మీడియాలోనూ పోలీసుల పనితీరుపై ప్రశంసల జల్లు కురిసింది. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో పోలీసుల పని చాలాచోట్ల సులభతరంగా మారింది. అన్ని జిల్లా ఎస్పీ, కమిషనర్ ఆఫీసులలోని కమాండ్ కంట్రోల్ రూముల నుంచి పరిస్థితిని సమీక్షించారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు డీజీపీ కార్యాలయానికి చేరవేశారు. కొన్నిచోట్ల కరోనాపై తప్పుడు వార్తలు, పోస్టులు షేర్ చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కర్ఫ్యూ నిబంధనలను ఉల్లంఘించి రోడ్డు మీదకు వచ్చిన వారి చేత పోలీసులు కరోనా వైరస్ ఫ్లకార్డులు ఇచ్చి కొద్దిసేపు ప్రచారం చేయించారు.

➤ మొదటి పేజీ తరువాయి

కూడా జనసంచారం కనిపించలేదు. నిత్యం రద్దీగా ఉండే రైతు బజార్లు, మార్కెట్లకు కూడా ప్రజలు వెళ్లలేదు. ఆదివారం బంద్ ఉంటుందనే ఉద్దేశంతో శనివారమే నిత్యావసరాలు, పాలు, కూరగాయలు తెచ్చుకున్న ప్రజానీకం రోజంతా ఇళ్లలోనే ఉండిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర్రాష్ట్ర సరిహద్దులను మూసివేయడంతో ఇతర రాష్ట్రాల నుంచి ఒక్క వాహనం కూడా మన రాష్ట్రంలోకి ప్రవేశించలేదు. మన రాష్ట్రంలో కూడా రోడ్లపై వాహనాలు కనిపించలేదు. ఒకటో, రెండో వాహనాలు తిరిగినా హైదరాబాద్‌లో రోడ్లన్నీ బోసిపోయాయి. శనివారమే రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో కర్ఫ్యూ గురించి ప్రచారం చేయడంతో ఎవరూ బయటకు వచ్చేందుకు సాహసించలేదు. కొందరు బయటకు వచ్చినా వారికి పోలీసులు కౌన్సిలింగ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో అనవసరంగా బయటకు వచ్చిన వారితో సామాజిక సేవ చేయించారు. కరోనా విస్తరించకుండా అనుసరించాల్సిన పద్ధతులతో కూడిన పోస్టర్లను రోడ్లపై వారితో ప్రదర్శింపజేశారు. కాగా, మారుమూల గ్రామాల్లోని ప్రజలు కూడా స్వచ్ఛందంగా కర్ఫ్యూలో పాల్గొనడం విశేషం. పల్లెల్లోనూ ఎవరూ ఇళ్ల నుంచి అనవసరంగా బయటకు రాలేదు. అత్యవసరమైతే తప్ప వ్యవసాయ పనులకు కూడా వెళ్లకపోవడం గమనార్హం. ఇక, పట్టణాలు, నగరాల్లో యథావిధిగా కర్ఫ్యూ పాటించారు. ఉదయం నుంచే గల్లీల్లో నిర్మానుష్య వాతావరణం కనిపించింది. చిన్న చిన్న సందుల్లో ఉండే దుకాణాలు సైతం బంద్ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మొత్తంమీద ఆదివారమంతా రాష్ట్రంలో అనవసర సంచారం లేకుండా ప్రజలు సామాజిక స్ఫూర్తిని చాటి చెప్పారు.

రాజకీయులకు 'రిలీఫ్'..

బంద్‌లయినా, కర్ఫ్యూలయినా ఎప్పుడూ బిజీగా ఉండే రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆదివారం రిలాక్స్ అయ్యారు. చాలాకాలం తర్వాత తమ ఇళ్లలో కుటుంబ సభ్యులతో ఎక్కువ సేపు గడిపారు. సీఎం కేసీఆర్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షలు, సమావేశాల్లో బిజీగా ఉండగా, రాష్ట్ర మంత్రులు ఎక్కువ మంది ఇళ్లకే పరిమితమయ్యారు. మరికొందరు మంత్రులు కూడా ప్రగతి భవన్‌లో సమీక్షలకు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా తమ తమ ఇళ్లకే పరిమితం అయిపోయారు.

సిరిసిల్లలో కరతాళధ్వనులతో పోలీసులకు, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రజలు

చప్పట్లకు జననీరాజనం..

ఇక సాయంత్రం 5 గంటలకు బాల్కనీలు, కుడళ్లలోకి వచ్చి చప్పట్లు కొట్టడం ద్వారా ఐక్యతా సంకేతాన్ని చాటి చెప్పడం రాష్ట్ర ప్రజల నిబద్ధతను చాటిచెప్పింది. కేసీఆర్ ప్రగతిభవన్‌లో తన కుటుంబ సభ్యులు, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, పలువురు మంత్రులు, తన కార్యాలయ అధికారులతో కలసి చప్పట్లు కొట్టి... అత్యవసర వైద్య, శానిటేషన్, ఇతర సిబ్బందికి మద్దతు తెలిపారు. గవర్నర్ తమిళిసై కూడా రాజ్‌భవన్‌లో తన సిబ్బందితో కలసి చప్పట్లు కొట్టారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపార, సినీ ప్రముఖులే కాకుండా సామాన్య ప్రజానీకం కూడా తమ మద్దతును పెద్ద ఎత్తున తెలిపారు. మారుమూల గ్రామాల నుంచి హైదరాబాద్ వరకు సాయంత్రం ఐదు గంటల సమయంలో మారుమోగిపోయింది.

ఎస్సీఎంలో 'కర్ఫ్యూ' బేఖాతర్

సాక్షి, ఆసిఫాబాద్: కరోనా మహమ్మారిని నిలువరించేందుకు దేశవ్యాప్తంగా జనతా కర్ఫ్యూ పాటించగా.. సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్సీఎం) మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను బేఖాతరు చేసింది. ఆదివారం కార్మికులు యథావిధిగా విధులకు హాజరుకావడం వివాదాస్పదమైంది. ఉదయం 6 గంటల షిఫ్టులో పేపర్ మిల్లులోకి 300 మంది కార్మికులు పనులకు వెళ్లారు. దీనిపై కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మధ్యాహ్నం 2 గంటల షిఫ్టు కార్మికులు విధుల్లోకి వెళ్లలేదు. జనతా కర్ఫ్యూ పాటించకపోవడంపై కంపెనీ జీఎం (ఐఆర్) అలోక్ శ్రీవాత్సవ స్పందిస్తూ అత్యవసర విభాగాలైన విద్యుత్, నీటి సరఫరా, బాయిలర్ కొనసాగింపు పనుల్లో కొంత మంది కార్మికులు మాత్రమే హాజరయ్యారని పేర్కొన్నారు.

మూడు పెళ్లిళ్లు వాయిదా

దండేపల్లి/ఇంద్రవెల్లి: పీటల దాకా వచ్చిన వివాహాలకు జనతా కర్ఫ్యూ అడ్డుగా నిలిచింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రాజుగూడ పంచాయతీ పరిధిలోని కుంటలగూడకట్టలో ఆదివారం ఉదయం ఓ ఇంట్లో పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పెళ్లికి సంబంధించి అధికారులకు సమాచారం అందడంతో పోలీసులు, పంచాయతీ అధికారులు పెళ్లింటి వారితో మాట్లాడి, వారికి కరోనా గురించి అవగాహన కల్పించారు. అధికారులు సూచన మేరకు పెళ్లివారు వివాహాన్ని వాయిదా వేసుకున్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని సమాక గ్రామానికి చెందిన పెళ్లి కూతురిని ఆదివారం సిరికొండ మండలంలోని కుంట గ్రామానికి తీసుకెళ్లి పెళ్లి నిర్వహించాల్సి ఉండగా జనతా కర్ఫ్యూతో వాయిదా వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం గోయాగాంలోనూ ఓ వివాహం వాయిదా పడింది.

40 మంది యాత్రికులకు కరోనా పరీక్షలు

కాశిబుగ్గ : ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన కొంత మంది తీర్థయాత్రికులకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం కరోనా వైరస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన 40 మంది తీర్థయాత్రికులు ఈ నెల 11న వారణాశి(కాశీ) యాత్రకు వెళ్లారు. వారు స్వస్థలాలకు తిరిగి రావడానికి విమానాలు, రైళ్లు, బస్సులు లేకపోవడంతో గుంటూరు, ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన వీరు ఒక ప్రైవేట్ బస్సును మాట్లాడుకొని పెనుగంగ మీదుగా తిరిగి వస్తుండగా ఆదిలాబాద్ సమీపంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ప్రయాణికులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఢిల్లీ వాసికి కూడా కరోనా నెగెటివ్

ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

నల్లగొండ టౌన్ : మత ప్రచారకులకు సహాయకుడిగా వచ్చిన ఢిల్లీకి చెందిన వ్యక్తికి కూడా కరోనా నెగెటివ్‌గా రిపోర్ట్ వచ్చింది. వియత్నానికి చెందిన 12 మంది మత ప్రచారకులకు సహాయకులుగా ఢిల్లీకి చెందిన వ్యక్తితో పాటు ఒడిశాకు చెందిన మరో వ్యక్తి నల్లగొండకు వచ్చిన విషయం తెలిసిందే. ఆ 14 మందిని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ హైదరాబాద్‌లోని ఫీవర్ ఆస్పత్రిలో చేర్పించి కరోనా పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. శనివారం 13 మందికి కరోనా నెగెటివ్ రిపోర్టు రాగా, తాజాగా ఢిల్లీకి చెందిన వ్యక్తికి కూడా నెగెటివ్ వచ్చిందని వైద్య ఆరోగ్య శాఖాధికారి కొండల్‌రావు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ, 3&4 అంతస్తులు, పాములపాటి శివయ్య, కాంప్లెక్స్, కొరిటిపాడు, గుంటూరు

ఆర్.సి.నెం.2701/B4-4/2020-21 **ఆర్.డి.సి.-సెట్-2020** తేది: 19.03.2020

ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, నాగార్జునసాగర్, గుంటూరు జిల్లా (పురుషులు) మరియు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల (కో-ఎడ్యూకేషన్), కర్నూలులో 2020-21 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం డిగ్రీలో ప్రవేశానికి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం మార్చ్ 2020 పరీక్షకు హాజరైన తెలంగాణ రాష్ట్ర అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది. **తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు** ప్రవేశ పరీక్ష **హైదరాబాద్‌లో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలలో** తేది. 14.05.2020 నాడు జరుపబడును. **దరఖాస్తులు తేది:** 23.03.2020 సాయంత్రం నుండి 22.04.2020 వరకు, **రూ.250.00 రుసుము** చెల్లించి **http://aprjdc.apcfss.in** సైట్ ద్వారా పొందగలరు. ఇతర వివరాలకు **http://aprjdc.apcfss.in** సైట్‌ను సందర్శించగలరు.

సం/- ఎం.ఆర్.ప్రసన్న కుమార్, కార్యదర్శి

DIPR.Ro.No.974-PP/CL/Advt/1/2019-20, Dt: 20/03/2020

జనతా కర్ఫ్యూలో భాగంగా ఆదివారం సాయంత్రం వరంగల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఎదుట చప్పట్లు కొడుతున్న పోలీసులు

138 ఎలక్ట్రిక్ వెహికల్

చార్జింగ్ స్టేషన్లు

జ్యోతినగర్: కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో 138 ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు కాబోతున్నాయి. ఈ క్రమంలో రాజస్థాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంట్స్ లిమిటెడ్ (ఆర్ఈఐఎల్), నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ), ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సంస్థలు ఏర్పాటు చేయబోతున్నాయి. రాష్ట్ర నోడల్ ఏజెన్సీ అయిన టీఎస్ ఆర్ఈడీసీవో (తెలంగాణ స్టేట్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) డీహెచ్ఐ షార్ట్ లిస్ట్ చేసిన ఏజెన్సీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సూత్రప్రాయంగా అనుమతి పొందారు. రాష్ట్రంలో చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం కోసం రాష్ట్రం ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

మా ఊర్లోకి రావొద్దు

దుబాయ్ నుంచి వచ్చిన ఇద్దరిని అడ్డుకున్న గ్రామస్తులు

- కర్ణాటక నుంచి వచ్చిన మరొకరిని కూడా.. ఆస్పత్రికి తరలింపు

లింగంపేట: విదేశాల నుంచి సొంతూర్లకు వస్తున్న వారికి పెద్ద సమస్య వచ్చిపడింది. కరోనా వైరస్ నేపథ్యంలో దుబాయ్ నుంచి వచ్చిన ఇద్దరిని, కర్ణాటక నుంచి వచ్చిన మరొకరిని గ్రామాల్లోకి రానివ్వడం లేదు. 'మా ఊర్లోకి రావొద్దు' అంటూ అడ్డుకున్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పొల్కంపేటకు చెందిన రాములు ఆదివారం దుబాయ్ నుంచి హైదరాబాద్ చేరుకున్నాడు. అతడు ప్రైవేట్ వాహనంలో గ్రామానికి రాగా.. స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఆయన లింగంపేట అంబేడ్కర్ చౌరస్తాలో బైఠాయించాడు. సమాచారం అందుకున్న అధికారులు రాములును ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే, అక్కడి సిబ్బంది వెనక్కు పంపించడంతో అతడు చౌరస్తాకు చేరుకోగా, ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అలాగే, పర్మళ్లకు చెందిన అనిల్‌కుమార్ కర్ణాటకలోని బళ్లారి నుంచి ఆదివారం గ్రామానికి చేరుకోగా, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అదే గ్రామానికి చెందిన ప్రశాంత్‌కుమార్ దుబాయ్ నుంచి రాగా, అతడ్ని కూడా స్థానికుల కోరిక మేరకు ఆదివారం వైద్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు.

పొల్కంపేట గ్రామస్తులు రానివ్వకపోవడంతో లింగంపేటలో నిరీక్షిస్తున్న రాములు

బోసిపోయిన హైవే

జనతా కర్ఫ్యూ నేపథ్యంలో ఆదివారం వాహనాలు లేక జాతీయ రహదారులు నిర్మానుష్యంగా మారాయి. హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న పంతంగి, కొర్లపహాడ్, బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్ ప్లాజాలు బోసిపోయాయి. జాతీయ రహదారి 65పై రోజంతా కలిపి 25-30 వేల వరకు వాహనాలు రాక పోకలు సాగించేవి. అలాంటిది ఆదివారం రోజున కేవలం పది వాహనాలు మాత్రమే వెళ్లినట్టు జీఎంఆర్ సిబ్బంది తెలిపారు.

- నల్లగొండ

నిబంధనలు ఉల్లంఘించిన దంపతులపై కేసులు

కాజీపేట రూరల్: బెంగళూరు నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో శనివారం ప్రయాణించిన ఇండోనేసియా విహార యాత్రకు వెళ్లి వచ్చిన దంపతులపై కేసు నమోదు చేసినట్లు కాజీపేట జీఆర్‌పీ ఎస్సై జితేందర్ రెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భార్యాభర్తలు రోహిత్‌కుమార్, పూజాయాదవ్ ఇటీవల ఇండోనేసియాకు విహార యాత్రకు వెళ్లి ఈనెల 20న హైదరాబాద్ వచ్చారు. హోమ్ క్వారంటైన్‌లో ఉండాల్సిన రోహిత్, పూజలు స్టాంపింగ్‌తో 21న రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఉత్తరప్రదేశ్‌కు వెళుతుండగా.. కరోనా అనుమానితులుగా గుర్తించిన ప్రయాణికులు కాజీపేటలో దింపిన విషయం విదితమే. ప్రభుత్వ ఆదేశాలను నిర్లక్ష్యం చేసినందుకు వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సంపర్క్ క్రాంతి రైలులోనూ..

ఆస్ట్రేలియా సిడ్నీ నుంచి వచ్చిన కరోనా అనుమానితుడు రవికిరణ్ బెంగళూర్ నుంచి హజరత్ నిజాముద్దీన్ వెళ్లే కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించగా.. భువనగిరిలో అతడిని దింపారు. అతడిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్సై జితేందర్ రెడ్డి తెలిపారు.

హోం క్వారంటైన్‌కు నిరాకరించిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట: విదేశాల నుంచి వచ్చిన వారు స్వీయ నిర్బంధంలో ఉండాలని అధికారులు చెబుతున్నప్పటికీ నిరాకరించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్‌కు చెందిన తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఈ నెల 18న దుబాయ్ నుంచి ఇంటికి వచ్చాడు. మొదటి రోజే శ్రీనివాస్‌గౌడ్‌ను స్వీయ నిర్బంధం కావాలని అధికారులు కోరారు. అయినా అతను బయట తిరగడం ప్రారంభించాడు. ఈ నెల 21న అధికారులు ఆయన ఇంటి వద్దకు వెళ్లే సరికి ఫ్రిజ్ కొనుగోలు కోసమని సిరిసిల్లకి వెళ్లాడు. దీంతో ఆగ్రహించిన అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం అర్ధరాత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై స్వీయ నిర్బంధ నిరాకరణ కేసు నమోదు చేశారు.



వైద్య సిబ్బంది చేస్తున్న సేవలకు సంఘీభావంగా జనతా కర్ఫ్యూ సాయంత్రం చప్పట్లు కొడుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఆయన సతీమణి సవితా

ఢిల్లీలోని ఇండియా గేట్ వద్దకు వెళ్లే పవర్ రైసినా హిల్ ప్రాంతం ఆదివారం జనతా కర్ఫ్యూలో భాగంగా నిర్మానుష్యంగా మారిన దృశ్యం.

ముంబైలోని చావల్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు బాల్కనీల్లోకి వచ్చి సంఘీభావంగా చప్పట్లు కొడుతున్న స్థానికులు

కరోనాకు మరో ముగ్గురి బలి

దేశంలో 360కి చేరిన కరోనా కేసులు • దేశవ్యాప్తంగా 80 జిల్లాల్లో లాక్‌డౌన్‌కు కేంద్రం ఆదేశం

31 వరకు అన్ని రైళ్లు, అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు నిలిపివేత • దేశ రాజధాని సహా పలు రాష్ట్రాలు లాక్‌డౌన్‌లోకి

'జనతా కర్ఫ్యూ'పై జనం స్పందనకు ప్రధాని మోదీ ధన్యవాదాలు • ఇది దీర్ఘకాలిక యుద్ధానికి ఆరంభమని వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశంలో ఆదివారం మరో ముగ్గురు కోవిడ్-19 (కరోనా వైరస్) బారిన పడి చనిపోవడంతో మొత్తం మరణాల సంఖ్య ఏడుకు చేరింది. బిహార్, గుజరాత్‌లో తొలి మరణాలు నమోదయ్యాయి. భారత్‌లో ఇప్పటివరకు కరోనా బాధితుల సంఖ్య 360కి చేరినట్లు అధికారులు తెలిపారు. మహారాష్ట్రలో అత్యధికంగా 67 కరోనా కేసులను గుర్తించగా కేరళలో 52, ఢిల్లీలో 29 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కరోనా వైరస్ ప్రభావం ఉన్నట్లు గుర్తించిన 17 రాష్ట్రాల్లోని 80 జిల్లాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లో లాక్‌డౌన్'కు ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమయంలో నిత్యావసరాలు, అత్యవసర సేవల కోసం మాత్రమే బయటకు అనుమతిస్తారని కేంద్ర హోంశాఖ అధికారులు స్పష్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీ ఈ నెల 31 వరకు లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయింది.

31 వరకు రైళ్లు, అంతర్రాష్ట్ర బస్సులు బంద్

కరోనా మహమ్మారి విస్తరించకుండా మార్చి 31 అర్ధరాత్రి వరకు అన్ని రైళ్లు, మెట్రో రైళ్లు, సబర్బన్ రైళ్లు, అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 22వ తేదీ అర్ధరాత్రి నుంచే ప్రయాణికుల రైళ్లన్నీ రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. కేవలం సరుకు రవాణా చేసే గూడ్స్ రైళ్లను మాత్రమే అనుమతిస్తారు. మార్చి 22వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరిన రైళ్లను మాత్రం గమ్యస్థానం చేరేందుకు అనుమతిస్తారు. ప్రయాణాలను రద్దు చేసుకునే వారికి డబ్బులు పూర్తిగా వెనక్కి చెల్లిస్తామని రైల్వే శాఖ తెలిపింది. ఆదివారం అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ప్రధాని ముఖ్య కార్యదర్శి సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

- ఇటీవల కతార్ నుంచి తిరిగి వచ్చిన 38 ఏళ్ల కిడ్నీ బాధితుడు కరోనా లక్షణాలతో ఆదివారం చనిపోయినట్లు పట్నా ఎయిమ్స్ సూపరింటెండెంట్ తెలిపారు. కరోనాతో ముంబైలో 63 ఏళ్ల వృద్ధుడు చనిపోగా సూరత్‌లో 67 ఏళ్ల వృద్ధుడు కూడా దీని బారిన పడి మృత్యువాత పడ్డారు.
- యూపీలో 27, రాజస్తాన్‌లో 24, హరియాణాలో 21, కర్ణాటకలో 26 కరోనా కేసులు నమోదు కాగా పంజాబ్‌లో 21, గుజరాత్‌లో 18, లడఖ్‌లో 13 కేసులు గుర్తించారు. తమిళనాడులో ఆరు కేసులు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్, జమ్మూ కశ్మీర్, పశ్చిమ బెంగాల్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి.
- అనుమానితుల నమూనాలు పరీక్షించేందుకు ల్యాబ్‌ల సంఖ్యను పెంచనున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, యూపీ, పంజాబ్, కర్ణాటక, తమిళనాడు, కేరళలోని పలు జిల్లాల్లో లాక్‌డౌన్‌కు కేంద్రం ఆదేశించింది.
- జమ్మూ కశ్మీర్‌లోనూ ఈనెల 31 వరకు లాక్‌డౌన్‌కు ఆదేశించారు.
- ఢిల్లీలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి మార్చి 31 అర్ధరాత్రి వరకు లాక్‌డౌన్ ఆదేశిస్తూ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదేశాలు జారీ చేశారు. నిరసనలు, సమావేశాలు, ప్రజలు గుమిగూడటంపై నిషేధాజ్ఞలు విధించారు.



- సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి మార్చి 27 వరకు కోల్‌కతాతోపాటు పలు ప్రాంతాల్లో లాక్‌డౌన్ పాటించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆదేశించింది.
- పారా మిలటరీ బలగాల కదలికలపై కూడా నియంత్రణ విధించిన కేంద్రం ఏప్రిల్ 5 వరకు ఎక్కడి సిబ్బంది అక్కడే ఉండాలని ఆదేశించింది.
- 13,523 ప్యాసింజర్ రైళ్లు మార్చి 31 అర్ధరాత్రి వరకు రద్దయ్యాయి. కరోనా వైరస్ లక్షణాలు కలిగిన కొందరు వ్యక్తులు రైళ్లలో ప్రయాణిస్తున్నట్లు గుర్తించినందున ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.
- ఆదివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక లాక్‌డౌన్ ప్రకటిస్తున్నట్లు నాగాలాండ్ తెలిపింది.
- మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా కార్ల కంపెనీలు తమ ప్లాంట్లలో తయారీని నిలిపివేయాలని నిర్ణయించాయి.
- ఫియట్ కంపెనీ కూడా ఈ నెలాఖరు వరకు తయారీని నిలిపివేసింది.
- హీరో మోటో కార్ప్, హోండా కూడా బైక్‌ల తయారీని నిలిపివేశాయి.

సుదీర్ఘ సంగ్రామానికి ఆరంభం: ప్రధాని మోదీ

కరోనాపై పోరాటానికి సంఘీభావం తెలిపిన దేశ ప్రజలకు ధన్యవాదాలు

కరోనాపై దీర్ఘకాలిక యుద్ధానికి 14 గంటల 'జనతా కర్ఫ్యూ'ఆరంభం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశం యావత్తూ ఏకమై ఏ సవాల్‌నైనా ఎదుర్కోగలమని రుజువు చేసిందని చెప్పారు. 'జనతా కర్ఫ్యూ ఈరోజు రాత్రి 9 గంటలకు ముగియవచ్చు కానీ దీని అర్థం మనం సంబరాలు చేసుకోవాలని కాదు. స్వయం ప్రకటిత కర్ఫ్యూను విజయంగా భావించకూడదు. సుదీర్ఘ సంగ్రామానికి ఇది ఆరంభం మాత్రమే. గంటలు, వాయిద్యాలు మోగించడం ద్వారా కరోనాపై పోరాడుతున్న సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన దేశ ప్రజలను అభినందిస్తున్నా'అని ట్విట్టర్‌లో ప్రధాని పేర్కొన్నారు.

అంతా ఇళ్లలోనే.. మార్మోగిన చప్పట్లు

ప్రధాని మోదీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా స్వచ్ఛందంగా 'జనతా కర్ఫ్యూ'పాటించిన ప్రజలు రోజంతా ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం 5 గంటల సమయంలో బాల్కనీల వద్దకు చేరుకుని గంటలు మోగించి వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియచేశారు. - ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా, జుహూ బీచ్, బాంద్రా-వర్లీ సీ లింక్ జనతా కర్ఫ్యూతో జనసంచారం లేక బోసిపోయాయి. ఛత్రపతి శివాజీ టెర్మినస్ (సీఎస్‌టీ), ఇతర సబర్బన్ రైల్వే స్టేషన్లు ఖాళీగా కనిపించాయి. గోవా చర్చి, ఇతర చోట్ల ఆదివారం ప్రార్థనలు రద్దయ్యాయి. కోల్‌కతాలో ఎప్పుడూ రద్దీగా ఉండే ఎస్ప్లనేడ్, డల్హౌసీ హౌస్ ఏరియా ప్రాంతాలతోపాటు ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్లు జనం లేక వెలవెలపోయాయి. గుజరాత్‌లోని ప్రధాన నగరాలు అహ్మదాబాద్, సూరత్, వడోదర, రాజ్‌కోట్‌లో చాలా స్వల్ప సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చారు.

పక్షుల కిలకిలా రావాలు వింటున్నారా?

జనతా కర్ఫ్యూ సందర్భంగా ట్విట్టర్ వినియోగదారులు..

న్యూఢిల్లీ: కొందరు ఇళ్లలో గరిటె తిప్పగా.. మరికొందరు ఉదయం నుంచే పుస్తకాలు చేత పట్టారు. ఇంకొందరైతే చెట్లపై నుంచి వినిపించే పక్షుల కిలకిలా రావాలు వింటూ గడిపారు. జనతా కర్ఫ్యూ సందర్భంగా జనాలు ట్విట్టర్‌లో పంచుకున్న అనుభవాలివీ... ఎప్పుడూ రణగొణ ధ్వనులతో బిజీగా ఉండే ముంబై నగరానికి చెందిన ట్విట్టర్ యూజర్ వందన కుమార్ 'ప్రకృతి పిలుపు'అని ట్వీట్ చేయగా.. రచయిత స్మిత బరూహ్ 'నెమలి పిలుపుతో మేల్కొన్నా..'అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు. 'నా ఇంటి పరిసరాల్లో ఒక్క వ్యక్తి కానీ, కారు కానీ కదలడం చూడలేదు. మీరు కోకిల ఇతర పక్షుల గొంతును వినగలుగుతున్నారా? నేను నెమలి పిలుపుతో మేల్కొన్నాను..'బరూహ్ పేర్కొన్నారు. పక్షుల కిలకిల రావాలకు సంబంధించి 6,400 ట్వీట్లతో ట్రెండింగ్ టాపిక్‌గా 'బర్డ్'నిలిచింది. దేశవ్యాప్తంగా నిర్మానుష్య రోడ్ల ఫొటోలు షేర్ చేస్తూ 3.4 లక్షల మంది ట్వీట్లతో 'జనతా కర్ఫ్యూ'ట్రెండింగ్‌లో నిలిచింది.

వైరస్ మరణాలు 13 వేలు

నేడు ముగియనున్న పార్లమెంటు!

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలపై కరోనా వైరస్ ప్రభావం పడింది. కరోనా భయంతో చాలారాష్ట్రాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో తృణమూల్ కాంగ్రెస్‌తోపాటు చాలా పార్టీలు సమావేశాలకు హాజరుకాకూడదని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ సమావేశాలను కుదించే అవకాశముందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సోమవారం ఆర్థిక బిల్లు ఆమోదం తర్వాత సమావేశాలను ముగించే అవకాశముందన్నాయి. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 3 వరకు సమావేశాలు జరగాల్సి ఉండగా, సోమవారమే నిరవధిక వాయిదా పడే అవకాశముంది. దీంతో 12 రోజులు ముందుగానే సమావేశాలు ముగిసినట్లవుతుంది.

జపనీయులకు ఆధార్!

సాక్షి ప్రతినిధి, చెన్నై: జపాన్ దేశస్తులైనప్పటికీ, భారత పౌరసత్వ కార్డు ఆధార్‌ను కలిగిన ఒక మహిళ సహా ముగ్గురు జపనీయులను తమిళనాడు క్యూబ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడులోని గుమ్మిడిపూండి సమీపంలో రెవెన్యూ, పోలీస్, వైద్యాధికారులు అధికారులు కరోనా వైరస్ పరిశోధనల్లో భాగంగా శనివారం రాత్రి వాహన తనిఖీ చేశారు. అటుగా వచ్చిన ఓ కారులో నహూమీ యామిషాడా(40) అనే మహిళతోపాటు షిన్యా హరాడా (43), నసారు నకజిమా (57) అనే ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వీరంతా జపనీయులు కాగా, వారి పేర్ల మీద ఆధార్‌కార్డులు ఉండడంతో పోలీసులు నివ్వెరపోయారు. వీరంతా ఆంధ్ర-తమిళనాడు సరిహద్దులోని ఆరంబాక్కంలో నివసిస్తూ చెన్నై పుదువాయల్‌లో నిర్మాణంలో ఉన్న మహేంద్ర సిటీలో పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. బెంగళూరు, హరియాణా, గుర్గావ్ ప్రాంతాల చిరునామాతో ఆ ఆధార్‌కార్డులు జారీ అయ్యాయి.

క్రొయేసియాలో భూకంపం

జగ్రెబ్: క్రొయేసియాను భారీ భూకంపం కుదిపేసింది. ఆదివారం రాజధాని నగరంలో సంభవించిన ఈ భూకంపంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అలాగే భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ఓ 15ఏళ్ల బాలుడి పరిస్థితి క్లిష్టంగా ఉందని, ఈ ఘటనలో పలువురు గాయపడ్డారని స్థానిక వార్తా సంస్థ వెల్లడించింది. 'రిక్టరు స్కేలుపై 5.3 తీవ్రతతో రాజధాని జగ్రెబ్‌లో ఆదివారం ఉదయం 6.23 గంటలకు భూకంపం సంభవించింది. 140 ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపమని దేశ ప్రధాని అంద్రేజ్ ప్లెన్‌కోవిక్ తెలిపారు. భూకంప తీవ్రతకు జగ్రెబ్‌లోని చాలా భవనాలు బీటలు వారాయి.

రోమ్/ప్యారిస్/లండన్: కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తోంది. ఊహించనంత వేగంతో విస్తరిస్తున్న ఈ మహమ్మారితో ప్రజలు భయం గుప్పిట్లో గడుపుతున్నారు. వారాంతపు సెలవుల్లో గడపాల్సిన కోట్లాది మంది ప్రజలు కోవిడ్ భయంతో ఆదివారం ఇళ్లకే పరిమితమయ్యారు. ఆదివారం యావత్ భారత్ లాక్‌డౌన్ పాటించింది. ప్రజలంతా ఇళ్లకే పరిమితమై స్వయం కర్ఫ్యూ పాటించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 3,08,130 మందికి వ్యాధి సోకగా ఆదివారం ఒక్కరోజే 1,702 మృతి చెందడంతో మొత్తం మరణాలు 13,444కు చేరుకున్నాయి. వీరిలో ఒక్క ఇటలీ దేశస్తులే 651 మంది ఉన్నారు. సుమారు 170 దేశాలకు వైరస్ వ్యాపించగా దీని విస్తృతిని అడ్డుకునేందుకు ప్రభుత్వాలు తీసుకున్న చర్యలతో 100 మంది ఇళ్లకే పరిమితమయ్యారు. 35 దేశాలు సరిహద్దులను మూసి వేసుకున్నాయి. అయితే, మరణాలు, బాధితుల సంఖ్య వెల్లడించిన వాటికంటే ఎక్కువగానే ఉండవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇలా ఉండగా, బ్రిటన్ రాణి ఎలిజబెత్ వద్ద పనిచేసే ఉద్యోగిని కూడా వైరస్ సోకినట్లు తేలడంతో బకింగ్‌హామ్ ప్యాలెస్ అధికారులు మరింత అప్రమత్తమయ్యారు.

బయటకు వస్తే జరిమానా

యూరప్ మొత్తమ్మీద 1,52,117 కరోనా కేసులు నిర్ధారణ కాగా అందులో ఒక్క ఇటలీలోనే 59 వేల వరకు ఉన్నాయి. ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్ ఇతర యూరప్ దేశాల ప్రభుత్వాలు తమ పౌరులను ఇళ్లలోనే ఉండిపోవాలని సూచించాయి. బయటకు వచ్చిన వారిపై జరిమానాలు తప్పవని హెచ్చరించాయి. యూరప్‌లో మరణాల సంఖ్య 7,802 కాగా తీవ్రంగా ప్రభావితమైన ఒక్క ఇటలీలోనే ఆదివారం 651 మంది ప్రాణాలు కోల్పోవడంతో మొత్తం మరణాల సంఖ్య 5,476కు చేరుకుంది. ప్రపంచవ్యాప్త మరణాల్లో ఇది మూడో వంతు కావడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో అన్ని అత్యవసరేతర సంస్థలను మూసివేయాలని ఇటలీ ప్రధాని గిసెప్ కాంటే ఆదేశించారు. స్పెయిన్‌లో 24 గంటల వ్యవధిలో 394 మంది ప్రాణాలు కోల్పోగా మొత్తం మరణాలు 1,720కు చేరుకున్నాయి. ఫ్రాన్సులో మొత్తం 562 మంది కోవిడ్‌తో చనిపోయారు. ప్రజలంతా ఇళ్లకే పరిమితం కావాలని, అత్యవసరాలను సరఫరా చేసేందుకు హెలికాప్టర్లు, డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు ఫ్రాన్సు అధికారులు ప్రకటించారు. బ్రిటన్‌లో 233 మంది కోవిడ్‌తో చనిపోయారు. పబ్‌లు, రెస్టారెంట్లు, థియేటర్లు మూసివేయాలని, తొందరపడి ఎడాపెడా నిత్యావసరాలను కొనవద్దని పౌరులను బ్రిటన్ కోరింది.

ప్రపంచవ్యాప్తంగా 3 లక్షల పాజిటివ్ కేసులు

- 170 దేశాలకు వ్యాపించిన కోవిడ్
- ఇటలీలో 651 మంది మృతి

నిర్మానుష్యంగా మారిన న్యూయార్క్ జాతీయ రహదారి

అమెరికాలో...

అగ్రరాజ్యం అమెరికాలో ఆదివారం 47 మంది చనిపోగా మొత్తం మృతులు 349, కేసుల సంఖ్య 26,747కు చేరుకుంది. న్యూయార్క్, షికాగో, లాస్ ఏంజెలెస్ నగరాలు సహా మూడో వంతు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మిగతా ప్రాంతాల్లోనూ ఆంక్షలు విధించే అవకాశాలున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, ఆయన భార్యకు నిర్వహించిన కరోనా పరీక్షల్లో నెగెటివ్‌గా తేలిందని అధికారులు తెలిపారు.

ఆసియాలో..

ఆసియా ఖండంలో 96,669 కేసులు బయటపడగా 3,479 మరణాలు నమోదయ్యాయి. వ్యాధికి మూల కేంద్రమైన చైనాలో ఆదివారం ఒక్క కేసు మాత్రమే బయటపడింది. థాయ్‌ల్యాండ్‌లో ఒక్కసారిగా పెరిగిన కోవిడ్ కేసులతో మొత్తం సంఖ్య 600కు పెరిగింది. మధ్యప్రాచ్యంలోనూ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. ఆదివారం ఒక్కరోజే ఇరాన్‌లో 123 మంది చనిపోగా మొత్తం మరణాలు 1,685కు చేరుకున్నాయి. పాకిస్తాన్‌లో పాక్షిక లాక్‌డౌన్ విధిస్తున్నట్లు ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ప్రకటించారు., తమ దేశం పరిస్థితి ఇటలీ మాదిరిగా ఘోరంగా లేదన్నారు. పూర్తి లాక్‌డౌన్‌తో పేదలు ఇబ్బందులు పడతారని తెలిపారు. ఆస్ట్రేలియా సరిహద్దులను మూసివేసింది. ఆఫ్రికాలో 1,100 కేసులు ఇప్పటివరకు వెలుగుచూశాయి.

రాణి సహాయకురాలికి కరోనా పాజిటివ్

బ్రిటన్ రాణి ఎలిజబెత్ (93)కు సహాయకురాలు ఒకరికి కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. వైరస్ వ్యాప్తి భయంతో లండన్‌లోని బకింగ్‌హామ్ ప్యాలెస్ అధికారులు రాణిని ముందు జాగ్రత్తగా ఇటీవలే విండ్సర్ కేజిల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని అధికారులు తెలిపారు. రాణి విండ్సర్‌కు వెళ్లకముందే ఆ సహాయకురాలికి వైరస్ సోకినట్లు మీడియా తెలిపింది.

లక్నోలోని తన నివాసంలో గంట కొట్టి సంఘీభావం తెలుపుతున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

కోవిడ్‌తో ఫ్రాన్స్ వైద్యుడు మృతి

పారిస్: ప్రమాదకర కోవిడ్ (కరోనా వైరస్) ప్రపంచవ్యాప్తంగా కోరలు విప్పుతోంది. కోవిడ్‌కు చికిత్స అందించే వైద్యుడు మృతిచెందిన ఘటన ఫ్రాన్స్‌లో చోటుచేసుకుంది. తమ దేశంలో కోవిడ్‌కు చికిత్స అందించే వైద్యుడు మరణించిన తొలి కేసు ఇదేనని ఫ్రాన్స్ ఆరోగ్య మంత్రి ఓలీవర్ వీరన్ వెల్లడించారు. ఫ్రాన్స్‌లోని ఓయిస్ డిపార్ట్‌మెంట్‌లో కోవిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో కోవిడ్ బాధితులకు చికిత్స అందించే వైద్య సిబ్బందికి ప్రభుత్వం సరైన మాస్కులు అందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై వీరన్ స్పందిస్తూ.. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వైద్యులకు సరైన సౌకర్యాలు కల్పించడం అనివార్యమని పేర్కొన్నారు. సరైన మాస్కులు ధరించిన వైద్యులు, నర్సులు కూడా కోవిడ్ బారిన పడ్డారని ఉదహరించారు.

కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు...

న్యూఢిల్లీ: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) కోవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు కొత్త వ్యూహాన్ని అనుసరిస్తోంది. కరోనా టెస్ట్‌లు చేశాక పేషెంట్లను ఐసోలేషన్‌లో ఉంచడం తో పాటు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతోనూ, జ్వరం, దగ్గులాంటి లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరిన వారికి కోవిడ్ ఇన్‌ఫెక్షన్‌కి సంబంధించిన పరీక్షలు చేయాలని ఆదేశించింది. ఐసీఎంఆర్ గైడ్‌లైన్స్ ప్రకారం కూడా కరోనా అనుమానిత కేసుల్లో సైతం లక్షణాలు కనిపించిన ఐదో రోజు నుంచి 14 రోజుల మధ్యలో ఈ పరీక్షలు చేయాలని సూచించింది. దీనివల్ల అనారోగ్యంతో ఉన్న ప్రతి వ్యక్తికీ సరైన పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంటుందని ఐసీఎంఆర్ భావిస్తోంది. గత 14 రోజుల్లో విదేశీ ప్రయాణాలు చేసివచ్చిన వారికి కరోనా లక్షణాలు తీవ్రమయ్యాయి. ఆ లక్షణాలున్న వారందరికీ పరీక్షలు జరిపారు. ఈ లక్షణాలున్న వైద్యసిబ్బందికి కూడా గైడ్‌లైన్స్ ప్రకారం పరీక్షలు నిర్వహించారు. ఒకవేళ కమ్యూనిటీకి కోవిడ్ సంక్రమించినట్టయితే ఆ స్టేజ్‌ని బట్టి నిర్దిష్టమైన పరీక్షల విధానాన్ని అనుసరించాలని తెలిపింది.

మావో పంజా

ఛత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

17 మంది జవాన్ల మృతి, 14 మందికి గాయాలు

• డ్రోన్ల సాయంతో మృతదేహాల గుర్తింపు

సాక్షి, హైదరాబాద్/చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోసారి పంజా విసిరారు. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించిన మావోయిస్టులు ఆకస్మిక దాడి చేసి 17 మంది జవాన్లను బలితీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం సుక్మా జిల్లాలోని చింతగుఫా ఏరియాలో మీన్పా అడవుల్లో నక్సల్ కమాండర్ హీడ్మా, వినోద్, దేవా శిబిరం ఏర్పాటు చేసుకున్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు సమాచారం అందుకున్నారు. దీంతో 250 నుంచి 300 డీఆర్‌జీ (జిల్లా రిజర్వ్ గార్డులు), ఎస్‌టీఎఫ్ (స్పెషల్‌టాస్క్‌ఫోర్స్) జవాన్లతో గాలింపు చర్యలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు వారికి తారసపడ్డారు. ఒక్కసారిగా మావోయిస్టులు ఎదురుకాల్పులు జరపడంతో భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులు ప్రారంభించాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 17 మంది జవాన్లు మరణించగా, 14 మంది గాయపడ్డారు.

దాదాపు 8 గంటలపాటు కాల్పులు..

వేసవి రావడంతో ప్రతి సంవత్సరం మాదిరిగానే.. ఈ ఏడాది కూడా ఆపరేషన్ ప్రహార్‌లో భాగంగా మావోయిస్టుల కోసం పోలీసులు ప్రత్యేకంగా గాలింపులు మొదలుపెట్టారు. చింతగుఫా సమీపంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో దాదాపు 300 మంది భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు ముగించుకుని తిరిగి వస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య శనివారం మధ్యాహ్నం 12.40 నుంచి రాత్రి 9 గంటల వరకు దాదాపు 8 గంటలపాటు వందలాది రౌండ్లు కాల్పులు జరిగాయి. కాల్పుల సమయంలో గాయపడ్డ 14 మందిని హెలికాప్టర్లో రాయ్‌పూర్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఎన్‌కౌంటర్ దట్టమైన అటవీ ప్రాంతంలో జరగడం, రాత్రి వరకు కొనసాగడంతో 17 మంది జవాన్ల జాడ తెలియకుండాపోయింది. ఆదివారం డ్రోన్ల సాయంతో గాలించగా.. ఆ 17 మంది విగతజీవులుగా కనిపించారు. అనంతరం బలగాలు ఆయా ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి.

మావోల కాల్పుల్లో మృతి చెందిన భద్రతా సిబ్బంది

వారి ధీరత్వాన్ని మరచిపోం: మోదీ

భద్రతా బలగాలపై మావోయిస్టులు జరిపిన ఘాతుకంపై ప్రధాని మోదీ స్పందించారు. 'ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తున్నాను. ఈ దాడిలో అమరవీరులైన భద్రతా బలగాలకు అంజలిఘటిస్తున్నాను. వారు చూపిన ధీరత్వాన్ని ఎన్నటికీ మరచిపోం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అంటూ ట్వీట్ చేశారు.

అమరులైన జవాన్లు వీరే.. :డీఆర్‌జీ విభాగం కానిస్టేబుళ్లు హేమంత్‌దాస్, లిబ్రూరాం, సోయం రమేష్, వంజెం నాగేష్, మడకం మాసా, పొడియం లక్మా, మడకం ఇడమా, వంజం నితేంద్రం, అసిస్టెంట్ కానిస్టేబుళ్లు గంధం రమేష్ , ఉయికా కమిలేష్, పొడియం ముత్తా, ఉయికా దుర్బా, ఎస్టీఎఫ్ విభాగం కానిస్టేబుళ్లు సీతారాం రాశ్యా, హేమంత్ బోయ్, అమర్‌జిత్ కల్లోజీ, అసిస్టెంట్ కానిస్టేబుళ్లు నారోద్ మితాడ్, మడకం ముచ్చు.

బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లలో మావోలు...

బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, హెల్మెట్లు ధరించిన మావోయిస్టులు భారీ ఆయుధాలతో ఆకస్మికంగా దాడికి పాల్పడినట్లు పోలీసులు అంటున్నారు. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మావోయిస్టులకు తక్కువ ప్రాణనష్టం జరిగి ఉండవచ్చనంటున్నారు.



నల్లగొండ | సోమవారం
మార్చి | 23 | 2020
sakshisahityam@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, శిశిర ఋతువు. ఫాల్గుణ మాసం. తిథి బ.చతుర్దశి ఉ.11.48 వరకు, తదుపరి అమావాస్య. నక్షత్రం పూర్వాభాద్ర రా.12.40 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర. వర్జ్యం లేదు. దుర్ముహూర్తం ప.12.30 నుంచి 1.18 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.41 వరకు. అమృత ఘడియలు ప.3.54 నుంచి 4.43 వరకు.

సూర్యోదయం: 6.06 **సూర్యాస్తమయం:** 6.07 ;
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు.
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

● రీవిజిట్

కందం రాసినవాడే కవి అన్నారు మనవాళ్లు. వసంతాన్ని వర్ణించనివాడు మాత్రం కవి ఎలా అవుతాడు? తెలుగు కవుల్లో వసంత రుతువర్ణన చేయని కవి లేడు. ఒక్కో కవిది ఒక్కో దారి. పోతున్న ప్రాణాల్ని నిలబెట్టే వసంతం గురించి ఎన్నో పద్యాలున్నాయి. అందులోంచి ఈ సరళ సీసం ఆదిభట్ల నారాయణ దాసు హరికథ సావిత్రి చరిత్రము లోనిది. వసంతంతో మొదలయ్యే ఈ శార్వరి ఉగాది వేళ.

ఆమని మొదలుపెట్టి ఒక హాయి పుట్టె

చెవులకు జల్లగ జెలగి కోయిల కూసె
సందడి పెండ్లి బాజాలు మ్రోసె
కన్నె వేపయు దొగర్గున్న సమర్తాడె
జలివేంద్ర దాపున సంత గూడె
కమ్మ మామిడి తోట కాపుల పని హెచ్చె
బిల్లగాలులు మురిపించి వచ్చె
గొడుగులు జోళ్లెండ చిడిముడి జల్లార్చె
దాటిముంజలు కడు దప్పి దీర్చె

కారడవి వెల్గె బడవ షికారు గల్గె
సందె లింపాయె గొగిళుల్సడలి పోయె
ప్రొద్దు లేపాటి మాపులు పొట్టివాటె
ఆమని మొదలు పెట్టి ఒక హాయి పుట్టె

◆ ఆదిభట్ల నారాయణదాసు

● మీకు తెలుసా?



పుష్కిన్ పార్క్

రష్యన్ రచయిత అలెగ్జాండర్ పుష్కిన్ తన కవితల్లో వర్ణించిన ఊహాదేశం లూకోమోర్యే నమూనాగా ఒక థీమ్‌పార్కును రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో నిర్మిస్తున్నారు. 2023లో ఇది ప్రారంభం కానుంది.

అపోప్రపంచం

'కరోనా నిన్ను కుళ్ళబొడుస్తా' అని కవిత రాసుకొచ్చాడు వినిపించడానికి, దగ్గువచ్చి చిన్న దగ్గు దగ్గా అంతే!

అచ్చుకాని బహుమతి కథ

● కథాసారం



■ పాండురంగారావు కూతురు కథ చదివి కాస్త మార్పులు, చేర్పులు చేయించి వ్రాద్దాం అనుకున్నాడు. కాని ఎడిటర్స్ మొదట చదివి వుంటే బాగోదని ఏమయితే అది అయిందని కూతురికే మొదటి బహుమతి ఇచ్చేశాడు.

వచ్చిన కథలన్నీ ముందు పెట్టుకుని కూర్చున్నాడు ప్రిన్సిపాలు పాండురంగారావు. అతని చేయి వణుకుతోంది, అంతరాత్మ నువ్వు చేస్తున్న పని మంచిది కాదని హెచ్చరించబోయింది. విసుగ్గా అంతరాత్మను జోకొట్టాడు. మంచికి నిర్వచనము ఏమిట? తను చేస్తున్న చెడు బయటికి యెలా వెడుతుంది?

''నాన్నారూ!'' త్రివేణి వచ్చింది, హడావుడిగా. ''మరేమో, మా స్నేహితురాళ్లు ఏమంటున్నారంటే...''

''చెప్పమ్మా ఏమన్నారు?''

''చిన్న కథల పోటీకి మీరు న్యాయ నిర్ణేతలు కదా! నేను వ్రాసిన కథ పోటీకి అంగీకరించరట కదా!''

''వాళ్లకేం తెలియదు, ఆ పత్రిక తెచ్చి నిబంధనలు చదువు'' అన్నాడు. అతని గొంతు నీరసంగా ఉంది.

నిబంధనలు చదివింది. న్యాయనిర్ణేతల పిల్లలు పాల్గొనరాదని యెక్కడా లేదు.

''నాన్నారూ! నాకు ఫస్ట్ ప్రైజు ఇస్తారు కదండీ.''

''తప్పకుండా తల్లీ'' అన్నాడు కూతురి వీపు నిమురుతూ. వెయ్యి రూపాయలు పోగొట్టుకోవడం తనకు మాత్రం ఇష్టమా?

''మీ నాన్నగా రొక్కరిస్తే చాలా? మరో న్యాయ నిర్ణేత కూడా ఉన్నారుగా'' అప్పుడే అక్కడికి వచ్చిన కమలమ్మ అన్నది.

''అవునా నాన్నారూ?''

''మీ అమ్మకేం తెలియదు. ఫస్టు ప్రైజు నీది'' మళ్లీ మళ్లీ అన్నాడు. త్రివేణి ఉత్సాహంగా వెళ్లిపోయింది.

''పసిదానికి ఆశ పెట్టడం దేనికి? మీరు ఇచ్చినా మరో న్యాయ నిర్ణేత ఇవ్వవద్దూ?''

''ఇవ్వరని నీకు కలగాని వచ్చిందా? పత్రికలవారు నా స్నేహితులు. ఇక మరో న్యాయ నిర్ణేత రచయిత్రి. ఆమెకు నన్ను ఎదిరించే దమ్ములు లేవు. నువ్వూరుకుందూ!'' అన్నాడు.

ఉత్సాహవంతులయిన విద్యార్థులలోని రచనా పిపాసను బయటికి లాగాలని, ఓ ప్రముఖ పత్రిక – కాలేజీలో, హైస్కూల్లో చదివే విద్యార్థుల కోసం చిన్న కథల పోటీ పెట్టారు. మొదటి బహుమతి వెయ్యి రూపాయలు, రెండవ బహుమతి ఐదు వందలు, అని అనౌన్స్ చేసి, యెడిటర్స్ కాక, ప్రిన్సిపాల్ పాండురంగారావును, మరో రచయిత్రి నైనాదేవిని న్యాయ నిర్ణేతలుగా వేశారు. పాండురంగారావు కూతురు త్రివేణి కూడా ఓ కథ వ్రాసి, తను విద్యార్థిని అని కాలేజీ నుండి సర్టిఫై చేయించుకు వచ్చి, పోటీలో పాల్గొన్నది. పాండురంగారావు కూతురు కథ చదివి కాస్త మార్పులు, చేర్పులు చేయించి వ్రాద్దాం అనుకున్నాడు. కాని ఎడిటర్స్ మొదట చదివి వుంటే బాగోదని ఏమయితే అది అయిందని కూతురికే మొదటి బహుమతి ఇచ్చేశాడు. ప్రథమ బహుమతికి అర్హమైన కథను అన్నిటి క్రింద పెట్టాడు.

ఆ రాత్రి కమలమ్మ కొన్ని చదివింది. కూతురిది అసలు చదవలేనంత అస్తవ్యస్తంగా ఉంది. ఆమెకు బాధ కల్గింది. ఆమె తండ్రి టీచరుగానే చేశాడు. వక్తృత్వం పోటీలు జరిగితే కమలమ్మ పాల్గొంటే అతను తప్పుకునేవాడు.

''పంతులుగారూ! మీరు అన్యాయం చేయరని తెలుసు. తప్పుకోవటం యెందుకు?'' ప్రధానోపాధ్యాయుడు అనేవాడు.

''యెందుకండీ, ఒకవేళ మా అమ్మాయే బాగా మాట్లాడినా అందరు ఏమనుకుంటారోనని మొహమాటంతో ఇవ్వకపోవచ్చు'' అంత నీతి నియమాలుండేవి. ప్రతిచోట అవినీతి అరాచకం ప్రాకిపోయింది. దాన్ని కూకటి వేళ్లతో కదిలించేవాడు యెప్పుడొస్తాడో!

వారం రోజులకు పత్రికాధిపతి కౌండిన్య రెండవ జడ్జీ అయిన నైనాదేవి దగ్గరకు ఫైలు తీసుకువెళ్లి, ఆవిడ చేత కూడా చూపించుకుని, ఆవిడ వ్రాసిన రిమార్క్ తీసుకుని వచ్చాడు.

''ఏమిటి? ఆవిడ వాటిని చదువబోయిందా? నేను వ్రాసినవే టిక్ కొట్టి ఉంటుంది కదూ?'' సగర్వంగా అడిగాడు పాండురంగారావు.

''అక్కడే మనము పొరపడ్డామండోయ్. తాను చదవటమే కాక అక్కడే ఉంటున్న ఇద్దరు ఎమ్.లిట్‌లతో కూడా చదివించింది. మీరు లాస్టున పెట్టిన అమ్మాయి కథకు మొదటి బహుమతి రావాలని సూచన చేస్తూ, యెందుకు రావాలో నోట్ పుటప్ చేశారు.''

''మీరేం నిర్ణయించారు?''

''మీరు యెలా అంటే అలా.''

''బోడిది అక్షర జ్ఞానము లేనివారంతా రచయిత్రులే. ఓ కుటీర పరిశ్రమ అనుకుని రచనలు చేస్తూ ఇలాంటి వాటిల్లో తల దూరుస్తారా?'' పాండురంగారావు కళ్లు ఎర్ర చేశాడు.

''అబ్బే, ఆవిడ అభిప్రాయము ఆవిడ వ్రాశారు. మనం మనమే, ఆవిడనో న్యాయనిర్ణేతగా నిర్ణయించుకున్నాము. మాటలు అనటం భావ్యం కాదేమో.''

''ఊ! త్రివేణి మా అమ్మాయి అని గుర్తించిందా?''

''గుర్తించే ఉంటుంది...'' నసిగాడు కౌండిన్య, ఆమె మెత్తగా వేసిన చీవాట్లు గుర్తుకు తెచ్చుకుంటూ. ''వెయ్యి రూపాయల దగ్గర ఈ కక్కుర్తి ఏమిటండీ? తను న్యాయనిర్ణేతగా ఉన్నప్పుడు కూతురు పాల్గొనడం ఏం బావుంటుంది?''

పాండురంగారావుకు ఎలా చెబుతాడు? ఇద్దరూ చిరకాల మిత్రులు. ఒకరి బలహీనతలు ఒకరికి తెలుసు.

''ఆమె చెప్పినట్టే బహుమతి ఇస్తే రేపు మన తలకు ఆముదము రుద్దుతారు, అసలే సూద్రపు పీనుగులు.''

''పోనీ ఒక పని చేస్తే? మొదటి, రెండవ బహుమతి కాక, ఆవిడ మొదటి బహుమతి ఇచ్చిన అమ్మాయికీ ప్రత్యేకమయిన బహుమతి ఇస్తే...''

''ఆ... యెందుకు లెండి.''

''రేపు మన మీద పడి యేడ్వకుండాను.''

ఆ పై వారము ఫలితాలు పత్రికలో ప్రకటించారు. అది చూచి పాండురంగారావు గర్వంగాను, నైనాదేవి బాధగానూ నవ్వుకున్నారు. ప్రముఖుల సమక్షంలో బహుమతి ప్రదానము జరుగుతుందని ప్రకటించారు. ఆహ్వానాన్ని చూచుకొని పాండురంగారావు ఆలోచనలో పడ్డాడు. ఆ సభకు ఆకతాయి వెధవలు వచ్చి, త్రివేణి తన కూతురని గుర్తిస్తే? అవాకులూ చవాకులూ వాగితే? అర్జంటుగా తలనొప్పి తెచ్చుకుని మంచ మెక్కేశాడు.

''నాన్నారూ! ఈరోజు నా కథకు బహుమతి ఇస్తారు. మీరు రండి'' అని మారాం మొదలు పెట్టింది త్రివేణి.

''నాకు ఆరోగ్యం బాగా లేదమ్మా'' అన్నాడు. మూతి ముడుచుకు కూర్చుంది త్రివేణి.

''మా తల్లివి కదూ! వెళ్లి బహుమతి తీసుకుని అందరు మాట్లాడింది జాగ్రత్తగా విను. ముఖ్యంగా ఆ నైనాదేవి ఏమంటుందో విను'' అన్నాడు అనునయిస్తూ. నిరాశగా వెళ్లిపోయింది.

విసుగ్గా సిగరెట్టు వెలిగించుకున్నాడు. రాత్రి యెనిమిది గంటల వరకు అసహనంగా గడిపాడు. ప్రదానోత్సవం ఇంతసేపా? ఆ నైనాదేవి పేలుతూ ఓ రెండు గంటలు ఉపన్యాసం యిచ్చి ఉంటుంది!

''నాన్నారూ! ఇదిగోనండీ చెక్కు, సర్టిఫికెట్టు'' లేడిపిల్లలా దూకుతూ వచ్చింది త్రివేణి. వెనకాల కమలమ్మ వచ్చింది.

''ఇంతాలస్యం అయిందేం, సభ ఆలస్యంగా ప్రారంభం అయిందా?''

''లేదండీ, వచ్చేటప్పుడు బస్సులు దొరకలేదు. సభ అరగంటలో ముగిసింది. ఇద్దరు న్యాయనిర్ణేతలు రాలేదు కదా.''

''ఏమిటీ? నైనాదేవి రాలేదా? యెందుకు?''

''ఏమో కౌండిన్యగారే పోటీ వుద్దేశం చెప్పారు. ఆ తరువాత మంత్రిగారు నాలుగు మాటలు చెప్పి బహుమతులిచ్చారు, అరగంటలో అయిపోయింది.''

''అమ్మయ్య'' అనుకుని గుండెల మీద చేయి వేసుకున్నాడు. అంతవరకు ఏవేవో ఊహిస్తున్న అతని మనసు కుదుటపడింది.

ఆ విషయము పాతబడిపోయింది. అనుకున్న ప్రకారము పోటీలో నెగ్గిన కథలు పత్రికలో ప్రచురించలేదు. అనివార్య కారణాల వలన కథలు ప్రచురించలేదని ప్రకటించారు. అది చూచి త్రివేణి నిరుత్సాహ పడింది. విషయం తండ్రితో చెప్పింది.

సాయంత్రము కాలేజీ నుండి వస్తుండగా కౌండిన్య దగ్గరికి వెళ్లాడు. ఆమాట, ఈమాట చెప్పాడు. ''మొన్న సభకు నైనాదేవి రాలేదట.''

''మీరు రాలేదు కదా! అందరూ ఏమనుకుంటారోనని ఆమెకు ఫోను చేశాము. 'వచ్చి అక్కడ నేను ఆత్మను చంపుకుని అబద్ధాలు మాటలాడలేను. నిజం మాటలాడి మీ అందరితో నిష్టూరము కొని తెచ్చుకోలేను' అన్నది.''

''బోడి! ఏడ్వలేకపోయింది''

''కథలు ప్రచురించినా, పాఠకులతో గోల లెండి'' కౌండిన్య మాట మార్చాడు.

''త్రివేణి కథ ఇలా యివ్వండి. దిద్ది పట్టుకొస్తాను'' అన్నాడు.

కౌండిన్య ఆశ్చర్యంగా చూశాడు. బాహ్యంగా తమ తప్పులు కప్పి పుచ్చుకున్నా అంతరాత్మ యెలా అంగీకరిస్తుంది? ''ఇక ఇప్పుడా తతంగం అంతా యెందుకు లెండి? మన చుట్టూ వున్నవారు వేయి కళ్లతో కనిపెట్టి చూస్తారు'' అన్నాడు.

పాండురంగారావు ఇంటికి వచ్చాడు. త్రివేణి ఆశగా ఎదురు వచ్చింది. ''ఏం నాన్నారూ? నా కథ అచ్చు అవుతుందా?''

''నోరుమూసుకో, రాసింది యింతోటి మహాకథ'' విసుగ్గా చూచాడు.

మాదిరెడ్డి సులోచన

మాదిరెడ్డి సులోచన (1935-84) కథ 'అంతరాత్మ'కు సంక్షిప్త రూపం ఇది. సులోచన 1965-83 మధ్య విస్తృతంగా రాశారు. సుమారు 70 నవలలు, 150 కథలు ఆమె ఖాతాలో ఉన్నాయి. సంధ్యారాగం, రుతుచక్రం, అద్దాల మేడ, అపురూప, బిందుపథం, ఎదగని మనసులు, గడ్డితినే మనుషులు, జీవన యాత్ర, కలహంస, సంసార నౌక, తరంగాలు, వంశాంకురం, తరం మారింది లాంటివి ఆమె నవలల్లో కొన్ని. కోస్తా ప్రాంతం నుంచి రచయిత్రులు ఎక్కువగా వస్తున్న ఆరవ దశకంలో, తెలంగాణ నుంచి పాప్యులర్ రైటర్‌గా ఎదగడం సులోచన ప్రత్యేకత. వృత్తిరీత్యా ఉపాధ్యాయిని.

● రిపోర్ట్

సాధనమున చరిత్ర సమకూరు రచనలోన



■ ప్రాచీన సంప్రదాయాలతో సంబంధమున్న ప్రతి విషయాన్నీ భూతద్దంలో చూసి ఒకదాని కొకటి అనుసంధానం చేసి తప్పో ఒప్పో తేల్చుకోవాల్సిన పని చరిత్రను రచించే, సాహిత్యంగా మలచే ప్రతి రచయితా చేసి తీరవలసిందే.

తెలుగువాడి చరిత్ర ఆశ్చర్యాల పుట్ట. ఆ చరిత్ర మనకెందుకు అందుబాటులో లేకుండా పోయిందనేది కూడా ఆశ్చర్యమే. మద్రాసుకు, కర్ణాటకకు, ఒరిస్సాకు, మహారాష్ట్రకు, ఇంకా అనేకులకు మన ప్రదేశాలను, వీరులను, కళలను, చివరకు చరిత్రను కూడా ధారాదత్తం చేశాము. మన చరిత్ర మనకు తెలియకపోవడం వల్ల, మన జాతి పట్ల మనకే గర్వం కలగడం లేదు. జాతిని వెలుగులోకి తీసుకు రావాలంటే చరిత్ర మీద దృష్టి పెట్టాలి. ఈ అవగాహన కోసమే ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడ దగ్గరలోని ఒక ఆహ్లాదకరమైన స్థలి వేదికగా 'కాలయంత్రం – 2020' చారిత్రక కథారచన కార్యశాల జరిగింది. సాయి పాపినేని ఏర్పాటు చేయగా, కార్పొరేట్ వర్క్ షాప్ స్థాయిలో జరిగిన ఈ కాలయంత్రంలో– 35 మంది తెలుగు రచయితలు ఒక దగ్గర కూడితే చిందే సాహిత్యపు సందడి ఒక ఎత్తయితే, సాహితీ సృజనలో చెయ్యి తిరిగినవారితో పాటు ఇప్పుడిప్పుడే కలం పట్టిన వారు కూడా అపురూపమైన చారిత్రక క్షణాలను శ్రద్ధగా నోట్సుల్లో ఒడిసిపట్టుకుంటూ కనపడటం మరో ఎత్తు.

ఈ రెండు రోజుల్లో అనేకానేక అంశాలు చర్చకు వచ్చాయి. వెయ్యేళ్ళు నిండిన తెలుగు సాహిత్యంలో రావల్సినంత చరిత్ర ప్రాధాన్యతతో కథలు రాలేదనే నిజాన్ని అందరూ అంగీకరించారు. చరిత్రను పాఠ్యపుస్తకం లాగానో, పరిశోధక వ్యాసంలాగానో కాక కథలాగా చెబితే చదువుతారని తాజాగా 'శప్త భూమి' నవల నిరూపించింది. సాహిత్యంలోంచి వాస్తవాన్ని వడగట్టాలంటే సాహిత్యేతరాలైన చారిత్రక ఆధారాలు కూడా పరిశీలించాలి. శాసనాలు, నాణేలు, పురావస్తు అవశేషాలు, హస్తకళలు, ఆచార వ్యవహారాలు, పాటలు, గాథలు, నదులు, చెరువులు, పట్టణాలు, ఆలయాలు, ఊరిపేర్లు, ఇంటిపేర్లు, రహదార్లు, భవనాలు– ఇలా ప్రాచీన సంప్రదాయాలతో సంబంధమున్న ప్రతి విషయాన్నీ భూతద్దంలో చూసి ఒకదానికొకటి అనుసంధానం చేసి తప్పో ఒప్పో తేల్చుకోవాల్సిన పని చరిత్రను రచించే, సాహిత్యంగా మలచే ప్రతి రచయితా చేసి తీరవలసిందే. అయితే, ఈ ప్రయత్నంలో అనేక సందేహాలు ఎదురవుతాయి. ఏది చరిత్ర? ఏది అభూత కల్పన? ఈ రాజు ఇలా చేసి ఉంటాడా? సంభావ్యత ఎంత? ఈ కార్యశాలలో ప్రసంగించిన నిపుణులు వీటికి జవాబులిస్తూ రచయితలకు తోడుంటామని మాటిచ్చారు.

ఆంధ్ర ప్రాంతంలోనే దొరికిన ఐదు లక్షల సంవత్సరాల కిందటి ఆదిమ మానవుని అవశేషాలు, కళింగాంధ్రులు, రేనాటి చోళులు, జంబూద్వీప వృత్తం, జాతక కథలు, నాగులవంచలో డచ్ చరిత్ర, యానాం చరిత్ర, భారతీయ, అంతర్జాతీయ భాషలలో వచ్చిన చారిత్రక మహా/ సూక్ష్మ కథనాలు, శ్రీలంక నుంచి ఫిలిప్పీన్స్ దాకా విస్తరించిన ఆంధ్ర సామ్రాజ్యం, ఇండోనేషియాలో ఇప్పటికీ కనిపించే మన ఆవకాయ జాడీలు, 110 ఏళ్ళు దాటినా ఇంకా జవాబు దొరకని గురజాడ 'దేవుళ్ళారా మీ పేరేమిటి', ఆంధ్రతీరపు నౌకానిర్మాణ పరిశ్రమ, జైనుల దేవతలు గ్రామదేవతలవడం, వజ్రాలకోసం మట్టిలో వెతుకులాటలు, సిరిమాను ఆచారం, బుద్ధుడు ముందా రాముడు ముందా, భువనవిజయం అసాధ్యమా, నానక్ కబీర్లు కలుసుకుంటే, అశోకుడి ఎర్రగుడి శాసనాలు, మామిడిచెట్ల కింద నాణేల ప్రదర్శన – ఇలాంటి మిక్కిలి ఆసక్తికరమైన చర్చలు, విశ్లేషణలు, గమ్మత్తులు, నమ్మలేని నిజాలు, పురాస్పర్శలు – తెలుగువాడి చరిత్రను అందరికీ తెలియచెప్పాలనే సమష్టి బాధ్యతను గుర్తెరిగేలా చేశాయి.

కార్యశాలలో భాగంగా రెండో రోజు కొండవీడు పర్యటన ఏర్పాటైంది. రెడ్డిరాజుల వారసత్వ ప్రదర్శనశాలలో కర్పూర వసంతరాయల కుడ్యచిత్రాలు, కొండవీడు కోట నమూనా వగైరాలున్నాయి. ఈనాడు శిథిలాలుగా కనిపిస్తున్న కొండవీడు 14వ శతాబ్దిలో ప్రోలయ వేమారెడ్డిచే నిర్మితమై పదివేల మంది నివసించిన ఒక పూర్తి నగరం. దీని పునరుద్ధరణలో భాగంగా మెలికలు తిరిగే కొండదారి తాజాగా ఏర్పడింది. కొండలపై దారంతా రాసి ఉన్న వేమన పద్యాలు ఆ కాలానికి తీసుకువెళతాయి. తెలుగువారి వారసత్వ సంపదలో భాగమైన అనేక చారిత్రక అంశాలతో కూడుకున్న 'కాలయంత్రం' చరిత్ర పట్ల చైతన్యం రగిలించింది.

◆ మోహిత

● కొత్త బంగారం

తెరిచిన తలుపులు

■ నవల: అండ్ ద బ్రైడ్ క్లోజ్డ్ ద డోర్
హీబ్రూ మూలం: రానిత్ మెటలోన్
ఇంగ్లిష్ అనువాదం: జెస్సికా కోహెన్

పెళ్లికూతురు మార్జీ గదిలోకి వెళ్లి తలుపు బిగించేసుకుని, అయిదు గంటల తరవాత 'ఈ పెళ్లి చేసుకోను. చేసుకోను. చేసుకోను' అని తన నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. అంతవరకూ ఆమె మాట కోసం ఆత్రంగా ఎదురుచూసిన వాళ్లందరూ, ఆమె చెప్పింది నిజమని నమ్మాల్సి వస్తుందేమో అన్న భయంతో ఒకరిని ఒకరు చూసుకోవడం కూడా మానేస్తారు. పచ్చగా ఉన్న పెళ్లింట్లో అసలు పెళ్లి జరుగుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారుతుంది.

ఇజ్రాయెల్ రచయిత్రి రానిత్ మెటలోన్ (1959-2017) రాసిన 'అండ్ ద బ్రైడ్ క్లోజ్డ్ ద డోర్' ఈ సంక్షోభంతో ప్రారంభమవుతుంది. ఇజ్రాయెల్ సాహితీ ప్రపంచంలో ప్రముఖమైన 'బ్రెన్నెర్ అవార్డ్' పొందిన ఈ హీబ్రూ నవలకి జెస్సికా కోహెన్ చేసిన ఇంగ్లిష్ అనువాదాన్ని న్యూ వెసెల్ ప్రెస్ 2019లో ప్రచురించింది.

ఒక్కరోజు కథ ఇది. మార్జీ, మాటి పెళ్లి చేసుకోవాలనుకుంటారు. ఆ సాయంత్రమే పెళ్లి. మార్జీతో మాట్లాడటానికి ఎవరు ప్రయత్నించినా, మౌనమే సమాధానం. కేంద్రబిందువు మార్జీ అయినప్పటికీ, కథను నడిపేది మిగతా పాత్రలే. హాస్యం, స్త్రీవాదం, ఇజ్రాయెల్‌లో పెళ్లిళ్లు, సామాజిక ఆర్థిక పరిస్థితులు, పాలెస్తీనియన్‌లు, వలస వచ్చిన యూదుల ఇబ్బందులు– ఇవన్నీ చదువరి గమనంలోకి వచ్చేలా నవలలో ప్రవేశపెట్టబడతాయి.

తన అభిప్రాయాలను నిష్కర్షగా చెప్పే అమ్మాయిలా, తనకు తనే బలం అని నమ్మిన వ్యక్తిలా మార్జీ వ్యక్తిత్వం ఆవిష్కృతమౌతుంది. ఈ సంక్షోభం మొత్తంలో మార్జీ కేవలం ఒక్క కాగితాన్ని మాత్రం తలుపు కిందనుంచి బయటకు పంపుతుంది. 'నీ అడుగులు బరువెక్కాయి, గమ్యాన్ని చేరగలవా? అని దారిలో రాళ్లు నన్ను ప్రశ్నించాయి,' అని మొదలయ్యే కవిత, కట్టుబాట్లను ఛేదించటానికి ఆమె లోనవుతున్న అంతర్గత సంఘర్షణకి ప్రతిరూపంగా ఉంటుంది.

కథ పరిధికి లోబడి డీటెయిలింగ్ చేసిన విధానం అనుపమానం. పెళ్లింటి వాతావరణం లోని వస్తువులూ, సెంటు పరిమళాలూ, వంటింటి వాసనలూ, మేకప్పులూ, అలంకరణలూ, కేటరర్సూ, ఫొటోగ్రాఫర్లూ, ఫోన్లూ ఓవైపు; పెళ్లికూతుర్ని ఒప్పించటమెలా, అతిథులకేం చెప్పాలీ, ఇంతవరకూ అయిన ఖర్చు ఎవరు భరించాలీ లాంటి మీమాంసలు మరోవైపు. వర్ణనలు, పోలికలు చాలావరకు స్త్రీ పరంగా ఉండటం కొత్త అందం.

ఆలోచనలను స్పష్టంగా చెప్పలేని పెళ్లికొడుకు మాటీ, తనకి నచ్చని చెప్పులు మార్జీ కొన్నప్పుడు వద్దనికూడా చెప్పలేడు. అతనికీ మార్జీకి మధ్య ఏదో కనపడని గోడ ఉండేది. అసలు, మార్జీతో ఉన్న అనుబంధంలో అతనిలో అతనికే ఏదో అడ్డుగా ఉండేది. మార్జీ తీసుకున్న ఈ నిర్ణయం మాటీకి కూడా కొంతమేరకు ఉపశమనాన్ని కలిగించి, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగల స్థైర్యాన్ని అతనికీ ఇస్తుంది.

మార్జీ పరంగా ఆలోచించగలిగిన అమ్మమ్మ మరో ముఖ్యమైన పాత్ర. ఆ రోజు ఆవిడ పాడిన 'నేను నా మనసులో ఉన్నది చెప్పటానికి భయపడతాను, నీ హృదయం ఎక్కడ గాయపడుతుందోనని' అన్న పాట మంద్రంగా సాగుతూ ఆవిడ గదిని దాటి, చుట్టూపరుచుకున్న నిశీథిలోని వేల వేల గొంతుకలతో కలిసి తెరలుతెరలుగా విశ్వమంతా వ్యాపించి, తరతరాలుగా స్త్రీలు మోస్తున్న భారాన్ని పెళ్లగిస్తున్నట్టుగా సాగుతుంది. ఈ పాట ప్రభావమా అన్నట్టు, పెళ్లికూతురి గది తలుపు తెరుచుకుంటూ ఉంటుంది నెమ్మదిగా!

మార్జీ పెళ్లిని నిరాకరించడానికి కారణాలు కథ చివర్లో కూడా స్పష్టం కావు. కానీ స్త్రీ నిర్ణయాన్ని గౌరవించడం అనేది ముఖ్య విషయమనీ, కారణాలు తదనంతర విషయాలనీ నవల అన్యాపదేశంగా సూచిస్తుంది. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో స్త్రీకి ఎక్కడైనా ఈ స్థాయిలో స్వాతంత్ర్యం ఉందా అన్నది పక్కనపెడితే, ఉండటం మాత్రం అభిలషణీయం!

◆ పద్మప్రియ

ఈవారం పుస్తకాలు



కాకతీయులు

మూలం: పి.వి.పరబ్రహ్మశాస్త్రి 'కాకతీయాస్ ఆఫ్ వరంగల్'
తెలుగు: జి.వెంకటరాజం, కాకాణి చక్రపాణి, డి.చంద్రశేఖర రెడ్డి, గోవిందరాజు చక్రధర్+ పేజీలు: 296 ; వెల: 150 ; ప్రచురణ: మీడియా హౌజ్ సహకారంతో ఎమెస్కో.



ప్రాచీనాంధ్ర దేశ చరిత్ర: గ్రామీణ జీవనం

మూలం: పి.వి.పరబ్రహ్మ శాస్త్రి 'రూరల్ స్టడీస్ ఇన్ ఆంధ్రా'
తెలుగు: కాకాని చక్రపాణి, దుర్గెంపూడి చంద్రశేఖర రెడ్డి, గోవిందరాజు చక్రధర్, జి.వెంకటరాజం ; పేజీలు: 232 ; వెల: 125 ; ప్రచురణ: ఎమెస్కో ; ఫోన్: 040-23264028



కొండవీడు కైఫియతు

సంపాదకుడు: మోదుగుల రవికృష్ణ ; పేజీలు: 92(గ్లేజ్డ్ పేపర్) ; వెల: 100 ; ప్రచురణ: వివిఐటి, నంబూరు ; ప్రతులకు: సాహితి ప్రచురణలు, 32-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-4. ఫోన్: 0866-2436642



కొండవీడు

రచన: కల్లి శివారెడ్డి ; పేజీలు: 288 ; వెల: 300 ; ప్రచురణ: కొండవీడు హెరిటేజ్ సొసైటీ, గుంటూరు. ప్రతులకు: రచయిత, 4-6-44/ఎ, వినాయక నగర్, కొరిటెపాడు, గుంటూరు-7. ఫోన్: 9885502778



చరిత్రకెక్కని సమరం

(తలవంచని నాగులవంచ)
రచన: కట్టా శ్రీనివాస్ ; పేజీలు: 32 ; వెల: 35 ; ప్రచురణ: స్పృహ సాహితీ సంస్థ, ఎంఎస్‌కె టవర్స్, ఫ్లాట్ నం. 410, స్ట్రీట్ నం. 11, హిమాయత్ నగర్, హైదరాబాద్-26. రచయిత ఫోన్: 9885133969



అక్షరం నా ఉత్తరం (ఆర్టికల్స్)

రచన: పచ్చల రాజేశ్ ; పేజీలు: 210 ; 200 ; ప్రతులకు: రచయిత, 24/2/4, వి.బి.నగర్, నంబూర్, పెదకాకాని మండలం, గుంటూరు-522508. ఫోన్: 8331823086

రారండోయ్

● కేవీఆర్ పుస్తకాల ఆవిష్కరణ, స్మారకోపన్యాస సభ మార్చి 29న సాయంత్రం 5:30కు విజయవాడలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో జరగనున్నాయి. టాగూర్ కథలకు కేవీఆర్ అనువాదం 'ఆటబొమ్మలు' ; కేవీఆర్ స్మృతిలో వ్యాస సంకలనం ఆవిష్కరణ అవుతాయి. ఆవిష్కర్తలు: సింగంపల్లి అశోక్‌కుమార్, తాటి శ్రీకృష్ణ. ఫాసిజం తాత్విక మూలాలు, వ్యక్తీకరణలు అంశంపై ఎన్.అంజయ్య ప్రసంగిస్తారు. నిర్వహణ: కేవీఆర్-శారదాంబ స్మారక సొసైటీ.

● పతంజలి సాహిత్య పురస్కారాన్ని ఈ యేడు అట్టాడ అప్పల్నాయుడుకు ఇస్తున్నట్టు కెఎన్‌వై పతంజలి సాహిత్య వేదిక కార్యదర్శి ఎన్.కె.బాబు ప్రకటించారు. ప్రదానం మార్చి 29న జరగాల్సి ఉండగా, కోవిడ్-19 నేపథ్యంలో ఏప్రిల్ 5న విజయనగరంలో జరగనుంది. చింతకింది శ్రీనివాసరావు, దుప్పల రవికుమార్ వక్తలు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

మాభూమి @ 40

- సినిమా పేజీలో

మేము సైతం

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ

సోమవారం ॥ 23-3-2020

● అద్దంలో మనం

బాధ్యత లేని మనుషులు

రోజులు ఎంత గంభీరంగా మారినా కొన్ని దుర్గుణాలు మనం వదులుకోలేకపోతున్నాం. మన అంతరాత్మ ముందు మనల్ని మనం నిలబెట్టుకోవడం ఇప్పుడు కావాలి.

గమనించి చూడండి. రైల్వే గేటు పడి ఉంటుంది. రైలు మరికొద్ది నిమిషాల్లో రాబోతున్నదని మనకు అర్థమవుతూనే ఉంటుంది. కాని ఒకడెవడో, మనలో ఒకడెవతో బైక్‌ను గేటు కింద నుంచి దూర్చి హడావిడిగా అవతలి వైపుకు వెళ్లడానికి ప్రయాస పడుతుంటాడు. వాడికి అర్జెంట్ పని ఏమీ ఉండదు. మహా ఉంటే అది అయిదు నిమిషాలపాటు ఆగేదే అయి ఉంటుంది. కాని వాడు గేటు దాటాల్సిందే. అలా దాటి వెళితే, కొంత మంది దాటలేక అటువైపే ఉండిపోతే వాడికి అదొక తృప్తి.

'బయట పడేయ్... బయట పడేయ్' అంటుంటారు తల్లిదండ్రులు. కారులో ఉన్న పిల్లలు ఏదో ఒకటి తిని, ఆ రేపర్‌ని చేతిలో పట్టుకుని ఉంటే తల్లిదండ్రులకు ఏమీ తోచదు. దానిని బయట పడేయాలి. కారు ఎక్కడ ఉన్నా.. గుడి ముందు ఉన్నా బడి ముందు ఉన్నా నడి రోడ్డులో ఉన్నా డోర్ దించి ఆ చెత్తను బయట పడేయాలి. కారు శుభ్రంగా ఉంచాలి. చెత్త జనానికి పంచాలి. ఎవరూ ఏమీ అడగరని అలాంటి తల్లిదండ్రులకు అదొక ధైర్యం.

'చూచూ వస్తోంది' అంటే 'ఎక్కడో ఒక చోట పోసెయ్‌రా' అనే పెద్దలు తప్ప, ఇల్లు వచ్చే వరకూ ఆగు, బయలు దేరే ముందు పోసుకో అని చెప్తున్నారా ఎక్కడైనా? నలభై ఏళ్లు వచ్చినా, యాభై ఏళ్లు వచ్చి జుట్టు తెల్లబడినా ఖాళీ చోటు కనిపిస్తే చాలు దానిని పాడు చేసే హక్కు ఉన్నట్టుగా బయల్దేరే, చెట్టు కనిపిస్తే దానిని టాయిలెట్ కమోడ్‌గా భావించే పుణ్యపురుషులు భయంకరమైన శిక్ష పడుతుందని చెప్తేనో ప్రాణాంతకమైన క్రిమి సోకుతుందని నిర్ధారిస్తేనో మాత్రమే మారుతారా? మామూలు సమయాలలో మామూలు మర్యాదలను పాటించలేరా?

భారతీయులు నింపాదిగా జీవనం సాగించే మనుషులు. కాని నింపాదితనం పోయింది. సమయం అంటే అదేదో జేబు నుంచి కారిపోతున్న అతి విలువైన మారకంగా మారిపోయింది. ఏ పనికీ ఒక్క గంట ఓపిక పట్టలేకపోతున్నాము. కరెంటు బిల్లు కట్టడానికి అంత సేపా? డాక్టర్ కోసం వెయింటింగ్‌కి అంత సేపా? సినిమా బుకింగ్ దగ్గర అంత సేపా? ఇలా అనేవారిలో 99 శాతం దేశాన్ని ఏలరు. కనీసం ఒక వార్డును కూడా ఏలరు. కాని త్వరత్వరగా తెమిలిపోవాలి. త్వరత్వరగా ఎక్కడికో వెళ్లిపోవాలి. ఎక్కడికి?

ఇవాళ కరోనా అంటువ్యాధి మన దేశంలో ప్రబలడంలో ఆ వ్యాధికి ఉన్న శక్తి కంటే మన దుర్గుణాలకు ఉన్న శక్తి ఎక్కువ ప్రమాదకరంగా మారేలా ఉంది. గేటు కింద దూరి త్వరగా అవతలికి పోవాలి అనుకునేలాంటి వాడే ఫ్లయిట్ దిగిన వెంటనే పారాసిటిమాల్ వేసుకొని త్వరగా ఇల్లు చేరుకోవాలి అని అనుకుంటాడు. తనకు ఆరోగ్యం బాగలేదని, ఇది ప్రమాదమని, వైద్యులకు సరెండర్ కావాలని అనుకోనివాడు ఏ అదను చూసుకొనో ఫేస్‌బుక్‌లో దేశభక్తి మీద ఉపన్యాసాలు దంచుతుంటాడు. చదువుకు, ఇంగితజ్ఞానానికి సంబంధం లేకపోతే ఎంత చదువుకున్నా అతడు అక్షరాస్యుడు కాగలడా? స్వీయ నిర్బంధంలో ఉండాలని చెప్పినా బయట తిరిగి, మాల్స్‌కు తిరిగి, పార్టీలు ఇచ్చి, పార్టీలకు వెళ్లి ఏం చేద్దామని మన ప్రవర్తన? నీ కోసం నువ్వు 14 రోజులు ఇచ్చుకోలేనివాడివి కుటుంబం కోసం దేశం కోసం ఏదో ఒకటి ఇస్తావని ఆశించడం చాలా అసంబద్ధం.

చాలా వీడియోలలో కల్వర్టు మీద వాగు పొంగి ప్రవహిస్తున్నా బైక్ వేసుకు వెళ్లి మునిగిపోయేవాళ్లు కనిపిస్తుంటారు. మనలో చాలా మంది స్వభావం అదే. మనకేం కాదని మన దాకా రాదని. అంత మునిగిపోయేది వచ్చినప్పుడు చూద్దాం అని. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దు అనంటే నిజంగా ఇవాళ మన రోడ్ల మీద అత్యవసరమైతే తప్ప బయటకు వచ్చేవారి శాతమెంత? వృథాగా తిరిగేవారి శాతమెంత? ఒక వేయి మందికి ప్రాణహాని కలిగితేనే మనకు సీరియస్. ఒకరూ ఇద్దరుగా చనిపోతూ ఉంటే 'మామూలు విషయం'.

ఇప్పుడు వచ్చిన అంటువ్యాధి ఇంకా సమగ్ర సమాచారం, అంచనా ఇవ్వని వ్యాధి. అది ఏమిటో అర్థమయ్యేలోపే ఎంతో ప్రాణహాని జరుగుతూ ఉంది. ఇలాంటి సమయంలో రాబోయే రోజులను అంచనా కట్టుకుని, పరిసరాలలో ఉన్న వారితో మాట్లాడుకుని, పని చోట ఉన్నవారితో చర్చించుకుని క్రమశిక్షణతో, బాధ్యతతో పాడు రోజులను ఎదుర్కొనడానికి సిద్ధమవుతారు.

ఇప్పుడు కావలసింది రెండు నెలల పాటు అవసరమయ్యే సరుకులను కొనుక్కుని దాచుకునేవారు కాదు.

కనీసం ఇద్దరికైనా జాగ్రత్తలు చెప్పి వారు క్రమశిక్షణ పాటించేలా చూసి తాము క్రమశిక్షణ పాటించేవారు.

ఒక మనిషికి ఈ వ్యాధి వస్తే ఆ మనిషికి మాత్రమే నష్టం జరిగే 'పరిమిత నష్టకారి' కాదు ఇది. కుటుంబం దాని బారిన పడుతుంది. ఇరుగుపొరుగు దాని బారిన పడతారు. ఒక సమూహమే దాని బారిన పడుతుంది.

నిద్ర లేచి కృష్ణ, రామ, అల్లా, జీసస్‌ను తలుచుకోవడం అవసరమే కావచ్చు. కాని స్వీయ క్రమశిక్షణ గురించి సంకల్పం చెప్పుకోవడం కూడా అవసరం.

ఎవరు చూడొచ్చారులే నుంచి మన అంతరాత్మ మనల్ని గమనిస్తోంది అనే వరకు ఎదుగుదల అవసరం. అదే ఇప్పుడు దేశానికి శ్రీరామరక్ష.

– కె.సువర్చల

'జనాభాతో పాటు దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతూనే ఉంది..' ఈ వాక్యం మనం తరచూ వింటున్నాం. చదువుతున్నాం. తిరిగి మన పనుల్లో మనం పడిపోతున్నాం. ప్రతిభ పులిజాల అందరిలా ఆ వాక్యాన్ని వదిలేయలేదు. నిరుద్యోగ సమస్యనే తన ఉద్యోగంగా మలుచుకుంది. ఖాళీగా ఉన్నవారు ఏ పని చేయాలనుకుంటున్నారో ఆ రంగంలో తగు శిక్షణ ఇస్తుంటుంది. ప్రభుత్వం నుంచి గుర్తింపు కార్డు ఇప్పిస్తుంది. చదువులేనివారికి, ప్రభుత్వ పథకాలపై అవగాహన లేని వారి దగ్గరకు వెళ్లి వాటి గురించి వివరిస్తుంటుంది. అవకాశాలు అందిపుచ్చుకొని మెరుగైన జీవనం పొందేలా సహాయం చేస్తుంటుంది. ఇరవై ఏళ్లుగా దాదాపు డెబ్భై ఐదు వేల మందికి పైగా వారెంచుకున్న రంగంలో నైపుణ్యం పెంచి, శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు ప్రతిభ. తన మొదటి అడుగు నుంచీ ఇప్పటి వరకు సాగించిన పయనం గురించి ఇలా వివరించారు...

ప్రతిభ పులిజాల

● స్కిల్ డెవలప్‌మెంట్

ప్రతిభా శిక్షణ

''నిన్న ఉదయం రిసీవ్ చేసుకున్న ఓ ఫోన్ కాల్ గురించి చెబుతాను. 'మేడమ్.. బాగున్నారా! ఏడాది క్రితం నేను మీ ఇంట్లో పనిచేసిన అనితను' అంటూ పలకరించింది ఓ అమ్మాయి. ఇప్పుడు తను జూబ్లీ హిల్స్‌లోని ఓ పేరున్న బ్యూటీ స్పాలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నానని చెప్పింది. ఆర్థిక పరిస్థితులు సరిగా లేనికారణంగా ఏడవ తరగతితో చదువు ఆపేసిన అనిత తన తల్లితో కలిసి ఇళ్లలో పనులు చేసేది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగామ్‌లో చేరి, బ్యూటీషియన్‌గా పనులు నేర్చుకొని ఇప్పుడు ఈ స్థాయిలో ఉంది. ఇలా జీవితాన్ని మెరుగుపరుచుకున్నవారి గురించి తెలిసినప్పుడల్లా చాలా ఆనందపడుతుంటాను. చదువు లేనివారే కాదు చదువున్నవారు కూడా తమ కెరియర్‌ను బిల్డ్ చేసుకునే క్రమంలో ఇబ్బందులు పడుతుంటారు. ఇంజనీరింగ్ స్టూడెంట్స్ చదువు తర్వాత సాఫ్ట్‌వేర్‌లోనో.. మరేదైనా కంపెనీలోనో విద్యార్హతతో జాబ్‌లో చేరుతారు. ఆ తర్వాత సరైన నైపుణ్యం లేదని ఆ కంపెనీలు 'రిజక్ట్' చేసే పరిస్థితులు ఎదురవుతుంటాయి. అక్కణ్ణుంచి వెనక్కి వచ్చేస్తే జీవితంలో ఇంకా వెనకబాటుకు లోనవుతారు. ఇలాంటి పరిస్థితి నుంచి యువతను తప్పించడానికే ఈ రంగాన్ని ఎంచుకున్నాను. సికింద్రాబాద్‌లోని తిరుమలగిరిలో మా ఆఫీస్ ఉంది. హైదరాబాద్‌లో ఏయే ప్రాంతాల్లో స్కిల్ డెవలప్‌మెంట్‌కి సంబంధించి కౌన్సెలింగ్ ఇవ్వాలో ముందే నిర్ణయించుకుంటాను. వారంలో అన్ని రోజులూ శిక్షణాకార్యక్రమాల కోసం తిరుగుతూ ఉంటాను. చిన్న చిన్న బస్తీలు మొదలుకొని కాలేజీ క్యాంపస్‌ల వరకు నా ప్రోగ్రామ్స్ ఉంటాయి. మన దేశంలో చదువు ఉంది. కానీ, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన సమస్యలే అధికంగా ఉన్నాయి.

ఇరవై ఏళ్లుగా..

ఉస్మానియా యూనివర్శిటీలో ఇంగ్లిష్ లిటరేచర్‌లో పీజీ పూర్తి చేశాను. రెండేళ్లు లెక్చరర్‌గా ఉద్యోగం చేశాను. అప్పుడే అర్థమైంది చదువుకు కొదవ లేదు, నైపుణ్యాలకు సంబంధించిన లోటు అంతటా ఉందని. అప్పుడే 'కెరియర్ హైట్స్'పేరుతో కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాను. ఇక్కడ నుంచే విద్యార్థులకు జాబ్ ప్లేస్‌మెంట్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాను. అక్కణ్ణుంచి ఆలోచనా విస్తృతి పెరిగింది. కొన్ని ఫార్మా కంపెనీలు, జీడిమెట్ల ప్రాంతంలో ఉండే ఫ్యాక్టరీలకు వెళ్లినప్పుడు అక్కడి యాజమాన్యం పనివాళ్లను వేరే రాష్ట్రాల నుంచి తీసుకురావడం గమనించాను. దాంతో ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న జనాభా గురించి వాకబు చేశాను. పనిలేకుండా ఖాళీగా ఉండేవారి సంఖ్యను బేరీజు వేసుకున్నాను. వారిని కలిసి, సమావేశాలు ఏర్పాటు చేసి, వారికి శిక్షణ ఇచ్చాను. ఫలితంగా అక్కడి కంపెనీలలో ఆ ప్రాంతంలో నివాసం ఉన్నవారికే పని అవకాశాలు పెరిగాయి. గతంలో ఇళ్లలో పనులు చేసుకునేవారు సైతం ఇప్పుడు పేరున్న కంపెనీలలో పనిచేసే స్థాయికి చేరినవారున్నారు. ఇలాగే మెదక్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశాను.

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిభ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇస్తున్న దృశ్యం

ప్రభుత్వంతో కలిసికట్టుగా..

ప్రపంచంలో మన దేశాన్ని స్కిల్ క్యాపిటల్‌గా మార్చాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు అన్ని రంగాలకు అవసరమే. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచి నిరుద్యోగ యువతకు సరైన పని కల్పించాలన్న లక్ష్యంతో స్కిల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను ప్రభుత్వమూ నిర్వహిస్తుంది. అయితే వాటి గురించిన అవగాహన ప్రజల్లో లేకపోవడంతో సరైన ఫలితాలు రావడం లేదు. దీంతో ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి సౌత్ రీజియన్ అడ్వైజర్‌గా ప్రభుత్వంతో కలిసి వర్క్ చేస్తున్నాను. మీడియా, సినిమా, ఫొటోగ్రఫీ, బ్యూటీ, ఫ్యాషన్ డిజైనింగ్.. ఇలా 14 రంగాలలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కౌన్సెలింగ్ చేస్తున్నాను.

కుటుంబ ప్రోత్సాహం

పుట్టి పెరిగింది, చదువుకున్నది హైదరాబాద్‌లోనే. నాన్న లింగయ్య వైమానిక దళ ఉద్యోగి. అమ్మ ఫణిబాయి. ఇద్దరు అన్నయ్యలు. మా పెంపకంలో ఎక్కడా వివక్ష లేదు. తాతయ్య పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనూ, నాన్న ఎయిర్‌ఫోర్స్‌లోనూ పనిచేయడంతో స్వీయ క్రమశిక్షణతోపాటు సమాజం పట్ల బాధ్యత కూడా చిన్నతనం నుంచే అలవడింది. మా వారు దినేశ్ డెంటిస్ట్. అత్తింటి వారూ బాగా చదువుకున్నవారు కావడంతో నా తపనకు ఎక్కడా ఆంక్షలూ, అడ్డంకులూ లేవు. మనం చేసే పని పదిమందికి ఉపయోగపడాలన్నదే మా కుటుంబం నుంచి వచ్చిన మాట. అదే నన్ను ఎంతోమందిని కలిసేలా, ఎన్నో విషయాలు నేర్చుకునేలా, మరెన్నో విషయాలు నలుగురికి తెలియజేప్పే అవకాశాన్ని ఇచ్చింది.

స్వచ్ఛత - శుభ్రత

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ కోసం మురికివాడలకు వెళ్లినప్పుడు అక్కడి వాతావరణం, పరిస్థితులు చాలా బాధ కలిగించాయి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లైనా.. ఈ టెక్నాలజీ యుగంలోనూ కనీస వసతులు లేకుండా జీవిస్తున్న దుర్భరమైన జీవితాలను చూసినప్పుడు ఇదేనా మనం సాధించిన ప్రగతి అన్న ఆవేదన కలిగింది. స్వచ్ఛభారత్ అంటున్న కేంద్రప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం గురించి, వారి ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదని గమనించాను. పారిశుద్ధ్య కార్మికుల్లోనూ వృత్తి నైపుణ్యాలు పెంచడంతో పాటు వారి సంక్షేమం గురించీ ఆలోచించాను. వారికీ శిక్షణ ఇవ్వాలని, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నాను. అందుకోసం ముందుగా నేను ట్రెయిన్ కావాలని 'సఫాయి కర్మచారి' సర్టిఫికెట్ కోర్సు చేశాను. ఫండ్స్ కోసం 5కె, 10 కె రన్స్ నిర్వహించినా ఫలితం లేకపోయింది. అప్పుడు జీహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసి నా ఆలోచన చెప్పాను. వారి సహకారంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటిగా 'కర్తవ్య ఫౌండేషన్' ఏర్పాటు చేసి చందానగర్ ఏరియాలో మూడువందల మందికి శిక్షణ ఇచ్చాం. వారికి నా పనితీరు, నిబద్ధత నచ్చడంతో ఆ తర్వాత 'సాఫ్ హైదరాబాద్ – షాన్‌దాన్ హైదరాబాద్', 'వాటర్ లీడర్‌షిప్ కన్జర్వేషన్'లో భాగస్వామిగా పనిచేసే అవకాశం ఇచ్చారు. దేశం మారాలంటూ పథకాలు రూపొందిస్తే ఫలితం ఉండదు ఆయా పథకాల ద్వారా దేశం ప్రగతి పథంలో పయనించాలంటే మార్పు అనేది అట్టడుగు స్థాయి నుంచి మొదలు కావాలి' అని వివరించారు ప్రతిభ పులిజాల.

ఒకవైపు స్కిల్ డెవలప్‌మెంట్ దిశగా సాగుతున్న శిక్షణాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మరోవైపు మురికివాడల్లో పరిశుభ్రమైన జీవనం కోసం, స్వచ్ఛమైన పరిసరాల కోసం కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: అనీల్‌కుమార్

కూల్ ఐడియా

ఆపిల్ మింట్ సర్‌ప్రైజ్

కావలసినవి :

పీల్ తీసిన ఆపిల్ ముక్కలు – ఒక కప్పు; శుభ్రపరిచిన పుదీనా – ఒక కప్పు; దానిమ్మ జ్యూస్ – పావుకప్పు; పాలు – అరకప్పు ; నిమ్మరసం – రుచికి తగినంత.

తయారీ:

ఆపిల్ ముక్కలు, పుదీనా, నిమ్మరసం, పాలు కలిపి మెత్తగా బ్లెండ్ చేసి వడకట్టుకోవాలి. దీనికి దానిమ్మ జ్యూస్ కలపాలి. ఫ్రిజ్‌లో పెట్టి చల్లబడ్డాక సర్వ్ చేయాలి.

కరోనా అయినా మామూలు జలుబైనా

దగ్గు... తుమ్ము గురించి ఆందోళన ఎందుకంటే...

కరోనా సీజన్ కొనసాగుతున్న ఈ తరుణంలో ఎవరైనా కాస్తంత దగ్గినా... ఏమాత్రం తుమ్మినా ప్రజలంతా బెంబేలెత్తిపోతున్నారు. సమీపంలో ఉన్నవారు దూరంగా తొలగిపోతుంటారు. మనం దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు గాల్లోకి వ్యాపించే తుంపర్లతో కరోనా వస్తుందన్న విషయం తెలిసిందే. ఇలా వ్యాపించడం అన్నది ఎంత వేగంగా జరుగుతుందో తెలుసుకుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

- ఎవరైనా దగ్గగానే వారి నోటి నుంచి వచ్చే తుంపర్లు ప్రయాణం చేసే వేగం... గంటకు దాదాపు 60 మైళ్లు. (దాదాపు 96 కిలోమీటర్లు/గంటకు)
- ఇక తుమ్మువల్లనైతే ఈ తుంపర్లు ప్రయాణం చేసే వేగం... గంటకు 100 మైళ్లు (దాదాపు 160 కి.మీ./గంటకు) ఉంటుంది.
- జలుబు సమయంలో తుమ్మినప్పుడు సమీపంలోని గాల్లోకి వెలువడే తుంపర్ల సంఖ్య దాదాపు 40,000 వరకు ఉంటుంది.
- ఈ తుంపర్లు గరిష్టంగా 200 అడుగులు (60 మీటర్ల) వరకు ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంది.
- తుమ్మినప్పుడు 30 సెకండ్లపాటు కర్చీఫ్ అడ్డుగా పెట్టుకున్నప్పుడు ఆ కర్చీఫ్‌పై ఒక చదరపు సెం.మీ. భాగంలో చేరే సూక్ష్మజీవుల సంఖ్య దాదాపు లక్ష వరకు ఉంటుంది.
- ఒకవేళ అప్పటికే ఆ తుమ్మిన వ్యక్తికి కరోనా సోకి ఉందనుకుంటే... సూదిమోపినంత స్థలంలోనే మిలియన్ల కొద్దీ వైరస్‌లు ఉండి... అవి కళ్లు, ముక్కు, నోటికి తగలగానే వెంటనే జబ్బును వ్యాప్తి చేయగలుగుతాయి.
- అందుకే దగ్గు వచ్చినా లేదా తుమ్మాల్సిన పరిస్థితులు ఏర్పడ్డా పొడవు చేతుల చొక్కా (లాంగ్‌స్లీవ్స్) దగ్గర మోచేతి మడతలో దగ్గడం, తుమ్మడం చేయాలి. అక్కడే ఎందుకంటే... మనం ఆ ప్రదేశాన్ని దాదాపుగా ముట్టుకోం. అలాగే ఒక వేళ చేతులతో షేక్ హ్యాండ్ ఇచ్చినా... వాటి మీద వైరస్ ఉండదు. ఈ కారణం చేతనే దగ్గడం లేదా తమ్ముడం వంటివి చేసినప్పుడు చేతులు ఎంత మాత్రమూ అడ్డుపెట్టుకోకూడదు.



మాభూమి @ 40

'మాభూమి' చిత్రంలో సాయిచంద్

సాయిచంద్, రమణ

మాభూమి షూటింగ్ సందర్భంగా గద్దర్, దర్శకుడు గౌతమ్, బి.నరసింగరావు, నీలంబన ఘోష్

'మాభూమి' చిత్రంలో ఓ దృశ్యం

ఇండస్ట్రీ కొన్నిసార్లు మూస దారిలో ప్రయాణిస్తుంటుంది... అదే రహదారని భ్రమపడేంత. కొన్నిసార్లు ఆ దారిని ఏమాత్రం లెక్క చేయకుండా.. కొత్త దారుల్ని వెతుక్కుంటూ కొన్ని సినిమాలు వెళ్తాయి. 'పాత్ బ్రేకింగ్' సినిమాలంటాం వాటిని. 40 ఏళ్ల క్రితం చేసిన అలాంటి ప్రయత్నమే 'మా భూమి'. ఫలితం – ప్రభంజనం. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేపథ్యంలో వచ్చిన సినిమా 'మా భూమి'. తెలుగు సినిమాల్లో సంచలనాలను ప్రస్తావించాల్సినప్పుడల్లా 'మా భూమి'ని నెమరువేసుకుంటూనే ఉన్నాం. ఇవాళ మళ్లీ గుర్తు చేసుకుందాం. నేటితో 'మా భూమి' 40ఏళ్లు పూర్తి చేసుకుంటుంది. ఈ సినిమా గురించి చెప్పుకోవడానికి వంద విశేషాలు ఉంటాయి. కానీ 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమైన 40 విశేషాలు మీకోసం.

- కిషన్ చందర్ రాసిన 'జబ్ ఖేత్ జాగే' అనే ఉర్దూ నవల ఈ సినిమాకు స్ఫూర్తి.
- ప్రఖ్యాత బెంగాలీ దర్శకుడు మృణాల్ సేన్ సలహా మేరకు గౌతమ్ – ఘోష్‌ను దర్శకుడిగా ఎంపిక చేసుకున్నారు.
- దర్శకుడు గౌతమ్ ఘోష్‌కి ఇదే తొలి సినిమా.
- నవల ఆధారంగా గౌతమ్ ఘోష్ ఓ కథను రాసుకొచ్చారు. కానీ నిర్మాతలకు అంతగా నచ్చలేదు. మళ్లీ తెలంగాణాలో పలు ప్రాంతాలు సందర్శిస్తూ ఈ కథను రాసుకున్నారు.
- ప్రముఖ రచయిత త్రిపురనేని గోపీచంద్ కుమారుడు త్రిపురనేని సాయిచంద్ ఈ సినిమా ద్వారానే పరిచయమయ్యారు.
- ఈ సినిమాను నిర్మించడమే కాకుండా స్క్రీన్ ప్లేను అందించారు బి. నర్సింగరావు.
- ఉత్తమ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగాలలో ఈ సినిమాకు నంది అవార్డులు వరించాయి.
- కార్వే వారీ ప్రపంచ చలన చిత్రోత్సవాల్లో మన దేశం తరపున అధికారికంగా ఎంపికయిన చిత్రం 'మా భూమి'.
- సీఎన్ఎన్– ఐబీఎన్ తయారు చేసిన 'వంద అత్యుత్తమ భారతీయ చిత్రాల' జాబితాలో 'మా భూమి' చోటు చేసుకుంది.
- ఈ సినిమా చిత్రీకరణ చాలా భాగాన్ని మెదక్ జిల్లాలోని మంగళ్‌పర్తిలో చేశారు. అది బి. నరసింగరావుగారి అత్తగారి ఊరే.
- లక్షన్నర బడ్జెట్ అనుకుని మొదలయిన ఈ చిత్రం పూర్తయ్యేసరికి ఐదున్నర లక్షలయింది.
- ఈ సినిమాకు గౌతమ్ ఘోష్ భార్య నిలాంజనా ఘోష్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరించారు.
- ఈ సినిమాకు సంబంధించిన బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌ను దర్శకుడు గౌతమే స్వయంగా చూసుకున్నారు.
- పాపులర్ నటి తెలంగాణ శకుంతల ఈ సినిమా ద్వారానే ఇండస్ట్రీకి పరిచయమయ్యారు.
- కేవలం ఉదయం ఆటగానే ప్రదర్శించేట్టు ఈ చిత్రాన్ని విడుదల చేశారు. విడుదల తర్వాత హైదరాబాద్‌లోని సుదర్శన్ థియేటర్‌లో ఏడాది పాటు నిర్విరామంగా ఆడింది.
- ప్రజాగాయకుడు గద్దర్ తొలిసారి స్క్రీన్ మీద కనిపించిన చిత్రం ఇదే.
- తెలంగాణ పల్లె జీవితం ఎలా ఉండాలో అర్థం చేసుకోవడానికి గౌతమ్, నర్సింగరావు తెల్లవారగానే పల్లెలోకి వెళ్లి ఊరిలోని ప్రజలు ఎలా జీవిస్తున్నారో గమనిస్తూ ఉండేవారట.
- సినిమా షూటింగ్ ప్రారంభించడానికి ఇల్లును కుదవపెట్టారట నర్సింగరావు.
- సినిమాలో ఒక సన్నివేశంలో శవం దగ్గర ఏడ్చే సన్నివేశం ఉంది. కానీ ఆ సీన్‌లో యాక్ట్ చేయడానికి ఎవ్వరూ ముందుకు రాలేదట. సుమారు మూడు నాలుగు ఊర్లు గాలించి పోచమ్మ అనే ఆవిడను తీసుకువచ్చి నటింపజేశారట.
- ఈ సినిమాలోని 'బండెనక బండి కట్టి... పదహారు బళ్లు కట్టి..' పాట చాలా పాపులర్. మొదట ఈ పాటను నర్సింగరావు మీద తీశారు. రషెష్ చూసుకున్న తర్వాత నా కంటే గద్దర్ మీద చిత్రీకరిస్తే బావుంటుంది అని సూచించారు నర్సింగరావు.
- మా భూమి చిత్రాన్ని మార్చి 23నే విడుదల చేయాలని దర్శక–నిర్మాతల ఆలోచన. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరి తీసింది మార్చి 23వ తేదీనే. ఆ రోజు విడుదల చేస్తే ఆ ముగ్గురికీ నివాళిలా ఉంటుందని భావించారట.
- సినిమా పూర్తయి సెన్సార్‌కి నిర్మాతల జేబులు ఖాళీ అయిపోతే సహ నిర్మాత రవీంద్రనాథ్ పెళ్లి ఉంగరాలను తాకట్టుపెట్టి వచ్చిన రూ.700లతో సెన్సార్ జరిపించారు.
- సహజత్వానికి దగ్గరగా ఉండాలని సాయి చంద్ పాత్రకు ఊర్లోని వారి బట్టలను అడిగి తీసుకుని కాస్ట్యూమ్స్‌గా కొన్ని రోజులు వాడారు.
- ఈ సినిమా మొత్తాన్ని మూడు షెడ్యూల్స్‌లో 50 రోజుల్లో పూర్తి చేశారు.
- షూటింగ్స్, సెన్సార్ వంటి అవరోధాలన్నీ దాటి నప్పటికీ ఈ సినిమాను కొనుగోలు చేయడానికి పంపిణీదారులెవ్వరూ ముందుకు రాలేదు. ఇదేదో రాజకీయ పాఠాలు చెబుతున్న సినిమాలా ఉందని కామెంట్ చేశారట. చివరికి లక్ష్మీ ఫిలింస్, శ్రీ తారకరామా ఫిలింస్ వారు ఈ సినిమాను విడుదల చేశారు.
- ఈ సినిమాకు సహనిర్మాతగా వ్యవహరించిన రవీంద్రనాథ్, ఆయన భార్య సినిమా విడుదలైన మూడో రోజు సినిమా చూడటానికి థియేటర్‌కి వెళ్లారు. కానీ వారికి కూడా టికెట్లు దొరకలేదట.
- 'చిల్లర దేవుళ్లు' తర్వాత సినిమా సంభాషణల్లో పూర్తి స్థాయి తెలంగాణ యాసను వాడిన సినిమా ఇదే.
- యూనిట్ దగ్గర ఉన్న కొత్త చీరలు, రుమాల్లు, పంచెలు గ్రామంలో వారికి ఇచ్చి వారి దగ్గర ఉన్న పాత బట్టలు తీసుకుని చిత్రీకరణ కోసం వినియోగించేవారట చిత్రబృందం.
- తొలుత ఈ సినిమాకు 'జైత్రయాత్ర' అనే టైటిల్‌ని పరిశీలించారట. భూమి కోసం పోరాటం జరుగుతుంది. 'మన భూమి' పెడితేనే బావుంటుందని నర్సింగరావు సూచించారట.
- సినిమాలో గడీను ముట్టడి చేసే సన్నివేశాల చిత్రీకరణకు ఆ గ్రామ ప్రజలు సహకరించలేదు. చివరికి వారి అనుమతి లేకుండానే చిత్రబృందం తయారు చేయించుకొని తెచ్చుకున్న తలుపును బద్దల కొట్టినట్టుగా షూట్ చేశారు.
- 1948లో హైదరాబాద్ రాష్ట్రంపై భారత ప్రభుత్వం చేసిన సైనిక చర్యకు సంబంధించిన సన్నివేశాలనే సినిమాలో వినియోగించుకున్నారు. ● పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పుడు నటీనటుల గాయాలకే రోజుకో ఐయోడిన్ సీసా ఖాళీ అయ్యేదట.
- చిత్రకారుడు తోట వైకుంఠం ఈ సినిమాకు ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు.. ఇదే తొలి సినిమా.
- దేవీప్రియ ఈ సినిమాకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా పని చేశారు.
- ఈ సినిమాలోని 'పల్లెటూరి పిల్లగాడ పసులు గాసే మొనగాడా..' పాటను సీనియర్ రచయిత సుద్దాల హనుమంతు రచించారు. ప్రస్తుతం ప్రముఖ గేయ రచయితగా కొనసాగుతున్న సుద్దాల అశోక్ తేజ ఆయన కుమారుడే.
- సినిమా చిత్రీకరిస్తున్న రోజుల్లో యూనిట్ మొత్తం మంగళ్ పర్తిలోని బడిలో నివసించారు. ఆ పక్కనే ఉన్న బావి దగ్గర మగవాళ్లు స్నానాలు చేసేవారు. స్త్రీలేమో ఆ ఊర్లోని సంపన్న కుటుంబీకుల ఇంట్లోని స్నానాల గదులు వాడుకునేవారట.
- ఈ సినిమా నిర్మాణానికి మూడేళ్ల సమయం పట్టింది. ● ఈ సినిమా నెగటివ్ పాడైపోవడంతో 2015 ప్రాంతంలో డిజిటలైజ్ చేసి డీవీడీ విడుదల చేశారు.

– గౌతమ్ మల్లాది

వెంకటేష్

మేము సైతం

కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండటంలో భాగంగా ప్రధాని మోదీ ఇచ్చిన 'జనతా కర్ఫ్యూ' పిలుపునకు మేముసైతం అంటూ సినీ సెలబ్రిటీలు తమ మద్దతు తెలిపారు. ఉదయం నుంచి ఇళ్లకే పరిమితమయ్యారు.. సాయంత్రం 5గంటలకు ఇంటి ఆవరణల్లోకి విచ్చేసి అత్యవసర సేవలు అందిస్తున్న పలు విభాగాల సిబ్బందికి చప్పట్లు కొట్టి అభినందనలు తెలిపారు. కృష్ణంరాజు, చిరంజీవి, మోహన్‌బాబు, వెంకటేష్, అల్లు అరవింద్, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, మంచు విష్ణు, మనోజ్, గోపీచంద్, రాజశేఖర్, వరుణ్ తేజ్, పూరి జగన్నాథ్, అనిల్ రావిపూడి, నాగబాబు, తమన్నా, చార్మీ, పూజా హెగ్డే, జీవిత, మంచు లక్ష్మి వంటి వారు చప్పట్లు కొడుతున్న, గంటలు మోగిస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

కుటుంబ సభ్యులతో చిరంజీవి

కుటుంబ సభ్యులతో అల్లు అరవింద్, అల్లు అర్జున్

చార్మి

పూరి జగన్నాథ్

దర్శకుడు విస్సు ఇకలేరు

విస్సు

ప్రముఖ తమిళ దర్శకుడు విస్సు(74) ఇక లేరు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్న ఆయన చెన్నై దురైపాక్కంలోని స్వగృహంలో ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. 1981లో దివంగత ప్రఖ్యాత దర్శకుడు కె.బాలచందర్ వద్ద సహాయ దర్శకుడిగా చేరారు విస్సు. ఆ తర్వాత బాలచందర్ దర్శకత్వం వహించిన 'తిల్లుముల్లు' చిత్రానికి కథారచయితగా పరిచయమయ్యారు. 'కణ్మణి పూంగా' అనే చిత్రంతో దర్శకుడిగా మారారు విస్సు. తెలుగు చిత్ర పరిశ్రమలో 'ఆడదే ఆధారం' అనే చిత్రానికి దర్శకత్వం వహించారాయన. ఎస్పీ ముత్తరామన్ దర్వకత్వం వహించిన 'కుడుంబం ఒరు కడంబం' అనే సినిమాతో నటుడిగానూ మారారు. రజనీకాంత్, కమల్ హాసన్ వంటి హీరోలతో కలిసి పనిచేశారాయన. 'అరుణాచలం' సినిమాలో రంభ తండ్రిగా చేసిన రంగాచారి పాత్ర ఆయనకు మంచి పేరు, గుర్తింపు తీసుకొచ్చింది. కుటుంబ కథా చిత్రాలను చక్కగా తెరకెక్కించగలరనే పేరు పొందారాయన. ఆయన దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'సంసారం అదు నిన్‌సారం'కి జాతీయ ఉత్తమ చిత్రం అవార్డు వచ్చింది. ఈ చిత్రాన్ని తెలుగులో 'సంసారం ఒక చదరంగం' పేరుతో రీమేక్ చేశారు. తమిళంలో విస్సు చేసిన పాత్రనే తెలుగులో గొల్లపూడి మారుతీరావు చేశారు. విస్సు మృతికి తమిళ సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతిపట్ల సంతాపం తెలిపారు. విస్సుకి భార్య ఉమ, కుమార్తెలు లావణ్య, సంగీత, కల్పన ఉన్నారు.

కరోనా సమయాలు

రేపటి సీన్ పేపర్ ఎక్కడ? లొకేషన్ ఏమిటి? కాల్షీట్ ఎన్నింటికి? ఈ హడావిడిలో ఉండే బాలీవుడ్ తారలు ఒక్కసారిగా ఉలికి పడ్డారు. కరోనాతో కలత పడ్డారు. షూటింగ్‌లకు ఫుల్‌స్టాప్ పెట్టి ఇళ్లకే పరిమితమయ్యారు. భారతదేశంలో కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఈ వ్యాధి ఒకరి స్పర్శతో మరొకరికి వ్యాపిస్తుందని, నలుగురిలో కలవడం వల్ల మనకు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తుండటంతో చాలామంది నటీనటులు స్వీయ నిర్బంధంలోకి వెళుతున్నారు. అందరూ ఇళ్లకే పరిమితమవుతున్నారు. అయితే ఇంట్లో ఉన్నవారు ఊరికే ఉంటారా? ఏదో ఒక వ్యాపకంలో పడతారు. కొందరు బొమ్మలు వేస్తున్నారు. కొందరు పుస్తకాలు చదువుతున్నారు. కొందరు వ్యాయామాలు చేస్తున్నారు. మరికొందరు పిల్లలతో గడుపుతున్నారు. కుటుంబంతో ఉండటం కూడా బాగుంది అని భావిస్తున్నారు.


సెల్ఫ్ క్వారంటైన్
సైఫ్ పుస్తక పఠనం

బాల్కనీలో కరిష్మా


దీపికా పదుకోన్ ఫేస్ మసాజ్

బుక్ రీడింగ్ - సిద్దార్థ్ మల్హోత్రా


గిటార్ ప్లే - కత్రినా కైఫ్

పెట్‌తో - ప్రియాంకా చోప్రా

ఎండ వేళ - మలైకా అరోరా

జాన్వీ కపూర్

ఇన్‌స్టాగ్రామ్ వేదికగా

ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బాలీవుడ్ తారలు తమ 'నిర్బంధ వ్యాపకాలను' అభిమానులతో పంచుకుంటున్నారు. కరిష్మా కపూర్ తన ఇంటి బాల్కనీలో చక్కటి ఫోజ్‌లో ఫొటో దిగి పోస్ట్ చేసింది. 'ఈ సమయంలో మీరంతా ఆందోళన చెందుతూ ఉంటారు. తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చికాకు పడుతుంటారు. అయితే ఇలా ఉన్నది మీరొక్కరే కాదు. ప్రపంచంలో అందరం ఉన్నాం. అందుకే ధైర్యంగా ఉందాం. ఆశావహంగా ఉందాం' అని ఆమె రాసింది. ఇక ఆమె సోదరి కరీనా కపూర్ తన పాత అల్బమ్స్ తిరగేసే పనిలో పడింది. బుజ్జాయిగా ఉన్న ఒక ఫొటోను పోస్ట్ చేస్తూ 'ఎవరో దగ్గరికొస్తుంటే వద్దన్నట్టున్నా కదూ. ఈ కరోనా టైమ్‌కు సరిగ్గా సరిపోయే ఫోటో ఇది' అని రాసింది. అలాగే ఆమె తన భర్త సైఫ్ అలీ ఖాన్ ఫొటోను కూడా పోస్ట్ చేసింది. 'ఒక వారం పాటు 'బుక్' అయ్యాడు' అని కామెంట్ పెట్టింది. క్యాండిల్ లైట్ల వెలుతురులో పుస్తకాలు చదువుకుంటున్న సైఫ్ ఫొటోను చూసి చాలా మంది ముచ్చటపడుతున్నారు.

బాల్కనీ నుంచి బయటకు

మలైకా అరోరా తన పెంపుడు కుక్కతో కలిసి బాల్కనీలో కూచుని ఉన్న ఫొటోను పోస్ట్ చేసింది. 'ఇంట్లో ఉన్నాను. నా కొడుకు అర్హాన్ ఈ ఫొటో తీశాడు' అని రాసుకుంది ఆమె. ఇక టాప్‌స్టార్ ఆలియా భట్ అయితే తాను చదువుతున్న పుస్తకం ఫొటో పెట్టి 'స్టే హోమ్. ఫినిష్ ఏ బుక్' అని రాసింది. ఆలియా భట్‌కు పుస్తకాలు చదివే అలవాటు ఆమె తండ్రి మహేశ్ భట్ నుంచి వచ్చింది. మహేష్ భట్ ఎప్పుడు ఏ పుస్తకం కొన్నా దాని బిల్లు ఆలియా భట్టే చెల్లించాలని ఒక ఒప్పందం వారిద్దరి మధ్య ఉంది. మరోవైపు బొమ్మలు గీసే వాళ్లకు కూడా కొదవ లేదు. 'అంధాధున్', 'డ్రీమ్‌గర్ల్', 'బాలా' సినిమాలతో మంచి ఊపు మీదున్న ఆయుష్మాన్ ఖురానా తోచిన బొమ్మలు వేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టాడు. 'ఇంట్లో ఉండి మన టాలెంట్ అంతా చూపుదాం. కరోనాను సమర్థంగా ఎదుర్కొందాం' అని రాశాడతను.

తండ్రీ కూతుళ్ల అల్లరి

కరోనా ఎఫెక్ట్ వల్ల ఇంట్లో ఉండిపోయిన అక్షయ్ కుమార్ తన కూతురు నితారతో కలిసి అల్లరి చేస్తుంటే తాను రాయవలసిన పుస్తకం రాయలేకపోతున్నానని అక్షయ్ భార్య ట్వింకిల్ ఖన్నా ఒక సరదా ఫొటో పోస్ట్ చేసింది. ఫొటోలో ఆమె ల్యాప్ టాప్ కనిపిస్తూ ఉండగా దూరంగా లాన్‌లో అక్షయ్ కుమార్ తన కుమార్తెతో ఆటలాడుతున్నాడు. దీపికా పడుకోన్ మాత్రం ఈ ఊహించని ఖాళీ సమయాన్ని తన దేహ సంరక్షణ కోసం కేటాయిస్తోంది. 'సెల్ఫ్ కేరింగ్‌లో ఉన్నాను' అంటూ ఆమె ఒక ఫొటో పోస్ట్ చేసింది. 'వార్డ్‌రోబ్‌లను కూడా క్లియర్ చేస్తున్నాను' అని మరో ఫొటో పెట్టింది. ప్రియాంక చోప్రా మాత్రం తన కుక్క జినోతో గడుపుతోంది. 'ఇంట్లో ఉండటానికి మించిన క్షేమం ఇప్పుడు లేదు. నా కుక్క 'జినో'తో ముద్దుముచ్చట్లు సాగుతున్నాయి. సంతోషంగా ఉంది' అని రాసిందామె. జినో జర్మన్ షపర్డ్ అట. తొలి వివాహ దినోత్సవం సందర్భంగా భర్తకు ఆ కుక్కను కానుకగా ఇచ్చిందట. కత్రినా కైఫ్ ఈ ఖాళీ సమయాలలో గిటార్ మీటే పనిలో పడితే, యువ హీరో సిద్దార్థ్ మల్హోత్రా పుస్తకాల పురుగుగా మారాడు. సల్మాన్ ఖాన్ బొమ్మలు వేసి వేళ్లకు ఎక్సర్‌సైజ్ ఇస్తున్నాడు.

మొత్తం మీద బాలీవుడ్ స్టార్‌లందరూ క్రమశిక్షణతో ఉంటూ తాము కరోనాను అంటించుకోకుండా, తమ వల్ల అది పది మందికి అంటకుండా జాగ్రత్త వహిస్తున్నారు. మనందరం కూడా అత్యవసరం అనుకుంటే తప్ప కొన్నాళ్లు ఇల్లు కదలకుండా ఇంట్లో ఉంటూనే పని చేస్తూ కాస్త సరదా సమయాలను కూడా దొంగిలించుకుందాం.

పాత ఆల్బమ్‌లో... కరీనా కపూర్

కంగనా రనౌత్

ఆవేశం ఆయుధమైతే...

తనీష్

'గుండె కన్నీరైతే.. ఆవేశం ఆయుధమైతే.. ఆ కత్తి రాసే రుధిర కావ్యమే ఈ మహాప్రస్థానం' అంటూ భావోద్వేగం నిండిన వాయిస్ ఓవర్‌తో విడుదలైన 'మహాప్రస్థానం' మోషన్ పోస్టర్ సినిమాపై ఆసక్తి పెంచుతోంది. తనీష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మహాప్రస్థానం'. 'ద జర్నీ ఆఫ్ ఆన్ ఎమోషనల్ కిల్లర్' అనేది ఉపశీర్షిక. జాని దర్శకత్వం వహించారు. ముస్కాన్ సేథీ కథానాయిక. 'వరుడు' ఫేమ్ భానుశ్రీ మెహ్రా, కబీర్ దుహాన్ సింగ్, రాజా రవీంద్ర కీలక పాత్రలు పోషించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా వేసవికి విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్రం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌లను విడుదల చేశారు. అనంతరం డైరెక్టర్ జాని మాట్లాడుతూ– ''తనీష్ పాత్రలోని ఇంటెన్సిటీని ప్రేక్షకులు కొత్తగా ఫీలవుతారు. కిల్లర్‌గా తన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణ. కథలోని బలం మా అందరికీ ఇంత ఎనర్జీని ఇచ్చి పనిచేసేలా చేస్తోంది. ఇదొక అసాధారణ సినిమా అని చెప్పాలనే కొత్తగా మోషన్ పోస్టర్, ఫస్ట్ లుక్ చేయించాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.

పేద కళాకారులకు అండగా జీవిత - రాజశేఖర్

కరోనా వైరస్ ప్రభావంతో ఈ నెలాఖరు వరకు సినిమా షూటింగ్‌లు ఆపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. చలన చిత్ర పరిశ్రమ పెద్దలు కూడా మార్చి 31వరకు షూటింగ్‌లు ఆపివేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. ఏరోజుకు ఆ రోజు పని చేస్తే తప్ప ఇల్లు గడవని నిరుపేద కళాకారులు 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్'లో (మా) కొందరు ఉన్నారు. అలాంటి కళాకారులకు పది రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను రాజశేఖర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించనున్నట్లు హీరో డా.రాజశేఖర్–జీవితా రాజశేఖర్ ప్రకటించారు. నిరుపేద కళాకారులు 90108 10140 నంబర్‌కి కాల్ చేసి పూర్తి వివరాలు అందించి తగు సహాయం పొందాలని కోరారు.

పరిపరిశోధన

పనస వ్యర్థాలతో అల్ట్రాకెపాసిటర్లు

పనసపండులో మనం తినేది పిసరంతైతే.. వృథాగా పారబోసేది బోలెడంత. అయితే ఆస్ట్రేలియా యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఈ వ్యర్థానికి కొత్త అర్థం చెప్పారు. పనసతో పాటు దీని తోబుట్టువుగా భావించే డ్యూరియన్ పండు వ్యర్థాలను విద్యుత్తును నిల్వ చేసుకోగల అల్ట్రా కెపాసిటర్లుగా మార్చవచ్చునని వీరు ప్రయోగాత్మకంగా నిరూపించారు. అల్ట్రా కెపాసిటర్లకు, బ్యాటరీలకు కొంచెం తేడా ఉంటుంది. రెండింటిలోనూ విద్యుత్తును నిల్వ చేసుకోవచ్చుగానీ.. అల్ట్రా కెపాసిటర్లలో విద్యుత్తు విడుదల చాలా వేగంగా జరిగిపోతుంది. అంతే వేగంగా ఛార్జ్ కూడా అవుతుంది. వీటితో కొన్ని సెకన్లలోనే మన ఎలక్ట్రానిక్ పరికరాలను ఛార్జ్ చేసుకోవచ్చు. పనస, డ్యూరియన్ పండ్ల వ్యర్థాలను తాము ముందుగా కార్బన్ ఏరోజెల్‌గా మార్చామని, ఈ ఏరోజెల్ సాయంతో ఎలక్ట్రోడ్‌లను నిర్మించి పరీక్షించినప్పుడు ఆశ్చర్యకరమైన ఫలితాలు లభించాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త విన్సెంట్ జేమ్స్ తెలిపారు. ఇప్పటికే మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అల్ట్రా కెపాసిటర్ల కంటే పనస, డ్యూరియన్ పండు వ్యర్థాలతో చేసిన అల్ట్రా కెపాసిటర్ల సామర్థ్యం చాలా ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని చెప్పారు. ఈ కొత్త అల్ట్రా కెపాసిటర్లను చాలా చౌకగా తయారు చేసుకోవచ్చు కాబట్టి.. ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను చౌకగా రీఛార్జ్ చేసుకునేందుకు ఇవి బాగా ఉపయోగపడతాయని విన్సెంట్ గోమ్స్ వివరించారు. భూతాపోన్నతి నేపథ్యంలో వాతావరణ మార్పులను అడ్డుకునేందుకు సంప్రదాయేతర ఇంధన వనరులను మరింత సమర్థంగా ఉపయోగించుకునేందుకు ఈ కొత్త అల్ట్రా కెపాసిటర్లు ఎంతో ఉపయోగపడతాయని విన్సెంట్ గోమ్స్ చెప్పారు.



ఆయుష్షును తగ్గించే చక్కెర

చక్కెర ఎక్కువగా తింటే ఒళ్లు పెరిగిపోయి మధుమేహం వస్తుందని మనకు చాలాకాలంగా తెలుసు. అయితే ఈ తెల్లటి విషం మన ఆయుష్షును కూడా తగ్గించేస్తుందని అంటున్నారు యూకేలోని ఎమ్మార్సీ లండన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ శాస్త్రవేత్తలు. అధిక చక్కెరతో మీకు ఊబకాయం రాకున్నా సరే. ఆయుష్షు తగ్గడం మాత్రం గ్యారెంటీ అని వీరు హెచ్చరిస్తున్నారు. సెల్ మెటబాలిజమ్ అనే జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన వ్యాసం ప్రకారం.. చక్కెర ఎక్కువగా తినడం వల్ల శరీరంలో యూరిక్ ఆసిడ్ పేరుకుపోవడం వల్ల జీవితకాలం తక్కువ అవుతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ హెలెనా కోచెమ్ అంటున్నారు. ఈగలకు చక్కెరలు ఎక్కువగా ఉండే ఆహారం ఇచ్చి తాము పరిశీలనలు జరిపామని, మనుషుల మాదిరిగానే వాటికీ చక్కెరతో ఇన్సులిన్ నిరోధకత, ఊబకాయం వంటి సమస్యలు ఎదురయ్యాయని కోచెమ్ తెలిపారు. అయితే ఉప్పు మాదిరిగానే చక్కెర కూడా శరీరంలో నీటి మోతాదును తగ్గించేస్తోందని అందుకే మధుమేహానికి తొలి గుర్తు అధిక దాహమని వివరించారు. ఈగల మూత్ర వ్యవస్థను పరిశీలించినప్పుడు యూరిక్ ఆసిడ్ ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమైందని, ఫలితంగా ఊబకాయం వంటి సమస్యల్లేకున్నా తొందరగా మరణించే అవకాశాలు పెరిగిపోతున్నట్లు తాము గుర్తించామని తెలిపారు. మానవుల్లోనూ చక్కెర ఎక్కువగా తీసుకున్నప్పుడు మూతంరలో ప్యూరిన్లు ఎక్కువగా కనిపిస్తాయని ఇది కాస్తా అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతోందని చెప్పారు.

పరిచయం గురుదేవ్ కౌర్, పారిశ్రామికవేత్త

శ్రమయేవ జయతే

2010లో ఎగ్జిబిషన్ స్టాల్‌లో...

అది పందొమ్మిది వందల తొంబై ఐదవ సంవత్సరం. పంజాబ్‌లోని లూథియానా జిల్లా, పిండ్ గ్రామం. ఆడపిల్ల అంటే... మగవాళ్ల ఎదుట పడకుండా, తల మీది గూంఘట్ సవరించుకుని, తలుపు చాటు నుంచి మాట చెప్పి, అణకువగా ఒదిగి ఉండాలని నిర్దేశించే రోజులు. ఆ రోజుల్లో అమ్మాయి చదువుకోవడమే ఒక విడ్డూరం. అలాంటి ఊరికి ఓ చదువుకున్న అమ్మాయి కోడలిగా వచ్చింది. చదువుకోవడమే విడ్డూరమైతే ఇక ఉద్యోగం, వ్యాపారం చేయడమన్నది మరీ విచిత్రం. ఆ అమ్మాయిని గ్రహాంతర వాసిని చూసినట్లు చూసేవాళ్లు. ఆ చూపులను ఎదుర్కొన్న గురుదేవ్ కౌర్‌ను ఇప్పుడు అదే ఊరి వాళ్లు ఒక సెలబ్రిటీని చూసినట్లు చూస్తున్నారు. పాతికేళ్ల నిరంతర శ్రమ ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా నిలబెట్టింది.

తేనె రుచి

గురుదేవ్ కౌర్ పెళ్లి నాటికి బీఈడీ చేస్తోంది. పెళ్లితో ఆమె చదువు ఆగిపోయింది. అయితే ఆగిపోయింది టీచర్ ట్రైనింగ్ మాత్రమే. తన వంతుగా... మహిళా సమాజాన్ని ఎడ్యుకేట్ చేసే బాధ్యతకు ఎటువంటి ఆటంకం కలగకూడదు అనుకుందామె. అప్పుడామె చెప్పిన మంచి మాటలేవీ ఆ గ్రామ మహిళలకు చెవికెక్కనేలేదు. అలాగని గుర్‌దేవ్ కౌర్ నిరాశపడనూ లేదు. ఈ ప్రయత్నం ఇలా ఉండగానే తనకు ఇష్టమైన తేనెటీగల పెంపకంతో కెరీర్‌ను ప్రారంభించింది. తన ఇంటి వెనుక ఉన్న కొద్ది స్థలంలో ఐదు బాక్సులతో మొదలు పెట్టింది. నాలుగేళ్లకు ఆమె తేనెటీగల పెంపకం 450 బాక్సులకు అభివృద్ధి చెందింది. ఒక్కొక్క బాక్సు నుంచి ఇరవై నుంచి పాతిక కిలోల స్వచ్ఛమైన తేనె ఉత్పత్తి అయ్యేది. మొదట్లో ఆమె సహాయంగా ఉండడానికి కూడా మహిళలు ముందుకు రాలేదు. మగవాళ్లతోనే పని మొదలు పెట్టింది. క్రమంగా ఆమె దగ్గర పని చేయడానికి, పని నేర్చుకోవడానికి మహిళలు ముందుకొచ్చారు. మహిళలకు స్వయం స్వావలంబన అంటే ఏమిటో తెలియచేసింది గురుదేవ్ కౌర్. తేనె రుచితోపాటు సొంతంగా ఒక రూపాయి సంపాదించడంలో ఉండే సంతోషాన్ని కూడా రుచి చూపించింది. అలా ఆమె... పితృస్వామ్య సమాజం మహిళలకు విధించిన కంటికి కనిపించని లక్ష్మణరేఖలను తుడిచేయగలిగింది. ఇప్పుడు పంజాబ్‌లో గుర్‌దేవ్ కౌర్ ఆధ్వర్యంలో 350 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.

నెలకో వంద పొదుపు

గురుదేవ్ కౌర్ తన పరిశ్రమను అభివృద్ధి చేయడం కోసం... పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి ఫుడ్ ప్రాసెసింగ్‌లో మెళకువలు నేర్చుకుంది. ఆ మెళకువలను గ్రామీణ మహిళలకు నేర్పించింది. ఆ మహిళ చేత స్వయం సహాయక బృందాలను రిజిస్టర్ చేయించింది. బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయించి నెలకు వంద రూపాయలు పొదుపు చేసేటట్లు ప్రోత్సహించింది. ఆరు నెలల తర్వాత ఆ మహిళలకు రుణాలివ్వడానికి బ్యాంకులే చొరవ చూపించాయి. ఇప్పుడు వాళ్లు సొంతంగా ఆర్జిస్తున్నారు. సమాజంలో ధీమాగా ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నారు.

విజయం ఊరికే రాలేదు

అయితే... గుర్‌దేవ్ కౌర్ వ్యాపార ప్రయాణం మనం పైన చెప్పుకున్నంత సులువుగా ఏమీ సాగలేదు. మహిళలను చైతన్యవంతం చేయడానికి ఆమె తన గ్రామంలో ఇంటింటి తలుపు తట్టింది. ఆడవాళ్లు ఇంటి బయటకు వచ్చి పని చేయడం తప్పు కాదని నచ్చచెప్పింది. అందరి సహకారంతో తేనె, పచ్చళ్లు, జామ్, మురబ్బా, షర్బత్, ఆర్గానిక్ బెల్లం, అప్పడాలు, మసాలా దినుసుల వంటి మొత్తం 32 ఉత్పత్తులను తయారు చేయగలిగింది. కానీ వాటిని మార్కెట్ చేయడం మాత్రం తయారు చేసినంత సులభంగా జరగలేదు. పెద్ద ఎగ్జిబిషన్‌లలో ఒక టేబుల్ వేసుకుని 'టేబుల్‌టాప్ షాప్'లు పెట్టింది. ఎగ్జిబిషన్‌లు లేని రోజుల్లో రోడ్డు పక్కన టేబుల్ వేసుకుని కొనుగోలుదారుల కోసం ఎదురు చూసింది. 'అప్‌నీ మండీ' పేరుతో తన ఉత్పత్తులను మార్కెట్ చేయడం మొదలు పెట్టింది. తర్వాత 'అప్‌నీ కిసాన్ మండీ' పేరుతో తన వ్యాపారాన్ని విస్తరించింది. పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న ఐదు వందల కుటుంబాలు గుర్‌దేవ్ కౌర్ వ్యాపార సామ్రాజ్యంలో భాగమయ్యాయి. విజయం ఎవరికీ ఊరికే రాదు. దాని వెనుక కఠోరమైన శ్రమ ఉంటుంది. ఇప్పుడు గుర్‌దేవ్ కౌర్ అందుకుంటున్న గౌరవం... పాతికేళ్ల శ్రమ సాధించిన విజయం. ఇప్పుడామె సమావేశాల్లో అదే మాట చెబుతున్నారు. ''ఇప్పుడు నాకు దక్కుతున్న ఈ గౌరవాలను మాత్రమే చూడవద్దు. నేను వేసిన తొలి అడుగును కూడా చూడండి. అనామకంగా వేసిన ముందడుగు అది. నన్ను చూసి స్ఫూర్తి పొందుతామంటే నాకు అంతకంటే సంతోషం మరొకటి ఉండదు. అయితే మీ కెరీర్ ప్రస్థానంలో ఒడిదొడుకులు ఎదురైనప్పుడు నిరుత్సాహపడకండి. రెండు దశాబ్దాల కఠోరశ్రమ తర్వాత మాత్రమే నేను ఈ దశకు చేరుకున్నాననే నిజాన్ని కూడా గుర్తు చేసుకోండి'' అని చెబుతుంటారు గురుదేవ్ కౌర్.

– మంజీర

తేనెటీగల ట్రేతో...

మహిళలకు తేనె రుచి చూపిస్తూ...

ప్రభుత్వం నుంచి పురస్కారం అందుకుంటూ...

బ్యూటీ టిప్స్

కోమలమైన చర్మం

పేరుకుపోయిన దుమ్ము కణాలను శుభ్రపరచకపోతే మృతకణాలు పెరిగి చర్మ మృదుత్వాన్ని, కాంతిమంతాన్ని కోల్పోయే అవకాశం ఉంది. ఈ సమస్యకు విరుగుడుగా...

- బియ్యప్పిండి, పసుపు, పాల మీగడ, నిమ్మ రసం కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని చర్మంపై రాసి, మృదువుగా రబ్ చేయాలి. దీని వల్ల స్వేదరంధ్రాల్లో మృతకణాలు తొలగిపోయి, సహజమైన మాయిశ్చరైజర్‌ని తగినంతగా ఉత్పత్తి చేస్తుంది. చర్మం మృదుత్వం దెబ్బతినదు.
- వాతావరణం మబ్బుగా ఉన్నప్పటికీ తప్పని సరిగా సన్‌స్క్రీన్ లోషన్‌ని రాసుకోవాలి.
- రాత్రిపూట పెదవులకు పాల మీగడ, లేదా కొబ్బరి నూనె వంటివి రాసుకుంటే పగుళ్ల సమస్య బాధించదు.
- సబ్బు అవసరం లేకుండా గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి.
- జాజికాయను పొడిచేసి, అందులో పచ్చి పాలు కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని మొటిమలు, మచ్చలు అయిన చోట రాయాలి. అరగంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.
- ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ చొప్పున ఉల్లి, క్యారెట్ రసం, గుడ్డు సొన, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని యాక్నె, మొటిమలు ఉన్న చోట రాయాలి. అరగంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. యాక్నె, మొటిమలు తగ్గి ముఖం కాంతివంతం అవుతుంది.
- ఆపిల్ ముక్కతో ముఖమంతా మృదువుగా రబ్ చేసి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ముఖంలోని అదనపు జిడ్డు తొలగిపోవడంతో మొటిమలు తగ్గి చర్మం తాజాగా కనిపిస్తుంది.
- జిడ్డు చర్మం గలవారు కీరా రసంలో రోజ్‌వాటర్, నిమ్మరసం కలపాలి. రాత్రి పడుకోబోయేముందు ఈ మిశ్రమాన్ని వేళ్లతో అద్దుకొని ముఖానికి రాసుకోవాలి. మరుసటి రోజు ఉదయాన్నే శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల జిడ్డు తగ్గడమే కాకుండా ముఖం తాజాగా కనిపిస్తుంది.

కరోనా పాటలు

నీ సుఖమే నే కోరుకున్నా నిను వీడి అందుకే వెళుతున్నా...

ఎక్కడ ఉన్నా ఏమైనా
మనం ఎవరికి వారం వేరైనా
నీ సుఖమే నే కోరుకున్నా...

గతంలో ఈ పాట వేదనకు గుర్తు. ఇప్పుడు ఆరోగ్యానికి చిహ్నం. 'కరోనా' కాలంలో, మనిషికి మనిషి ఎడం పాటించాలని చెబుతున్న కాలంలో, 'సామాజిక ఎడం' అవలంబించాలని ప్రచారం చేస్తున్న సమయంలో అది సూచించే తెలుగు సినీ పాటలు సరదాగా తలుచుకోవడం తప్పు కాదు. రోజులు అలా వచ్చి పడ్డాయి. ఎవరైనా సరే దూరంగా ఉండి ఒకరి బాగు ఒకరు కోరుకోవడం ఇప్పుడు తప్పనిసరి. కరోనా మీద అదే అసలైన గురి. *'విరహమో దాహమో విడలేని మోహమో... వినిపించు నా చెలికి మేఘసందేశం... మేఘసందేశం'* అని శానిటైజర్‌తో శుభ్రపరుచుకున్న చేతుల్లో ముఖాన్ని కప్పుకుని మేఘంతో బాధ చెప్పుకోవాలే తప్ప ప్రేయసి ప్రియులు దగ్గరగా వెళ్లడం, దగ్గరగా కూడటం తప్పు అని ఈ సన్నివేశంలో అర్థం చేసుకోవాలి. ఏ పార్కులోనో కలిసినా *'వస్తా.. వెళ్లొస్తా... రేపు సందేశకొస్తా'* అని జారుకోవాలి.

అలిగితివా సఖీ..
అలక మానవా..

శుభ్రత పాటించనప్పుడు ప్రేయసీ ప్రేమికుల్లో, భార్యభర్తల్లో ఒకరిని మరొకరు దూరం ఉండమంటే కొందరు వినకపోవచ్చు. హటం చేయవచ్చు. వారి కోసం దొంగ కోపం చూపించాలి. కిలాడీ అలక ప్రదర్శించాలి. వారు అలకకు జడిసి దూరం నిలబడి పాట పాడుతుంటే వినాలి. *'నేలతో నీడ అన్నది నను తాక రాదని పగటితో రేయి అన్నది నను తాక రాదని'* అని భర్తలు పాడుకోవచ్చు గాక. కాని వైరస్‌లు వ్యాప్తి చెందకుండా అదొక చక్కటి నివారణోపాయం అనుకోవాలి. నీట్‌నెస్ ఫస్ట్ అని వారికి చెప్పగలగాలి. భర్తలు



కూడా ఈ సమయంలో తగ్గకూడదు. ఇంటి శుభ్రతకు, ఒంటి శుభ్రతకు బద్ధకించే భార్యలపై కావాలనే చిరాకు చూపించి కంగు తినిపించాలి. *'నేడు శ్రీవారికి నేనంటే పరాకా... తగని భలే చిరాకా'* అని వారు బిత్తర పోతుంటే ఇదంతా నీ మంచికే అని మనసులో కన్నీళ్లు తుడుచుకోవాలి.

ఎవ్వరి కోసం ఎవరుంటారు
పొండిరా పోండి
నా కాలం ఖర్మం కలిసొస్తేనే
రండిరా రండి..

పిల్లల మీద తల్లిదండ్రులకు ఎనలేని ప్రేమ. కాని ఇటువంటి కాలంలో వారిని దూరంగా పెట్టే ప్రేమ చూపాలి. సురక్షితం కాని ప్రదేశాలలో వారు తిరిగి ఉంటే 'సెల్ఫ్ క్వారంటైన్' అయిపోమ్మని చెప్పాలి. మనం తిరిగి ఉంటే గదిలోకి వెళ్లి తలుపేసుకోవాలి. ఆ కరోనా బురోనా బై చెప్పాక కలవక తప్పదని ఒకరికి మరొకరు చెప్పుకోవాలి.

టాటా... వీడుకోలు.. గుడ్ బై...
ఇంక సెలవు
తొలినాటి స్నేహితులారా...
చెలరేగే కోరికలారా..

ఫ్రెండ్స్ ఎప్పుడూ ఉంటారు. ఫ్రెండ్స్ ఎప్పుడూ ఉండాలి. కాని ఇప్పుడు మాత్రం ఫ్రెండ్స్ దూరంగా ఉండాలి. ఒకరి భుజాల మీద ఒకరు చేయి వేయడం, షేక్ హ్యాండ్స్ ఇవ్వడం, ఒకరి సిగరెట్లు మరొకరు పంచుకోవడం, ఒకరి బైక్ హ్యాండిల్‌ను మరొకరు పట్టుకోవడం ఇప్పుడు అవసరం లేదు. అందుకే వాళ్లను నేరుగా కలవడానికి తాత్కాలికంగా వీడ్కోలు చెప్పాలి.

'ఉందిలే మంచి కాలం ముందు ముందునా...
అందరూ సుఖపడాలి నందనందానా' అని రాబోయే మంచి కోసం ఎదురు చూడాలి.

ఇక పిల్లలు గడుగ్గాయిలు. వారు ఇంటి పట్టున ఉండమంటే వినరు. ఆడటానికి వెళతారు. పాడుకోవడానికి వెళతారు. గంతులు వేస్తారు. ఈ వేసవి కాలం వారికి ఆటవిడుపు. కాని ఇది మాయదారి కరోనా కాలం అయిపోయింది. అందుకే వారికి బుద్ధి చెప్పాలి. బాగు చెప్పాలి. నలుగురినీ కలవడం తప్పు అని చెప్పాలి.

విను నా మాట విన్నావంటే
జీవితమంతా పువ్వుల బాటా...

అని చెప్తే వారు వినకుండా పోరు.

అయితే ఇది సంఘం మొత్తం చైతన్యవంతం కావాల్సిన సమయం. అందరూ కలిసి ఆపత్కాలాన్ని దాటాల్సిన సమయం. వారికి పిలుపునివ్వాలి. *'తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా'* అని కరోనా వంటి విష క్రిమి వ్యాప్తి చెందకుండా ఎంతటి దీక్ష వహించాలో చెప్పాలి. 'ఎవడు వాడు ఎచటి వాడు ఇటు వచ్చిన కరోనావాడు' అని గర్జించేలా చేయాలి.

అలాగే ఇది మనందరికి కష్టకాలం. పరీక్షా కాలం. దానిని దాటాలంటే ఇప్పుడు గొప్ప క్రమశిక్షణ కావాలి. బాధ్యత ఉండాలి. దాంతోపాటు నిరాశలో కూరుకుపోకుండా ఆశ కూడా ఉండాలి. ఆ ఆశను నింపే పాట పాడుకుంటూ ఉండాలి.

గోరంత దీపం కొండంత వెలుగు
చివురంత ఆశ బతుకంత వెలుగు

– సాక్షి ఫ్యామిలీ

ఫ్యామిలీ డాక్టర్ — హెయిర్ కౌన్సెలింగ్స్

జుట్టు రాలుతోంది... ఆపేదెలా?

నా వయసు 26 ఏళ్లు. నాకు విపరీతంగా జుట్టు రాలిపోతోంది. రోజూ తలదువ్వుకునేప్పుడు పోగులు పోగులుగా దువ్వెనలోకి జుట్టు వస్తోంటే చాలా ఆందోళనగా ఉంటోంది. జుట్టు రాలకుండా ఉండేందుకు దయచేసి ఏవైనా మార్గాలుంటే చెప్పండి. అలాగే రాలిపోయిన జుట్టు మళ్లీ పెరిగి, తలకట్టు ఒత్తుగా చేసుకునేందుకు మార్గాలు / చికిత్సలు ఉంటే వివరించండి.

- సుష్మా, సికింద్రాబాద్

ప్రతిరోజూ కొన్ని జుట్టు స్ట్రాండ్స్ రాలిపోవడం చాలా సహజమైన (నేచురల్) విషయమే. జుట్టు జీవితచక్రంలో... అది ఒక దశ వరకు పెరగడం, ఆ తర్వాత రాలిపోవడం, అటుపై జుట్టు అంకురం కొంతకాలం విశ్రాంతి తీసుకొని, మళ్లీ అందులోంచి కొత్త వెంట్రుక (స్ట్రాండ్) పెరగడం అన్నది నిరంతరం జరిగే ప్రక్రియ. మనందరిలోనూ అంటే ఆరోగ్యకరమైన మనిషి విషయంలోనూ ప్రతిరోజూ 60 – 100 వెంట్రుకలు (స్ట్రాండ్స్) రాలిపోతూ ఉంటాయి. ఇవన్నీ మళ్లీ వస్తూ ఉంటాయి కూడా. అయితే దాని కంటే ఎక్కువగా రాలిపోతూ... రాలేవాటి కంటే పెరిగేవి తగ్గుతూ పోతుంటే మాత్రం కాస్తంత ఆలోచించాల్సిందే.

జుట్టు రాలేందుకు కారణాలు...

- చాలా తీవ్రమైన శారీరక/మానసిక ఒత్తిడులు ఉన్నా లేదా తీవ్రంగా జబ్బు పడ్డా కొందరిలో అది జుట్టు రాలిపోయేందుకు దారితీస్తుంది. ఇలా జుట్టు రాలడాన్ని 'టిలోజెన్ ఎఫ్లూవియమ్' అంటారు. కానీ ఇలా రాలిన జుట్టు సాధారణంగా ఒత్తిడి తొలిగాక మళ్లీ మొలుస్తుంది.
- మహిళల్లో ప్రసవం తర్వాత తలపై జుట్టు రాలి ఎక్కువగా పలచబారిపోతుంది. దీనికి వారు అనుభవించే శారీరక ఒత్తిడి కూడా ఒక కారణం. పైగా జుట్టుకు అందాల్సిన పోషకాలు అందకుండా పోవడం ఓ కారణం.
- సమతుల పోషకాహారం తీసుకోకపోవడం వల్ల కూడా కొందరిలో జుట్టు రాలుతుంది.
- ఇంకొందరిలో హార్మోన్ల లోపం జుట్టు రాలడానికి కారణమవుతుంది. సాధారణంగా హార్మోన్ లోపాల సమస్య మహిలల్లో ఎక్కువ. మహిళల్లోనూ కొద్దిపాటి పురుష హార్మోన్ అయిన టెస్టోస్టెరాన్ స్రవిస్తుంటుంది. పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్) ఉన్నవారిలో టెస్టోస్టెరాన్ స్రావం ఎక్కువ. దీంతో జుట్టు రాలుతుంది. ఇక హైపోథైరాయిడిజమ్ కండిషన్ కూడా జుట్టు రాలడానికి దోహదం చేస్తుంది. ఒక్కోసారి ఆటోఇమ్యూన్ జబ్బుల వల్ల జుటు రాలుతుంది. మన రోగనిరోధకశక్తే మనకు ప్రతికూలంగా పనిచేయడం వల్ల వచ్చే జబ్బులను ఆటోఇమ్యూన్‌గా పేర్కొంటుంటారు. ఉదాహరణకు... ● పేనుకొరుకుడు (అలోపేషియా ఏరేటా) వల్ల మన మాడు, కనుబొమలు, మీసం, గడ్డం, శరీరంలో ఏభాగంలోనైనా వెంట్రుకలన్నీ రాలిపోయి ప్యాచ్‌లుగా కనిపిస్తుంటాయి ● లైకెన్ ప్లానస్ అనే ఆటోఇమ్యూన్ కండిషన్ వల్ల జుట్టు ఊడిపోయే అవకాశం ఉంది ● లూపస్ అనే మరో ఆటో ఇమ్యూన్ కండిషన్ వల్ల కూడా జుట్టు రాలిపోవచ్చు. ఇంకొందరిలో రకరకాల రుగ్మతలకు మందులు వాడుతున్నప్పుడు వాటి దుష్ప్రభావం వల్ల జుట్టు రాలడం మామూలే.
- రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్, వాహనాల నుంచి విపరీతంగా వెలువడుతున్న కాలుష్యాల కారణంగా వెంట్రుకలపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

జుట్టు రాలడాన్ని నివారించడం ఎలా?

జుట్టు రాలడం అన్నది ఏ కారణాల వల్ల జరుగుతోందో తెలుసుకుని, వాటికి దూరంగా ఉండటం వల్ల ఈ సమస్య చాలావరకు తగ్గుతుంది. అలాగే ఏదైనా జబ్బు కారణంగా ఇలా జరుగుతుంటే... ఆ జబ్బును నయం చేసుకుంటే (అండర్‌లైయింగ్ కారణానికి చికిత్స తీసుకుంటే) జుట్టు రాలడం తగ్గుతుంది. వీటన్నింటినీ గుర్తించి త్వరగా మందులు వాడితే రాలిన జుట్టు మళ్లీ వచ్చే అవకాశాలు ఎక్కువ.

కొందరు మహిళల్లోనూ బట్టతల

మహిళలకు బట్టతల రాదని కొందరు అనుకుంటారు. కానీ అరుదుగా మహిళల్లోనూ బట్టతల వస్తుంది. దీన్ని 'ప్యాటర్న్ హెయిర్‌లాస్' అంటారు. ఇలాంటి మహిళల్లో క్రమంగా వారి పాపిట మెల్లమెల్లగా వెడల్పుగా అవుతుండటం కనిపిస్తుంది. దీంతో మహిళల్లోని బట్టతల వచ్చే అవకాశాలను గుర్తించవచ్చు. ఇలాంటివారు వైద్యులను కలిస్తే బట్టతలను చాలావరకు నివారించవచ్చు. ఇక మిగతా వారు తమ జుట్టు రాలే సమస్యల కోసం కింద పేర్కొన్న జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ అలా తీసుకున్న తర్వాత కూడా జుట్టు ఇంకా రాలుతుంటే అప్పుడు మాత్రం వైద్యులను తప్పనిసరిగా సంప్రదించాలి.

వెంట్రుకలను కాపాడుకునే పద్ధతులు

- వెంట్రుకలకు మంచి పోషకాలు అందేలా యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్న పదార్థాలు అంటే ఆకుపచ్చని కూరలు (గ్రీన్ లీఫీ వెజిటబుల్స్), తాజా పళ్లు, విటమిన్ ఏ, సీ, ఈ ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఐరన్, జింక్ పాళ్లు పుష్కలంగా ఉండే ఆహార పదర్థాలు, తాజా పండ్లు తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వెంట్రుకలను షాంపూతో శుభ్రం చేసుకోవాలి. అయితే మరీ ఎక్కువగా వెంట్రుకలను కడగటం కూడా అంత మంచిది కాదని గుర్తుంచుకోవాలి. దీనివల్ల వెంట్రుకలు పొడిబారవచ్చు. సాధారణంగా వారంలో రెండుసార్లు తలస్నానం చేయడం మంచిది. (ఐడియల్.)
- అలర్జెన్స్, కాలుష్యాలు నేరుగా వెంట్రుకలు తాకకుండా స్కార్ఫ్ కట్టుకోవడం, హాట్ పెట్టుకోవడం చేయాలి.
- ఒకసారి వైద్య నిపుణులను సంప్రదించి, హార్మోన్ లోపాల వల్ల ఈ సమస్య వచ్చిందా అన్నది తెలుసుకోవాలి. అలాంటప్పుడు ఆ సమస్యను చక్కదిద్దగానే జుట్టు రాలడం ఆగిపోతుంది.



డాక్టర్ స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్వర్థయా వర్ధతే విద్య
సోమవారం 23-3-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థుల మొదటి లక్ష్యం మెడిసిన్ (ఎంబీబీఎస్) లో చేరడం..! అందుబాటులో ఉన్న సీట్లు, పోటీ పడుతున్న విద్యార్థులను పరిగణనలోకి తీసుకుంటే.. చాలా తక్కువ శాతం మందికి మాత్రమే ఎంబీబీఎస్‌లో ప్రవేశం లభిస్తోంది. ఇలాంటి పరిస్థితిలో బైపీసీ విద్యార్థులకు ఎంబీబీఎస్‌కు ప్రత్యామ్నాయంగా బ్యాచిలర్ స్థాయిలో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటిద్వారా చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకునే వీలుంది. బీహెచ్ఎంఎస్ నుంచి బీఎస్సీ(బీజెడ్‌సీ) వరకూ... అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం...

ఆఫ్టర్ ఇంటర్

బైపీసీ.. ఎంబీబీఎస్‌కు దీటైనవెన్నో..

బీపీఎంఎస్

మెడికల్ రంగంలో స్థిరపడాలనుకునే బైపీసీ విద్యార్థులకు మరో ప్రత్యామ్నాయం.. బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీఏఎంఎస్). ఈ కోర్సులో ఎంబీబీఎస్ మాదిరిగానే అనాటమీ, ఫిజియాలజీ, పెడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర సబ్జెక్టులు ఉంటాయి. ఉన్నత విద్య పరంగా ఎండీ ఆయుర్వేద, ఎంఎస్ ఆయుర్వేద కోర్సుల్లో చేరొచ్చు. అంతేకాకుండా ఎంబీబీఎస్‌లోని జనరల్ మెడిసిన్‌కు సరితూగే విధంగా కాయ చికిత్స కోర్సు.. జనరల్ సర్జరీకి సరితూగే శల్యతంత్ర కోర్సు పీజీ స్పెషలైజేషన్లుగా ఉండటం విశేషం.

యునానీ(బీయూఎంఎస్)

ఇటీవల కాలంలో ఆదరణ పెరుగుతున్న మరో వైద్య సంబంధ కోర్సు.. బీయూఎంఎస్(బ్యాచిలర్ ఆఫ్ యునానీ మెడికల్ సైన్స్). దీన్ని పూర్తిగా ప్రకృతి వైద్యంగా పేర్కొనొచ్చు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది. బీయూఎంఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు పీజీ స్థాయిలో గైనకాలజీ, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, జనరల్ మెడిసిన్, ఫార్మకాలజీలకు సరితూగే ఎండీ,ఎంఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

బీహెచ్ఎంఎస్

బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్).. గత కొన్నేళ్లుగా కార్పొరేట్‌రూపు సంతరించుకుంటోంది. ఈ కోర్సులోనూ ఎంబీబీఎస్ కరిక్యులంలో ఉండే అనాటమీ, ఫిజి

యాలజీలను బోధిస్తారు. దీన్ని పూర్తిచేసిన వారు ఉన్నత విద్య పరంగా మెటీరియా మెడికా, హోమియోపతిక్ ఫిలాసఫీ తదితర డిమాండింగ్ స్పెషలైజేషన్లలో చేరొచ్చు. బీహెచ్ఎంఎస్ అభ్యర్థులకు భవిష్యత్తులో కెరీర్ పరంగా ఎలాంటి ఢోకా ఉండదనే చెప్పొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్, కేఎన్‌ఆర్‌యూహెచ్ఎస్‌ల పరిధిలో పలు కళాశాలల్లో బీహెచ్ఎంఎస్ కోర్సు అందుబాటులో ఉంది.

బీఎన్‌వైఎస్

బైపీసీ విద్యార్థులకు వైద్య రంగంలోప్రత్యామ్నాయంగా నిలుస్తున్న మరో కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతిక్ యోగిక్ సైన్సెస్(బీఎన్‌వైఎస్). ఈ కోర్సును పూర్తి చేసిన వారికి యోగా, సిద్ధ యోగా తదితర విధానాల ద్వారా రోగులకు చికిత్స చేయగలిగే నైపుణ్యాలు లభిస్తాయి. ఈ కోర్సు తెలంగాణలో ఒక కళాశాలలో, ఏపీలో ఒక కళాశాలలో అందుబాటులో ఉంది.

సీట్ల భర్తీ

ఆయుష్ (ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, నేచురోపతి అండ్ యోగా, సిద్ధ మెడిసిన్) కోర్సుల ఔత్సాహిక విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్- యూజీ(అండర్ గ్రాడ్యుయేషన్) పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. నీట్ స్కోర్ ఆధారంగా ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తారు. ఇందుకోసం ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత ప్రత్యేక నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. తెలంగాణలో కేఎన్‌ఆర్‌యూహెచ్ఎస్, ఏపీలో ఎన్‌టీఆర్ యూహెచ్ఎస్‌లు కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతాయి.

✦ **వెబ్‌సైట్స్: ntruhs.ap.in, knruhs.telangana.gov.in**

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ

వైద్య రంగంలో స్థిరపడాలనుకునే వారికి అందుబాటులో ఉన్న మరో చక్కటి ప్రత్యామ్నాయ కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ. నాలుగున్నరేళ్ల వ్యవధిలో ఉండే ఈ కోర్సును పూర్తి చేస్తే ఫిజియోథెరపిస్ట్‌లుగా రాణించొచ్చు. స్వయం ఉపాధి అవకాశాలు కూడా సొంతం చేసుకోవచ్చు. ఆర్థోపెడిక్ సర్జరీలు జరిగిన వారికి ఫిజియోథెరపీ తప్పనిసరిగా మారుతోంది. కాబట్టి ఫిజియోథెరపీ కోర్సు చేసిన వారికి ఉపాధి పరంగా ఎలాంటి ఢోకా లేదని చెప్పొచ్చు.

పారా మెడికల్ కోర్సులు

బైపీసీ విద్యార్థులకు సత్వర ఉపాధి అందించేవి.. పారా మెడికల్ కోర్సులు. వీటిలో బీఎస్సీ(నర్సింగ్),న్యూరోఫిజియాలజీ టెక్నాలజీ, ఆప్టోమెట్రిక్ టెక్నాలజీ, రెనాల్ డయాలసిస్ టెక్నాలజీ, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ, కార్డియాక్ కేర్ టెక్నాలజీ అండ్ కార్డియో వ్యాస్కులర్ టెక్నాలజీ, అనెస్థీషియాలజీ టెక్నాలజీ అండ్ ఆపరేషన్ థియేటర్ డిగ్రీ, ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సులు ముఖ్యమైనవి. వీటిని పూర్తిచేయడం ద్వారా హాస్పిటల్స్‌లో వివిధ విభాగాల్లో టెక్నీషియన్స్‌గా స్థిరపడొచ్చు. హెల్త్ యూనివర్సిటీలు ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి పారామెడికల్ కోర్సులను భర్తీచేస్తాయి.

బీవీఎస్‌సీ

డాక్టర్ హోదాతోపాటు కెరీర్ పరంగా ఉన్నత స్థానాలు అందుకునేందుకు బైపీసీ విద్యార్థుల ముందున్న మరో ప్రత్యేక ప్రత్యామ్నాయ కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎస్‌సీ). జంతువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, పశువుల గర్భధారణ పద్ధతులు తదితర అంశాల్లో నైపుణ్యం అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేస్తే పౌల్ట్రీ ఫారాలు, ప్రభుత్వ, ప్రైవేటు పశు వైద్య ఆస్పత్రులు, పశుసంవర్ధక శాలలు, వన్య మృగ సంరక్షణ కేంద్రాలు, జంతు ప్రదర్శన శాలలు, డెయిరీ ఫామ్స్, గొర్రెల పెంపకకేంద్రాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

✦ **వెబ్‌సైట్స్: www.tsvu.nic.in, www.SVVU.edu.in**

అగ్రికల్చర్ బీఎస్సీ

ఇది వ్యవసాయ సాగు విధానాల్లో ఆధునిక

పద్ధతులు, నూతన పరికరాల వినియోగం తదితర నైపుణ్యాలను అందించే కోర్సు. దీన్ని పూర్తి చేసిన వారికి ప్రైవేటు రంగంలో విత్తన ఉత్పాదక సంస్థలు, పౌల్ట్రీ ఫామ్స్‌లో అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ రంగంలో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి. బ్యాంకుల్లో సైతం రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్ల విభాగంలో కొలువులు అందిపుచ్చుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఆచార్య ఎన్‌జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ (ఏపీ), ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ(తెలంగాణ) పరిధిలో పలు కళాశాలల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

✦ **వివరాలకు వెబ్‌సైట్: www.angrau.ac.in, pjtsau.ac.in**

హార్టికల్చర్ సైన్స్

పర్యావరణంపై ఆసక్తి కలిగిన వారికి సరితూగే కోర్సు.. బీఎస్సీ హార్టికల్చర్ సైన్స్. ఈ కోర్సును పూర్తి చేసుకున్న వారికి స్టేట్ హార్టికల్చర్ మిషన్, నాబార్డ్ సహా పలు బ్యాంకుల్లో అవకాశాలు లభిస్తాయి. అదేవిధంగా ప్రైవేట్ డ్రిప్ ఇరిగేషన్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల్లో హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లకు కొలువులు దక్కుతాయి. ఉన్నత విద్య పరంగా పీజీ స్థాయిలో ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్, ప్లాంటేషన్ అండ్ స్పైస్ క్రాప్ ప్రత్యేక అంశాలుగా ఎమ్మెస్సీ చదివేందుకు అవకాశం ఉంటుంది. తెలంగాణలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ స్టేట్ హార్టికల్చర్ యూనివర్సిటీ, ఏపీలో డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

✦ **వివరాలకు వెబ్‌సైట్: www.drysrhu.edu.in, skltshu.ac.in**

బీఎఫ్ఎస్‌సీ

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ సంక్షిప్తంగా.. బీఎఫ్ఎస్‌సీ. ఇది చేపల పెంపకం, సేకరణకు సంబంధించి ప్రత్యేక పద్ధతులు అనుసరించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సు. దీన్ని పూర్తి చేసిన వారికి ఆక్వాకల్చర్ సంస్థలు, ఆక్వా రీసెర్చ్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలు. తెలంగాణలో పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, ఏపీలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

✦ **వెబ్‌సైట్: www.svvu.edu.in, tsvu.nic.in**

బీటెక్ - ఫుడ్ టెక్నాలజీ

ప్రస్తుత ఆధునిక పరిస్థితుల్లో బైపీసీ విద్యార్థులకు కెరీర్ పరంగా బెస్ట్‌గా నిలుస్తున్న మరో కోర్సు.. బీటెక్-ఫుడ్ టెక్నాలజీ. ఇది ఆహార ఉత్పత్తుల తయారీ, నాణ్యత, ప్రాసెసింగ్ సంబంధిత నైపుణ్యాలు అందించే కోర్సు. దీన్ని పూర్తి చేయడం ద్వారా ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు.

బీఎస్సీ(సీపబీఎం)

బీఎస్సీ(సీఏబీఎం).. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్. బైపీసీ విద్యార్థులకు కార్పొరేట్ కొలువులకు మార్గం వేసే కోర్సు ఇది. ఈ కోర్సు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అన్వయించడం, వాటి ద్వారా లాభదాయకత పెరిగేలా చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తుంది. దీన్ని పూర్తిచేసిన వారికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, క్రాప్ పొడక్షన్ కంపెనీల్లో మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

బీఎస్సీ అగ్రి-బయోటెక్

ప్రస్తుత ఆధునిక పరిస్థితుల్లో అందుబాటులోకి వచ్చిన మరో కోర్సు.. బీఎస్సీ అగ్రికల్చర్ బయోటెక్నాలజీ. అగ్రి బయోటెక్‌గా పిలిచే ఈ కోర్సు ద్వారా టిష్యూ కల్చర్, జెనెటిక్ ఇంజనీరింగ్, మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్ తదితర అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలు.

బీఎస్సీ-న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సైన్స్

బైపీసీ విద్యార్థులకు కెరీర్ పరంగా మంచి అవకాశాలను అందిస్తున్న మరో కోర్సు.. బీఎస్సీ న్యూట్రిషన్ అండ్ ఫుడ్‌సైన్స్. ఆహార పదార్థాల నాణ్యత తోపాటు ఎక్కువ కాలం మన్నే విధంగా ప్రాసెసింగ్ నైపుణ్యాలను అందించే ఈ కోర్సును పూర్తి చేసిన వారికి ప్యాకేజ్డ్ ఫుడ్ ఇండస్ట్రీస్, రీసెర్చ్ ల్యాబ్స్‌లో అవకాశాలు లభిస్తాయి. అదే విధంగా కార్పొరేట్ హాస్పిటల్స్‌లో, హోటల్స్‌లో డైటీషియన్స్‌గా ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

బీఎస్సీ (బీజెడ్‌సీ)

బైపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న బ్యాచిలర్ డిగ్రీ కోర్సు... బీఎస్సీ(బీజెడ్‌సీ). ప్రస్తుతం ఈ కోర్సులోనూ వినూత్న స్పెషలైజేషన్స్ అందుబాటులోకి వస్తున్నాయి. బయో టెక్నాలజీ, మైక్రోబయాలజీ తదితర కాంబినేషన్లతో బీజెడ్‌సీ గ్రూప్‌ను పలు యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

సీట్ల భర్తీ ఇలా..

వ్యవసాయ సంబంధ కోర్సులను తెలుగు రాష్ట్రాల్లోని వ్యవసాయ యూనివర్సిటీలు నిర్వహిస్తున్నాయి. ఎంసెట్(అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంకు ఆధారంగా ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి సీట్ల భర్తీ చేస్తాయి. సాధారణంగా ఈ ప్రక్రియ జూలై చివరి వారంలో ఉంటుంది.

ముఖ్యాంశాలు

- ✦ ఆయుష్ కోర్సుల్లో సీట్ల భర్తీ – నీట్ స్కోర్ ఆధారంగా ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా జరుగుతుంది.
- ✦ పారామెడికల్ కోర్సుల్లోని సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఏపీలో 2019 నుంచి ఎంసెట్ (ఏ అండ్ ఎం స్ట్రీమ్) ర్యాంకు ఆధారంగా పారా మెడికల్ సీట్ల భర్తీ జరుగుతోంది.
- ✦ వెటర్నరీ సీట్లకు సంబంధిత యూనివర్సిటీలు ప్రత్యేక నోటిఫికేషన్ ఇస్తారు.
- ✦ వ్యవసాయ సంబంధిత కోర్సులకు అగ్రికల్చర్ యూనివర్సిటీల ఆధ్వర్యంలో ఎంసెట్ (ఏ అండ్ ఎం స్ట్రీమ్) ఆధారంగా ప్రత్యేక కౌన్సెలింగ్ ఉంటుంది.
- ✦ ఆయుష్ మినహా అన్ని కోర్సులకు ఎంసెట్(ఏ అండ్ ఎం స్ట్రీమ్)లో ర్యాంకు తప్పనిసరి.

ఉద్యోగ సమాచారం

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌లో 200 ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

ముంబయిలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్).. 200 ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- » **పోస్టు పేరు:** ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ
- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 200
- » **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్)/ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణత,2018/2019/2020 వ్యాలిడ్ గేట్ స్కోర్.
- » **వయసు:** 26 ఏళ్లకు మించరాదు.
- » **ఎంపిక విధానం:** వ్యాలిడ్ గేట్ స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 24.03.2020
దరఖాస్తులకు చివరి తేది: 02.04.2020

» **వెబ్‌సైట్: www.npcilcareers.co.in**

టెట్/డీఎస్సీ
- స్టడీ మెటీరియల్
- బిట్‌బ్యాంక్ ▸ జీకే
- ఆన్‌లైన్ టెస్టులు
- మోడల్ పేపర్స్
- కరెంట్ అఫైర్స్
- ప్రీవియస్ పేపర్స్

వీడియో గైడెన్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
SOCIAL STUDIES

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ 2020

సోషల్ సైన్సెస్

- » సీఎస్ఐఆర్ నెట్ ద్వారా పెద్ద సంఖ్యలో జేఆర్ఎఫ్‌లు
- » నెలకు రూ.31వేల ఫెలోషిప్ అందుకునే అవకాశం
- » నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్‌టీఏ
- » దరఖాస్తులకు చివరి తేది: 15.04.2020

దేశ శాస్త్ర, సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దే దిశగా 'కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) పరిశోధనలను ప్రోత్సహిస్తోంది. అందుకోసం సీఎస్ఐఆర్-యూజీసీ నెట్' ద్వారా అవకాశం కల్పిస్తోంది. ఏటా రెండుసార్లు నిర్వహించే ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ చూపిన అభ్యర్థులు జేఆర్ఎఫ్‌తోపాటు లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసేందుకు కూడా అర్హత లభిస్తుంది. 2020 జూన్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఇటీవల విడుదల చేసింది. ఈ నేపథ్యంలో... సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానంపై ప్రత్యేక కథనం...

సబ్జెక్టులు

» కెమికల్ సైన్సెస్ » ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్, ప్లానెటరీ సైన్సెస్ » లైఫ్ సైన్సెస్ » మ్యాథమెటికల్ సైన్సెస్ » ఫిజికల్ సైన్సెస్.

సీఎస్ఐఆర్ నెట్‌తో ప్రయోజనాలు

- **ఫెలోషిప్:** సీఎస్ఐఆర్ ఏటా పెద్ద సంఖ్యలో జేఆర్ఎఫ్‌లు అందిస్తోంది. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపి ఎంపికైన అభ్యర్థులు దేశంలోని ప్రముఖ లేబొరేటరీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో పరిశోధనలకు ఫెలోషిప్‌లను అందుకోవచ్చు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)కు ఎంపికైన వారికి నెలకు రూ.31000 చొప్పున రెండేళ్లపాటు ఫెలోషిప్ లభిస్తుంది. దీంతోపాటు మరో రూ. 20000 వార్షిక కంటింజెంట్ గ్రాంట్‌గా అందిస్తారు. జేఆర్ఎఫ్‌గా రెండేళ్లు పూర్తయ్యాక.. పీహెచ్‌డీ కోసం రిజిస్టర్ చేసుకుంటే.. మూడో ఏడాది నుంచి 'సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(ఎస్ఆర్ఎఫ్)' అందుతుంది. ఎస్ఆర్ఎఫ్‌లకు ప్రతినెలా రూ.35,000 ఫెలోషిప్ లభించడంతోపాటు ఇతర అలవెన్సులు అందుతాయి.
- **అసిస్టెంట్ ప్రొఫెసర్:** జాతీయ స్థాయిలో జరిగే జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ద్వారా దేశంలోని యూనివర్సిటీలు, కళాశాలల్లో లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత సాధించవచ్చు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) కు ఎంపికైన అభ్యర్థులు దేశంలోని యూనివర్సిటీల్లో, కాలేజీల్లో లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసేందుకు కూడా అర్హులే.

అర్హతలు

- సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినవారితో పాటు బీటెక్/బీఈ/ బీఫార్మసీ/ఎంబీబీఎస్/ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్/ఎమ్మెస్సీ/బీఎస్సీ హానర్స్ తత్సమాన అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులకు 55 శాతం, ఇతరులకు 50 మార్కులు తప్పనిసరి.
- జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు దరఖాస్తు చేసుకునేవారు 01 జనవరి 2020 నాటికి జనరల్ అభ్యర్థుల వయసు 28ఏళ్లు దాటరాదు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ మహిళలకు ఐదేళ్లు, ఓబీసీ-నాన్ క్రిమిలేయర్ అభ్యర్థులకు మూడేళ్ల వయో సడలింపు ఉంది.
- లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం ఇదీ

- సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షలు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు.
- సీఎస్ఐఆర్-నెట్ పరీక్ష కెమికల్ సైన్సెస్, ఎర్త్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ విభాగాలలో ఎంచుకున్న సబ్జెక్టుపైనే సింగిల్ పేపర్‌గా ఉంటుంది. పరీక్ష సమయం 3గంటలు. మొత్తం మూడు విభాగాలలో(పార్ట్-ఎ, బి, సి) 200 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఇస్తారు.
- **పార్ట్-ఎ(30 మార్కులు):** ఇది అన్ని సబ్జెక్టులకు ఒకే విధంగా ఉంటుంది. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్(లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్) నుంచి 20 ప్రశ్నలు వస్తాయి. అభ్యర్థి 15 ప్రశ్నలకు సమాధానం గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు కేటాయించారు.
- **పార్ట్-బి(70 మార్కులు):** ఇందులో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుకు సంబంధించి 25 నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. వీటిల్లో నుంచి ఆయా సబ్జెక్టును బట్టి 20 నుంచి 35 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది.
- **పార్ట్-సి(100 మార్కులు):** ఈ విభాగంలో ఇచ్చిన ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇందులో అభ్యర్థి సైంటిఫిక్ పరిజ్ఞానాన్ని, సైన్స్ అప్లికేషన్స్‌ను పరీక్షిస్తారు. ఈ విభాగంలో మార్కులకు అధిక వెయిటేజీ ఉంటుంది.
- అన్ని విభాగాలలోను తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కుల విధానం అమల్లో ఉంది.

దరఖాస్తు చేయడం ఎలా

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జూన్-2020 కోసం ఒక అభ్యర్థి ఒక సబ్జెక్టుకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'ఆన్‌లైన్'లో ఎన్‌టీఏ వెబ్‌సైట్ **csirnet.nta.nic.in** ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థి ఫోన్ నంబర్, ఈమెయిల్‌తో సహా అన్ని వివరాలు నమోదు చేయాలి.

దరఖాస్తు ఫీజు

- **జనరల్ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** రూ.1000 » ఓబీసీ-నాన్ క్రిమిలేయర్: రూ.500 » ఎస్సీ/ఎస్టీ/: రూ.250 » దివ్యాంగులకు ఫీజు లేదు.

ముఖ్యమైన తేదీలు

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తులకు చివరి తేది:** 15 ఏప్రిల్ 2020
- **హాల్‌టికెట్ల జారీ:** మే 15 నుంచి
- **పరీక్ష తేది:** జూన్ 21
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** www.nta.ac.in, csirnet.nta.nic.in

కెరీర్ కౌన్సెలింగ్ Q A

» నేను త్వరలో ఎంపీసీ పూర్తి చేసుకోబోతున్నాను. ఎంసెట్‌కు సిద్ధమవుతున్నాను. నచ్చిన బ్రాంచ్, కాలేజీలో ఇంజనీరింగ్ సీటు రాకుంటే.. డిగ్రీలో చేరాలనుకుంటున్నాను. బీటెక్, బ్యాచిలర్ డిగ్రీ ఈ రెండిటిలో ఏది బెస్ట్? మంచి భవిష్యత్తు కల్పించే కోర్సు ఏదో సూచించగలరు? – రమేశ్

✦ ప్రస్తుతం బీటెక్, బ్యాచిలర్ డిగ్రీలో ఏది బెస్ట్ అంటే.. జాబ్ మార్కెట్ కోణంలో బీటెక్‌కే తొలి ప్రాధాన్యం అని చెప్పొచ్చు. బీటెక్‌లో మీరు ఎంపిక చేసుకునే బ్రాంచ్ కూడా కెరీర్ పరంగా కీలకం. తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. బీటెక్‌లో సీఎస్ఈ, ఈసీఈ బ్రాంచ్‌ల విద్యార్థులకు జాబ్ మార్కెట్‌లో కొంత ప్రాధాన్యం ఉంటోంది. ఈ బ్రాంచ్‌ల విద్యార్థులు అకడమిక్స్‌కే పరిమితం కాకుండా.. తాజా ట్రెండ్స్‌కు అనుగుణంగా నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. బీటెక్ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, రోబోటిక్స్, 3-డి డిజైన్ ప్రింటింగ్ తదితర అంశాలపై అవగాహన పొందాలి. ఇలాంటి నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. బీటెక్‌లో ఏ బ్రాంచ్‌లో చేరినా ఉద్యోగం పొందడం సులభమే. ఈ విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరాలనుకుంటే.. సీఎస్ఈ లేదా ఈసీఈ బ్రాంచ్‌లను ఎంపిక చేసుకొని.. ఏఐ, ఎంఎల్, ఐఓటీ నైపుణ్యాలు సొంతం చేసుకుంటే కోర్సు పూర్తి చేసుకునే సమయానికి చక్కటి అవకాశాలు లభిస్తాయి.

✦ బ్యాచిలర్ డిగ్రీ పరంగా ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మార్గం.. బీఎస్సీ. ప్రస్తుతం బీఎస్సీలోనూ వినూత్న కాంబినేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ వంటి జాబ్ ఓరియెంటెడ్ సబ్జెక్టులు బోధిస్తున్నారు. వీటిని పూర్తి చేసి.. ఆ తర్వాత పీజీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ పూర్తి చేస్తే జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలవొచ్చు. ప్రస్తుత జాబ్ మార్కెట్ పరిస్థితులు, ఇండస్ట్రీ అవసరాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఏ కోర్సు బెస్ట్ అనేది ఎప్పటికప్పుడు మారుతోంది. సంప్రదాయ బీఎస్సీ కోర్సుపై ఆసక్తి ఉంటే ఫిజిక్స్ లేదా కెమిస్ట్రీపై పట్టు సాధించి.. ఆ తర్వాత పీజీ పూర్తి చేయండి. వాటి ఆధారంగా జియాలజీ, మైనింగ్, రీసెర్చ్ ల్యాబ్స

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
23-3-2020

క్వారంటైన్లుగా 'సాయ్' సెంటర్లు: కేంద్ర క్రీడా శాఖ

కోవిడ్-19 ఎఫెక్ట్‌కు ఇదివరకే భారత్‌లో క్రీడాకార్యకలాపాలన్నీ మూతపడ్డాయి. ఒక్క శిబిరం లేదు. పోటీల్లేవు. దీంతో భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కేంద్రాలకు తాళాలు వేశారు. ఇప్పుడీ కేంద్రాలను కరోనా అనుమానిత, బాధిత కేసులకు క్వారంటైన్లుగా (నిర్బంధ వసతులు) వినియోగించుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 'సాయ్' రీజినల్ సెంటర్లు, స్టేడియాలు, హాస్టళ్లను క్వారంటైన్లుగా మార్చేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్ర క్రీడా శాఖ తెలిపింది.

ఇప్పుడు కేంద్రం ప్రకటించిన లాక్‌డౌన్‌తో భారత్‌లో ఐపీఎల్ దారి దాదాపు మూసుకుపోయింది! అలాగే ప్రపంచవ్యాప్తంగా 3.5 లక్షల పైగా దాటిన కరోనా బాధితులతో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ), నిర్వాహక దేశం జపాన్ ఆలోచనలో పడింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో వాయిదా తప్ప వేరే మార్గమే లేదని అంచనాకు వచ్చిన ఐఓసీ తెరవెనుక అదే పనిచేస్తున్నా... బయటికి మాత్రం చెప్పలేకపోతోంది. దీంతో జులై 24న టోక్యోలో ఒలింపిక్స్ జే గంట మోగే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి.



నిర్మాణం పూర్తి చేసుకున్న టోక్యో ఒలింపిక్స్ ప్రధాన స్టేడియం

'టోక్యో' వాయిదా తప్పదేమో!

ఆ దిశగానే ఐఓసీ, జపాన్ అడుగులు

త్వరలోనే నిర్ణయం

టోక్యో: కరోనా ఎంత పనిచేసింది. వుహాన్‌లో మొదలుపెట్టిన మృత్యు ఘంటికల్ని ప్రపంచమంతా మోగిస్తున్న ఈ 'కోవిడ్-19'.... ఇటు వైరస్ బారిన పడిన బాధితుల్నే కాదు చాన్నాళ్లుగా జపాన్ ప్రభుత్వానికి, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి కంటిమీద కునుకే లేకుండా చేస్తోంది. దీంతో షెడ్యూల్ ప్రకారం ఒలింపిక్స్ జరిపి తీరుతామన్న ఐఓసీ ఇప్పుడు వాయిదా వేసే పనిలో పడింది. ఎన్నో ప్రత్యామ్నాయాల్ని పరిశీలించి, చివరకు ప్లాన్ 'బి' కూడా సాధ్యం కాదనే అంచనాకు వచ్చింది. వాయిదా ఖాయమైనా అధికారికంగా ఇప్పుడప్పుడే వెల్లడించడం లేదు. కానీ పాత షెడ్యూల్ ప్రకారం ఈవెంట్ జరిగే అవకాశం కూడా లేదు. ఎక్కడికక్కడ అన్నీ స్తంభించాయి. దేశ సరిహద్దులన్నీ మూతపడుతున్నాయి. చిన్న, పెద్ద పట్టణాలే కాదు... 24 గంటలు గడియారం ముల్లులా మెలకువగా ఉండే విశ్వనగరాలే లాక్‌డౌన్ అయ్యాయి. ప్రజారవాణా లేనే లేదు. ఐదు, పది మందికి మించి గుమిగూడే పరిస్థితులేవీ లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఒలింపిక్స్ లక్ష్యంగా శిబిరాలు నిర్వహించే అవకాశాల్లేవు. మిగతా క్వాలిఫయింగ్ ఈవెంట్లు జరగనే జరగవు. ఇవన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన ఐఓసీ ఓ నిర్ణయానికి వచ్చింది. రేపో మాపో కచ్చితంగా వెల్లడిస్తుంది. అదే టోక్యో ఒలింపిక్స్ 'వాయిదా' అని!

ప్రపంచం 'వాచ్' ఆగిపోతే... ఆటలా!

సెల్‌ఫోన్లు లేని రోజుల్లో మన చేతికున్న రిస్ట్ వాచ్ ఆగిపోతే ఎంత ఇబ్బంది అయ్యేదో అందరికీ తెలుసు. సమయపాలన అంతా చిన్నాభిన్నమయ్యేది. అలాంటిది ఇప్పుడు భూగోళం (గ్లోబ్) గడియారమే ఆగిపోయింది. కాసేపు 'ప్రతిష్టంభన' తట్టుకుంటామేమో కానీ ఈ 'ప్రతిస్తంభన' (అంటే రోజులపాటు ప్రతీది స్తంభించిపోవడం) ఎవరి తరం కాదు. ప్రపంచ వ్యవస్థే మూతపడిన ఈ వేళలో ఆటలెలా ఆడించేది అని ఐఓసీ ఓ నిర్ణయానికి వచ్చింది. జపాన్ ప్రజల్లోనూ వైరస్ భయాందోళనలున్నాయి. ఇవన్నీ అక్కడి ప్రభుత్వానికీ తెలుసు. అందుకే ఐఓసీతో కలిసిపోయింది. ఏం చెబితే అదే అన్న ధోరణిలో ఉంది. కానీ పైకి మాత్రం నిర్వహణకే ఏర్పాట్లు అంటూ ఇప్పటికీ బీరాలు పలుకుతుంది. ఎందుకంటే జపాన్ దేశం టోక్యో విశ్వక్రీడలకు వేల కోట్ల డబ్బులను ఖర్చు చేసింది. స్పాన్సర్‌షిప్‌ల రూపేణా కోట్లకొద్దీ డబ్బులు పోగేసుకుంది. కోట్ల మొత్తంలో ఆర్థిక వ్యవహారాలు ముడిపడి ఉండటంతో ఆటలు సాగుతాయనే అంటుంది. కానీ బయట జరిగేది మాత్రం 'వాయిదా' ప్రక్రియే! ఐఓసీ అధికారిక వర్గాల సమాచారం మేరకు అనుకున్న షెడ్యూల్ ప్రకారం పోటీలు జరిపి తీరే అవకాశాలే లేవని తెలుస్తోంది.

రేపోమాపో చెప్పక తప్పదు

ఇప్పటికై తే ప్లాన్ 'బి', 'సి', 'డి'... ఇతరత్రా ప్రత్యామ్నాయాలున్నాయని చెబుతున్నా... చిట్టచివరికి ఆటలు నిర్దేశిత సమయంలో జరగవని, కాస్త ఆలస్యమవుతాయని ఐఓసీ రేపోమాపో చెప్పనుంది. లోగడ ఆయా దేశాల్లో కరోనా విలయం ఎలా ఉంది? ఆటగాళ్ల ప్రాక్టీసు సాగుతుందా ఆగిందా? అని ఆరా తీసింది. మిగిలున్న క్వాలిఫయింగ్ ఈవెంట్లు పూర్తి చేయడం, ప్రత్యామ్నాయ అర్హత అవకాశాలు కూడా లేకపోవడంతో సభ్య దేశాలకు చెందిన క్రీడా సమాఖ్యలు, ఒలింపిక్ సమాఖ్యలు, సంఘాలు, అంతర్జాతీయ క్రీడా పాలక మండలిలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూనే ఉంది. టోక్యో ఈవెంట్‌కు 60 కంపెనీలు, సంస్థలు స్పాన్సర్ చేస్తున్నప్పటికీ ప్రధాన స్పాన్సర్లయిన టయోటా మోటార్ కార్ప్, ప్యానసోనిక్ కార్ప్ సంస్థలకు సమస్య అర్థమై ఆందోళన చెందుతున్నాయి. జపాన్ ఎయిర్‌లైన్స్ కంపెనీ కూడా షెడ్యూల్ ప్రకారం ఒలింపిక్స్ జరిగే అవకాశమే లేదని తెగేసి చెప్పింది.

వాయిదా సరే... రద్దయితే?

జపాన్ ప్రభుత్వం ఎన్ని చెప్పినా... ఒలింపిక్స్ వాయిదా దాదాపు ఖాయమైనట్లేనని ఐఓసీ వర్గాలే చెబుతున్నాయి. కానీ మరో రెండేళ్ల వరకు అంతర్జాతీయ క్రీడల క్యాలెండర్ బిజీబిజీగా ఉంది. 2021 సమ్మర్ సీజన్ ఏమాత్రం ఖాళీ లేదు. 2022 ఫుట్‌బాల్ ప్రపంచకప్ , బీజింగ్ వింటర్ ఒలింపిక్స్‌లతో నిండిపోయింది. మరి వాయిదా కొన్ని నెలలపాటే అయితే కుదరొచ్చు కానీ వచ్చే ఏడాది అంటే మాత్రం మొదటికే మోసమొస్తుంది.

పైగా 'టోక్యో'ను ప్రతీ 40 ఏళ్ల ఒలింపిక్స్ భయాలు కూడా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా 1940 ఒలింపిక్స్ రద్దు కాగా... మరో 40 ఏళ్లకు మాస్కోలో జరిగిన 1980 ఒలింపిక్స్‌ను జపాన్ బహిష్కరించింది. ఇప్పుడు మళ్లీ 40 ఏళ్లకు జపానే ఆతిథ్యమివ్వనున్న క్రీడలకు కూడా అదేగతి పడుతుందా అనే ఆందోళనలో **జపాన్ విలవిలలాడుతోంది.**

దక్షిణాఫ్రికా జట్టుకు షాక్!

'కోవిడ్' కనికా కపూర్ బస చేసిన హోటల్‌లోనే సఫారీలకు వసతి

లక్నో: ఇటీవల వన్డే సిరీస్ కోసం భారత్‌లో పర్యటించిన దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు షాక్. కోవిడ్-19 పాజిటివ్‌గా తేలిన గాయని కనికా కపూర్ బస చేసిన హోటల్‌లోనే దక్షిణాఫ్రికా జట్టు ఉన్నట్లు తెలిసింది. లక్నో వేదికగా 15న జరగాల్సిన రెండో వన్డే కోసం దక్షిణాఫ్రికా జట్టు స్థానిక ఫైవ్ స్టార్ హోటల్‌లో బస చేసింది. ఇదే హోటల్‌లో ఈనెల 14 నుంచి 16 వరకు వసతి పొందిన కనికా కపూర్ లాబీలో పలువురు అతిథులతో సమావేశమైంది. హోటల్‌లో జరిగిన ఓ వార్తా పత్రిక వార్షిక సమావేశానికి కూడా హాజరైంది. దీంతో ఆమె ఎవరెవరినీ కలిసిందో తెలుసుకునేందుకు స్థానిక ఆరోగ్య యంత్రాంగం హోటల్ సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తోంది. అయితే అప్పటికే కరోనా తన ప్రభావం చూపిస్తుండటంతో భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన మిగిలిన రెండు వన్డేలను రద్దు చేశారు. తొలి వన్డే వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. సిరీస్ రద్దయిన తర్వాత లక్నో నుంచి కోల్‌కతాకు చేరుకున్న దక్షిణాఫ్రికా జట్టు అక్కడి నుంచి స్వదేశానికి వెళ్లిపోయింది.

ఒలింపిక్స్ కోసం సిద్ధంగా ఉంటా: మను

న్యూఢిల్లీ: క్రీడా ఈవెంట్‌ల వాయిదా, శిక్షణా శిబిరాల రద్దు అనేవి ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా చిన్న విషయాలని... ప్రపంచం ముందు కరోనా రూపంలో అతి పెద్ద సవాలు నిలిచిందని భారత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ స్టార్ షూటర్ మను భాకర్ పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిబంధనలు పాటిస్తూ రానున్న విశ్వ క్రీడల కోసం సిద్ధమవుతున్నట్లు 18 ఏళ్ల మను తెలిపింది. 'ప్రస్తుతం ఇంట్లోనే ఉన్నా. అయినప్పటికీ నా ఒలింపిక్స్ సన్నాహాలను ఆపలేదు. యోగా, మెడిటేషన్‌తో సాంత్వన పొందుతున్నా. ఎప్పుడు ఒలింపిక్స్ జరిగినా సిద్ధంగా ఉండాలనేది నా ఆలోచన. దీనికి తగినట్లుగా ప్రాక్టీస్ చేస్తున్నా' అని కామన్వెల్త్ గేమ్స్, యూత్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత మను భాకర్ తెలిపింది.

రియల్ మాడ్రిడ్ క్లబ్ మాజీ అధ్యక్షుడు లొరెంజో మృతి

కరోనా వైరస్‌తో కన్నుమూత

మాడ్రిడ్ (స్పెయిన్): ప్రపంచ ఫుట్‌బాల్‌లో విఖ్యాత క్లబ్‌గా పేరొందిన రియల్ మాడ్రిడ్ క్లబ్‌కు ఐదేళ్ల పాటు అధ్యక్షుడిగా వ్యవహరించిన లొరెంజో సాంజ్ మృతి చెందారు. కొన్నిరోజుల క్రితం కరోనా వైరస్ బారిన పడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ ఆదివారం కన్నుమూశారని లొరెంజో కుమారుడు లొరెంజో సాంజ్ జూనియర్ తెలిపాడు. 76 ఏళ్ల లొరెంజో 1995 నుంచి 2000 వరకు రియల్ మాడ్రిడ్ క్లబ్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన హయాంలో రియల్ మాడ్రిడ్ జట్టు 1998, 2000లో ప్రతిష్టాత్మక చాంపియన్స్ లీగ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 118 ఏళ్ల చరిత్ర ఉన్న రియల్ మాడ్రిడ్ క్లబ్ స్పెయిన్ దేశవాళీ ఫుట్‌బాల్ టోర్నీ లా లీగాలో 33 సార్లు... యూరోప్ దేశాల్లోని క్లబ్ జట్ల మధ్య జరిగే చాంపియన్స్ లీగ్ టోర్నీలో 13 సార్లు విజేతగా నిలిచింది. కోవిడ్-19 ప్రస్తుతం యూరోప్‌లో విజృంభిస్తోంది. ఒక్క స్పెయిన్‌లోనే ఇప్పటి వరకు 1,320 మంది కరోనాతో మృతి చెందారు.

'జ్యోతి' వీక్షణకు భారీగా ఆహూతులు

కరోనాను లెక్క చేయని జపనీయులు

సెండాయ్ (జపాన్): కరోనా వైరస్ భయభ్రాంతులకు గురిచేస్తున్నప్పటికీ చరిత్రాత్మక 'ఒలింపిక్ జ్యోతి'కి జపాన్ వాసులు బ్రహ్మరథం పట్టారు. ఈనెల 26 నుంచి రిలే జరుగనున్నప్పటికీ అంతకుముందే జ్యోతిని చూసేందుకు అభిమానులు అమితాసక్తి కనబరిచారు. మియాగిలోని సెండాయ్ స్టేషన్‌లో వీక్షణకు ఉంచిన 'జ్యోతి'ని చూసేందుకు శనివారం ఈశాన్య జపాన్ ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వారాంతం కావడంతో 50 వేల మందికి పైగా 'జ్యోతి'ని చూసేందుకు గంటల తరబడి 'క్యూ'లో నిలబడ్డారు. కరోనా నేపథ్యంలో మాస్క్‌లతో వచ్చిన అభిమానులు ఒలింపిక్ జ్యోతితో ఫొటోలు తీసుకునేందుకు ఉత్సాహం ప్రదర్శించారు. 'ఒలింపిక్ జ్యోతిని ప్రత్యక్షంగా చూడటం చాలా ఆనందంగా ఉంది. దీనికోసం నేను మూడు గంటలకు పైగా లైన్‌లో నిలబడ్డాను' అని 70 ఏళ్ల మహిళ ఒకరు స్థానిక మీడియాతో వ్యాఖ్యానించారు. మరోవైపు పెద్దసంఖ్యలో తరలివచ్చిన అభిమానులను చూసి నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. గుంపులు గుంపులుగా పోగైతే జ్యోతి వీక్షణ కార్యక్రమాన్ని రద్దు చేస్తామని ప్రజలని హెచ్చరించారు. ఈనెల 26న పుకుషిమాలోని జె. విలేజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి ఒలింపిక్స్ జ్యోతి రిలే కార్యక్రమం జరుగుతుంది. రిలే జరుగనున్న దారుల్లో గుమిగూడ వద్దంటూ ఇప్పటికే ప్రజల్ని నిర్వాహకులు కోరారు.

నా శ్రమంతా వృథా అవుతుంది

ఒలింపిక్స్‌ను నిర్వహించాలన్న వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి

న్యూఢిల్లీ: ఒకవేళ టోక్యో ఒలింపిక్స్ రద్దు అయితే నాలుగేళ్ల తన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుందని భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఆందోళన వ్యక్తం చేసింది. కరోనా కారణంగా ఆటగాళ్లంతా ఒలింపిక్స్ వాయిదా వేయాలని పట్టుబడుతుంటే ఈ మణిపురి లిఫ్టర్ మాత్రం సకాలంలో ఈ మెగా ఈవెంట్ జరగాలని కోరుకుంటోంది. 'ఒలింపిక్స్ రద్దవుతే మా శ్రమంతా వృథా అవుతుంది. ఒలింపిక్స్ పతకం కోసం నాలుగేళ్లుగా శ్రమిస్తున్నా. నేను ఇది కోరుకోవట్లేదు. రోజూ దేవున్ని దీని గురించే ప్రార్థిస్తున్నా. ఒకవేళ ఇవి వాయిదా పడినా ఇబ్బందే. ప్రాక్టీస్‌లో తీవ్రత తగ్గిపోతుంది. ఇది పతక అవకాశాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి సకాలంలో ఒలింపిక్స్ జరిగితే బావుంటుంది' అని ఇప్పటికే ఒలింపిక్స్ బెర్తు ఖరారు చేసుకున్న చాను తెలిపింది. కరోనా కారణంగా వెయిట్‌లిఫ్టర్లు ప్రాక్టీస్ చేసే పాటియాలా జాతీయ ట్రెయినింగ్ సెంటర్ కూడా మూసేస్తారని తొలుత భయపడినట్లు ఆమె చెప్పింది. అయితే కేంద్ర క్రీడా శాఖ మంత్రి కిరణ్ రిజుజు ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులను మినహాయించి మిగతా క్రీడాకారుల్ని ఇళ్లకు పంపించివేశారని తెలిపింది. 'అకాడమీ కూడా లిఫ్టర్లు లేక వెలవెలబోతుంది. కేవలం ఒలింపిక్స్ ఆశావహులు మాత్రమే ఇక్కడ ప్రాక్టీస్ చేస్తున్నారు. మమ్మల్ని కూడా పంపిస్తారని ముందుగా భయపడ్డా. కానీ అలాంటిదేమీ లేదు. తగిన ఆరోగ్య భద్రతలు పాటిస్తూ ప్రాక్టీస్ చేస్తున్నాం' అని చాను వివరించింది.

ఐపీఎల్‌పై రేపు తుది నిర్ణయం!

బీసీసీఐ, ఫ్రాంచైజీ ప్రతినిధుల సమావేశం

ముంబై: కరోనా వైరస్ కట్టడి కోసం దేశంలోని పలు రాష్ట్రాలు లాక్‌డౌన్ ప్రకటిస్తుండటం... ఈ మహమ్మారి ఇంకా నియంత్రణలోకి రాకపోవడం... వెరసి ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ జరుగుతుందా లేదా అనే సందేహాలు మరింత ఎక్కువయ్యాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 29న ఐపీఎల్-13 సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే భారత్‌లో కరోనా కేసులు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఐపీఎల్‌ను ఏప్రిల్ 15 వరకు వాయిదా వేశారు. కానీ ప్రపంచ వ్యాప్తంగా కరోనా ఇంకా తగ్గుముఖం పట్టకపోవడం... అమితాదరణ ఉన్న అన్ని క్రీడాంశాల టోర్నమెంట్స్‌ను వాయిదా వేయడం లేదా రద్దు చేయడం జరిగాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌పై తుది నిర్ణయం తీసుకునేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ఫ్రాంచైజీలు మంగళవారం కాన్ఫరెన్స్ కాల్ ద్వారా సమావేశం కానున్నాయి. ఈ సమావేశంలోనే ఐపీఎల్‌ను మరికొంత కాలం వాయిదా వేయాలా లేక ఈ ఏడాదికి పూర్తిగా రద్దు చేయాలా అనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. బీసీసీఐ కార్యాలయం తాత్కాలికంగా మూసి వేయడం... ఏదైనా హోటల్లోనూ సమావేశం నిర్వహించే అవకాశం లేకపోవడంతో... ఈ సమావేశాన్ని కాన్ఫరెన్స్ కాల్ ద్వారా నిర్వహిస్తారు. కరోనా వైరస్ భారత్‌లో అడుగు పెట్టిన తర్వాత కూడా బీసీసీఐ మార్చి 13న ఈసారి ఐపీఎల్‌ను ప్రేక్షకులు లేకుండా నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగడంతో తమ నిర్ణయంపై వెనక్కి తగ్గి ఏప్రిల్ 15 వరకు ఐపీఎల్‌ను వాయిదా వేస్తున్నామని ప్రకటించింది. అనంతరం ఐపీఎల్‌ను కుదించి నిర్వహించాలని... ఒకవేళ వేసవి కాలంలో సాధ్యంకాకపోతే జూలై-సెప్టెంబర్ మధ్య కాలంలో ఏర్పాటు చేసే అంశాన్ని బీసీసీఐ పరిశీలించింది. ఈ ఏడాది అక్టోబరులో ఆస్ట్రేలియాలో టి20 వరల్డ్ కప్ జరగనున్న నేపథ్యంలో సెప్టెంబర్‌లోపే ఐపీఎల్‌ను నిర్వహించాలని బీసీసీఐ భావిస్తోంది. పరిస్థితులు అనుకూలించక ఐపీఎల్-2020 సీజన్ పూర్తిగా రద్దయితే మాత్రం బీసీసీఐ సుమారు రూ. 3500 కోట్లు నష్టపోయే అవకాశముంది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
23-3-2020

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
1,628	482
29,916	8,745

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	6,880	271
డోజోన్స్	19,174	913
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,191	39
డాక్స్	8,929	319
షాంఘై	2,746	43
నికాయ్	16,552	174

అమెరికా బ్రిటన్ జర్మనీ చైనా జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	74.07	75.73
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	85.51	88.60
€	యూరో	ఎస్‌బీఐ	78.96	81.86
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	66.75	69.19
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	43.00	45.06
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.80	52.50
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	19.00	20.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	19.14	21.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.49	11.26

స్టాక్స్‌లో నష్టపోకూడదంటే..?

సంపద కూడబెట్టుకునేందుకు ఎన్నో మార్గాలున్నాయి. అందులో ఈక్విటీలది అగ్ర తాంబూలం. మార్కెట్ పతనాలే మంచి పెట్టుబడి అవకాశాలను తెచ్చిపెడతాయి. గతంలో భారీ పతనాలు ఎన్నో వచ్చి వెళ్లాయి. ఈక్విటీ మార్కెట్లు పడి లేచిన బంతి మాదిరిగా ఆ పతనాల నుంచి నూతన శిఖరాలకు చేరడాన్ని చూశాం. ప్రపంచ ఆర్థిక మాంద్యం 2008లో మన ఈక్విటీ మార్కెట్లను 50 శాతానికి పైగా పడవేయగా, ఆ తర్వాత కాలంలో మార్కెట్లు ఎప్పటికప్పుడు కొత్త గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. ఇప్పుడు కరోనా వైరస్ మార్కెట్‌ను ముంచేస్తోంది. షేర్లు పేక మేడల్లా కూలిపోతున్నాయి. ఇప్పటికే సూచీలు 30 శాతానికి పైగా నష్టపోయాయి. 'అందరూ ఎగబడి కొంటుంటే ఆ సమయంలో జాగ్రత్త పడాలి.. అందరు భయంతో అమ్మకాలు సాగిస్తుంటే అప్పుడు ఆశతో కొనుగోలు చేయాలన్నది' వారెన్ బఫెట్ నమ్మే సూత్రం. ఇప్పుడు దీన్ని అనుసరించే సమయం ఆసన్నమైంది.

•••

అయితే, ఈక్విటీల్లో రాబడులు తెచ్చుకోవాలంటే కరెక్షన్‌లో షేర్లను తక్కువ ధరల వద్ద కొనుగోలు చేయడం ఒక్కటే కాదు.. ఆ షేర్లు నాణ్యమైన కంపెనీలవి అయి ఉండాలి. భవిష్యత్తు ఉన్నవి కావాలి. అంటే చేసే పెట్టుబడుల్లో తప్పటడుగులకు చోటు లేకుండా చూసుకోవాలి. ఈక్విటీ రాబడులకు తగిన విషయ పరిజ్ఞానం, అధ్యయనం అవసరం. కేవలం కొన్ని తప్పులు పెట్టుబడి మొత్తాన్ని హరించేస్తాయి. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే వారిలో చాలా మంది కనీసం ప్రాథమిక సూత్రాలను కూడా పాటించకుండా సాగిపోతుంటారు. తమ రిస్క్ స్థాయిలను తెలుసుకోకుండా రాబడుల కాంక్షతో దూకుడుగా వెళ్లి చేతులు కాల్చుకుంటుంటారు. కానీ, ఏదైనా కోల్పోవడం అంత సులభం కాదు రాబట్టుకోవడం. ఇదే సూత్రం ఈక్విటీలకూ వర్తిస్తుంది. ఈక్విటీల పట్ల సరైన అవగాహన లేకుండా, భారీ నష్టాలను మూటగట్టుకుంటే.. ఆ తర్వాత పెట్టుబడులపై ఈ ప్రభావం కచ్చితంగా పడుతుంది. అందుకే స్టాక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్‌ను కాపాడుకుంటూ, దీర్ఘకాలంలో రాబడులు పోగేసుకోవాలంటే కొన్ని తప్పులకూ దూరంగా ఉండాలి. ఆ వివరాలను డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఏవీపీ అమిత్ గ్రోవర్ వెల్లడించారు.

- కొన్ని తప్పులకు దూరంగా ఉండాలి
- అనుకూల సమయం ఎప్పుడన్నది చెప్పలేం
- అప్పటి వరకూ వేచి చూస్తేనే లాభాలు
- స్థాయిని మించి రిస్క్ తీసుకుంటే ప్రమాదమే
- వైవిధ్యం లేకపోతే నష్టాలకు చాన్స్
- తగినంత అధ్యయనం లేకుండా ఇన్వెస్ట్ చేయరాదు

సమయం ఎంచకూడదు

ఈక్విటీ పెట్టుబడులకు సమయం నిర్దేశించుకోవడం సరైనది కాదు. ఇటాలియన్ ఆర్థిక వేత్త పారెటో పరిశోధన 80-20 సూత్రాన్ని సూచిస్తోంది. ఉదాహరణకు కంపెనీల ఉత్పత్తుల్లో 20 శాతం ఉత్పత్తుల నుంచి 80 శాతం ఆదాయం వస్తుంటుంది. అలాగే, ఓ కంపెనీ లాభాలకు 20 శాతం ఉద్యోగుల పాత్రే ఎక్కువగా ఉంటుంది. అలాగే, 20 శాతం ప్రయత్నాలు మన విజయాల్లో 80 శాతం పాత్ర పోషిస్తాయి. పారెటో రూపొందించిన సూత్రం ఈక్విటీలకు కూడా అమలవుతుంది. ఎందుకంటే స్టాక్ మార్కెట్ రాబడుల్లో 80 శాతం కేవలం 20 శాతం సమయంలోనే వస్తుంటాయి. కానీ, ఈ 20 శాతం సమయం ఎప్పుడన్నది ఊహించడం అసాధ్యం. ఎంతో ఓపికగా, దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్‌మెంట్‌ను కొనసాగించేలా ఉండాలి. అప్పుడే ఆ 20 శాతం సమయంలోకి అడుగుపెట్టి మంచి రాబడులు పొందే అవకాశం లభిస్తుంది. కొంత కాలం పాటు పెట్టుబడులను కొనసాగించి, రాబడుల సమయం వచ్చే వరకు వేచి చూడలేక నిరాశతో వెనక్కి తీసేసుకుంటే.. ఆ విలువైన రాబడుల అవకాశాన్ని కోల్పోయినట్టే.

వైవిధ్యం లేకపోవడం

క్రికెట్‌లో ప్రతీ బాల్‌కు ఆరు పరుగులు (సిక్సర్) నమోదు చేయడం సాధ్యం కాదన్న విషయం బ్యాట్స్‌మెన్‌కు తప్పకుండా తెలిసి ఉంటుంది. ఆరు పరుగులు, నాలుగు, రెండు పరుగులు, ఒక పరుగు ఇలా అన్నీ సమకూర్చుకుంటేనే సెంచరీ మార్కు సాధ్యపడుతుంది. పెట్టుబడి కూడా అంతే. గత 40 ఏళ్ల స్టాక్ మార్కెట్ చరిత్రను తిరగేస్తే 100 రెట్లు పెరిగిన కంపెనీలు ఎన్నో కనిపిస్తాయి. తమ తమ రంగాల్లో దిగ్గజాలుగా అవతరించినవీ ఉన్నాయి. మరోవైపు దివాలా తీసిన కంపెనీలూ కనిపిస్తాయి. కానీ, ఇన్వెస్టర్లకు ఇలా ఎన్నో రెట్లు లాభాలను ఇచ్చిన మల్టీబ్యాగర్ కథనాలే ఆసక్తి కలిగిస్తాయి. వైఫల్య కథనాలను పట్టించుకోకుండా.. మల్టీ బ్యాగర్ ఆకాంక్షతో కేవలం కొన్ని స్టాక్స్‌లోనే తమ పెట్టుబడులు అన్నింటినీ కుమ్మరించేస్తుంటారు. కానీ, ఇది ఎంతో రిస్క్‌తో కూడిన వ్యాపారం. తమ పెట్టుబడులు, కాల వ్యవధికి అనుగుణంగా తగినంత వైవిధ్యంతో కూడిన స్టాక్ పోర్ట్‌ఫోలియోను ఏర్పాటు చేసుకోవడం వల్ల దీర్ఘకాలంలో అధిక రాబడులు పొందడంతోపాటు ఒక్కో స్టాక్ వారీ రిస్క్ కూడా తక్కువ అవుతుంది.

తగినంత అధ్యయనం లేకుండా..

ఓ విదేశీ పర్యటనకు వెళ్లాలనుకుంటే ఎన్నో నెలల పాటు అధ్యయనం చేస్తుంటారు. ఏ ఏ ప్రాంతాలను చుట్టి రావాలి, అక్కడ ఉండే వసతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఖర్చులు ఇలా అన్నింటిపైనా అవగాహన కోసం ఎంతో మందిని విచారిస్తాం. ఏదైనా వస్తువును కొనుగోలు చేయాలన్నా ఇదే స్థాయిలో సమయాన్ని వెచ్చిస్తుంటారు. కానీ, భవిష్యత్తు కోసం ఉద్దేశించి పెట్టుబడులు పెట్టే ముందు తగినంత అధ్యయనం లేకపోతే ఎలా..? కంపెనీ వాటాలను కొనుగోలు చేస్తున్నారంటే.. ఆయా కంపెనీల వ్యాపారం, యాజమాన్యం, ఆర్థిక పరిస్థితులు, ఆ కంపెనీ పనిచేసే రంగం, దేశ ఆర్థిక పరిస్థితి ఇలా ఎన్నో అంశాలను అర్థం చేసుకోవాలి. అదృష్టం కలిసి వస్తే స్టాక్స్ ఎంపిక విషయంలో ఇన్వెస్టర్లకు తమ సామర్థ్యంపై నమ్మకం మరింత బలపడుతుంది. నిజానికి బుల్ మార్కెట్‌లో అన్ని స్టాక్స్ ర్యాలీ చేస్తుంటాయి. దాంతో తమ నైపుణ్యాలు, అదృష్టం మధ్య వ్యత్యాసం వారికి అర్థం కాదు. కానీ, ఆటుపోట్లు బయటపడినప్పుడే అసలు విషయం బయటపడుతుందని విఖ్యాత స్టాక్ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ చెప్పే మాట ఇక్కడ గమనార్హం.

భరించలేనంత రిస్క్

ఈక్విటీ మార్కెట్లు ఎక్కువగా ఆటుపోట్లతో కూడి ఉంటాయి. స్వల్పకాలంలోనే స్టాక్స్‌లో లేదా సూచీల్లో 10-20% నష్టాలు కనిపిస్తుంటాయి. అంతేకాదు అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం వచ్చిన 2008, హర్షద్ మెహతా స్కామ్ వెలుగు చూసిన 1990ల్లో అయితే స్టాక్ మార్కెట్లు 50 శాతానికి పైగా నష్టపోయాయి. సాధారణ మార్కెట్ పరిస్థితులను అనుసరించి ఎక్కువ మంది పోర్ట్‌ఫోలియో నిర్మాణం చేసుకుంటుంటారు. కానీ, మార్కెట్ పతనాల్లో పెట్టుబడి హరించుకుపోకుండా ఉండాలంటే రిస్క్ నిర్వహణ జాగ్రత్తగా ఉండాలి. ఎటువంటి పరిస్థితులను అయినా ఎదుర్కొనే విధంగా జవానులు ఎలా తర్ఫీదు అయితే పొందుతారో.. ఇన్వెస్టర్లు సైతం అత్యంత ప్రతికూల పరిస్థితులనూ నెగ్గుకొచ్చే విధంగా పోర్ట్‌ఫోలియో నిర్మాణం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

రాబడుల కోసం పరుగు

రాబడుల కోసం పరుగెత్తడం కాకుండా, పెట్టుబడులకు సంబంధించి నిర్దేశిత ప్రక్రియను పాటించడం ఎంతో అవసరం. ఎలుకకు ఏదో ఒక ఆహారాన్ని వేసి బంధించినట్టుగానే.. మనల్ని బుట్టలో వేయాలంటే అందుకు ఆకర్షణీయమైన హామీలు గుప్పిస్తే సరి. స్కామర్లు భారీ రాబడులను ఎరగా చూపుతుంటారు. వీటికి ఆకర్షితులైన వారు ఎలుకల మాదిరే వాటిల్లో చిక్కుకుంటారు. రాబడులు అన్నవి కంటికి కనిపించేవి. కానీ, రిస్క్ కనిపించని రూపంలో ఉంటుంది. గత నాలుగు ఐపీవోలు లిస్టింగ్‌లో 10 శాతం పైనే రాబడులు ఇచ్చాయనుకుంటే.. ఐదో ఐపీవో కూడా లిస్టింగ్‌లో ఇదే విధమైన రాబడులు ఇస్తుందని భావించడం సురక్షితమేనా..? ఇన్వెస్టింగ్ విధానాన్ని అర్థం చేసుకోవడం వల్ల స్టాక్ పెరుగుదల, పతనాల్లో నిశ్చింతగా ఉండే బలాన్నిస్తుంది. తద్వారా దీర్ఘకాలం పాటు సౌకర్యంగా వాటిల్లో కొనసాగగలరు.

స్వల్పకాలం కోసం ఇన్వెస్ట్‌మెంట్

40 ఏళ్లలో సెన్సెక్స్ (1979-2019) ప్రయాణాన్నే పరిశీలిస్తే.. మీరు ఏడాది కాలం కోసం ఇన్వెస్ట్ చేస్తే 33 శాతం కేసుల్లో నష్టపోయే ప్రమాదం ఉంటుంది. అదే ఐదేళ్ల కాల వ్యవధి కోసం ఇన్వెస్ట్ చేస్తే నష్టపోయే అవకాశాలు 8 శాతమే. అదే 10 ఏళ్ల కాలం కోసం ఇన్వెస్ట్ చేస్తే నష్టపోయే అవకాశాలు 3 శాతమే. 15 ఏళ్ల కాల వ్యవధి కోసం ఇన్వెస్ట్ చేస్తే నష్టపోయే ప్రమాదం సున్నా. 40 ఏళ్ల కాలంలో సెన్సెక్స్ పనితీరు ఆధారంగా అంచనాలు ఇవి. అమెజాన్ చైర్మన్, సీఈవో జెఫ్ బెజోస్ ఒకసారి వారెన్ బఫెట్‌ను.. 'మీ పెట్టుబడుల సిద్ధాంతం చాలా సులభంగా ఉంటుంది. కానీ, ప్రతి ఒక్కరూ దీన్ని ఎందుకు అనుసరించరు?' అని ప్రశ్నించారు. ''ఎందుకంటే ఎవరూ కూడా నిదానంగా ధనవంతులు కావాలని కోరుకోరు'' అంటూ బఫెట్ బదులిచ్చారు. అంటే చాలా వేగంగా రాబడులు పోగేసుకోవాలనే ఆకాంక్షే తప్పటడుగులకు దారితీస్తుందని గ్రహించాలి.

విలువకు విలువ ఇవ్వకపోవడం..

ధర అన్నది చెల్లించేది.. కానీ, విలువ అన్నది మీరు పొందేది. మార్కెట్లు అన్నవి ఉత్సాహం, నిరాశావాదం మధ్య చలిస్తుంటాయి. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కంటే.. వదంతులు, ఊహాజనితాల ఆధారంగానే ఎక్కువగా చలించడం ఉంటుంది. దీంతో తాము కొనుగోలు చేస్తున్న వాటి విలువను పరిశీలించకుండా, ఈ విధమైన కథనాలపై ఆధారపడి అడుగులు వేయవద్దు. భవిష్యత్తు రాబడులు అన్నవి మీ కొనుగోలు ధరపైనే ఆధారపడి ఉంటాయని తెలుసుకోవాలి. కనుక మీరు ఓ స్టాక్‌లోకి ప్రవేశించే ధర చాలా అధిక స్థాయిలో ఉంటే భవిష్యత్తు రాబడులు తక్కువగా ఉండడం లేదా ప్రతికూలంగా ఉండడం జరగొచ్చు. కనుక అసలు విలువను గుర్తించడం నేర్చుకోవాలి.

తగిన అవగాహన లేకుండా...

ఇన్వెస్టింగ్ అనేది ప్రత్యేకమైన ఉద్యోగమే. ఫైనాన్స్, అకౌంటింగ్, వ్యాల్యూషన్లు వీటన్నింటిని అర్థం చేసుకోగలిగి ఉండాలి. యాజమాన్యం గురించి తెలుసుకోవాలి. ఆ కంపెనీ పనిచేస్తున్న విభాగం/రంగం గురించి తగినంత అవగాహన ఉండాలి. మార్కెట్ ఆటుపోట్లను అధిగమించే ప్రశాంతత అవసరం. ఎంతో అనుభవం, సమయం, శక్తి పెట్టుబడులకు అవసరం. అందుకే దీన్ని పార్ట్ టైమ్ కాకుండా పూర్తికాలపు ఉద్యోగంగా పేర్కొంటారు. కనుక అంత సమయం వెచ్చించలేని వారికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన ఆప్షన్. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను నిపుణులు నిర్వహిస్తుంటారు. పైగా పెట్టుబడుల్లో తగినంత వైవిధ్యం కూడా ఉంటుంది. దీంతో తక్కువ ఖర్చుకే తగినంత వైవిధ్యాన్ని ఫండ్స్ ద్వారా పొందొచ్చు.

బంగారం... 1,300 డాలర్లకు వచ్చే అవకాశం!

అంతర్జాతీయంగా తీవ్ర ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఎదురయితే, పసిడి ధర వేగంగా పెరగడం సహజం. ఆర్థిక వ్యవస్థపై నిజానికి కోవిడ్-19(కరోనా) వైరస్ ప్రభావం కారణంగా అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్-నైమెక్స్‌లో ఔన్స్ (31.1గ్రా) ధర ఈ నెల మొదట్లో పసిడి ఎనిమిదేళ్ల గరిష్టం 1,704 డాలర్లను తాకింది. అయితే అటు తర్వాత పెట్టుబడులకు సురక్షిత సాధనంగా భావించే ఈ మెటల్ నుంచీ డబ్బును ఇన్వెస్టర్లు ఉపసంహరించి డాలర్‌లోకి పంప్ చేయడం ప్రారంభించారు. దీనితో ఆరు ప్రధాన కరెన్సీలతో ట్రేడయ్యే డాలర్ ఇండెక్స్ 103 స్థాయి దాటేసింది (52 వారాల కనిష్టం 95.61). పసిడి 20వ తేదీ శుక్రవారంతో ముగిసిన వారంలో 1,501 డాలర్ల వద్ద ముగిసింది. ఒక దశలో 1,460 డాలర్ల స్థాయినీ చూసింది. పసిడి 52 వారాల కనిష్టం 1,266 డాలర్లు.

బులిష్ ధోరణే...: భారీగా పెరిగిన పసిడి నుంచి ప్రస్తుతం లాభాల ఉపసంహరణే జరుగుతోంది తప్ప, మెటల్ బేరిష్ ధోరణిలోకి వెళ్లలేదన్నది పలువురి అభిప్రాయం. ఒకవేళ అలా అయినా మహాఅయితే మరో 150 డాలర్లు పతనం కావచ్చని, 1,360, 1,300 డాలర్లు పసిడికి పటిష్ట మద్దతని వాదనలు ఉన్నాయి. పసిడి కొనుగోళ్లకు ఇది సువర్ణ అవకాశమని యూబీఎస్ గ్రూప్‌లో కమోడిటీ, విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వానీ గార్డెన్ పేర్కొంటున్నారు. పలు సెంట్రల్ బ్యాంకులు సరళతర ఆర్థిక విధానాలు అనుసరిస్తున్న నేపథ్యంలో తిరిగి పసిడి భారీగా పెరగడం ఖాయమన్నది ఆయన విశ్లేషణ. కరోనా ప్రభావంతో ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమై కరెన్సీ యుద్ధం ప్రారంభమయిన పక్షంలో పసిడే ఇన్వెస్టర్లకు ఏకైక పెట్టుబడి సాధనమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (ఫిబ్రవరి-25-2020 అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1-2 ఏళ్లు	3-5 ఏళ్లు
ఆంధ్రా బ్యాంక్	5.75	6	6.1
యాక్సిస్ బ్యాంక్	6.4	6.5	6.5
బ్యాంక్ ఆఫ్ బరోడా	5.5	6	6.25
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6	6.3	6.25
కెనరా బ్యాంక్	5.9	6.3	6.25
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6	6.2	6.2
కార్పొరేషన్ బ్యాంక్	5.9	6.45	6.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.05	6.3	6.3
ఐసీఐసీఐ బ్యాంక్	6	6.3	6.4
కరూర్ వైశ్యా బ్యాంక్	5.9	6.25	6.3
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25	6.75	6.75
హెచ్‌ఎస్‌బీసీ	5	5.6	5.75
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	5.8	6.25	6.25
కర్ణాటక బ్యాంక్	6.25	6.5	6.4
ఎస్‌బీఐ	5.5	6	6
సిండికేట్ బ్యాంక్	5.75	6.25	6.25
యస్ బ్యాంక్	7.15	7.5	7.25

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

అనిశ్చిత పరిస్థితుల్లోనూ రాబడులు..!

యాక్సిస్ బ్లూచిప్ ఫండ్

గత రెండేళ్లుగా ఎన్నో అనిశ్చిత పరిస్థితులను చవిచూసి కాస్త కోలుకుంటున్న మన ఈక్విటీ మార్కెట్లు.. ప్రపంచ ఆర్థిక వృద్ధిని కోవిడ్-19 వైరస్ దెబ్బతీయవచ్చన్న ఆందోళనలతో మరో విడత భారీ నష్టాల్లోకి జారిపోయాయి. అంతర్జాతీయంగా అన్ని ఈక్విటీ మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నిజానికి కోవిడ్ వైరస్ ప్రభావం దేశీయ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై ఏ మేరకు ప్రభావం చూపిస్తుందన్నది ఇప్పుడే అంచనా వేయలేం. కానీ, ప్రతికూల పరిస్థితులే కొనసాగితే స్టాక్ మార్కెట్లపై ఆ ప్రభావం కచ్చితంగా ఉంటుంది. కనుక ఈ సమయంలో నాణ్యమైన లార్జ్‌క్యాప్ (మార్కెట్ విలువ పరంగా టాప్-100) కంపెనీలను పెట్టుబడులకు ఎంచుకోవడం కాస్త సురక్షితం. ఎందుకంటే ప్రతికూల పరిస్థితులను ఇవి సమర్థవంతంగా అధిగమించగలవు. కనుక ఇన్వెస్టర్లు తమ దీర్ఘకాల లక్ష్యాల కోసం మంచి రాబడుల చరిత్ర కలిగిన లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ విభాగంలో నమ్మకమైన పనితీరు చూపిస్తున్న వాటిల్లో యాక్సిస్ బ్లూచిప్ ఫండ్ కూడా ఒకటి.

రాబడులు..: లార్జ్‌క్యాప్ విభాగంలో రాబడుల పరంగా యాక్సిస్ బ్లూచిప్ ఫండ్ అగ్రగామిగా ఉంది. బెంచ్‌మార్క్ నిఫ్టీ 50ని మించి రాబడులను ఇన్వెస్టర్లకు తెచ్చిపెడుతోంది. ఈ పథకంలో గత ఏడాది కాలంలో రాబడులు 21.2 శాతంగా ఉన్నాయి. కానీ, ఇదే కాలంలో నిఫ్టీ-50 పెరుగుదల కేవలం 9.1 శాతమే. బెంచ్ మార్క్ సూచీతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో ఈ పథకం ఇన్వెస్టర్లకు లాభాలు తెచ్చిపెట్టింది. మూడేళ్ల కాలంలో చూస్తే వార్షిక రాబడులు 17.5 శాతం, ఐదేళ్ల కాలంలో 10.7 శాతం చొప్పున ఉన్నాయి. కానీ, నిఫ్టీ-50 మూడేళ్లలో వార్షికంగా 10.7 శాతం, ఐదేళ్లలో వార్షికంగా 7.5 శాతమే వృద్ధిని చూపించడం గమనించాలి. దీర్ఘకాలం కోసం సిప్ రూపంలో ఈ పథకంలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులకు అవకాశం ఉంటుందని పనితీరు ఆధారంగా తెలుస్తోంది.

పెట్టుబడుల విధానం

లార్జ్‌క్యాప్ ఫండ్ కనుక తన పెట్టుబడుల్లో కనీసం 80 శాతాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేస్తుంది. మిగిలిన మొత్తాన్ని చిన్న కంపెనీలకు కేటాయిస్తుంది. ప్రస్తుతం ఈ పథకం తన వద్దనున్న పెట్టుబడుల్లో 87 శాతమే ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 12.9 శాతాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసి ఉంది. అనిశ్చిత పరిస్థితుల్లో మంచి పెట్టుబడుల అవకాశాలను సొంతం చేసుకునేందుకు వీలుగా డెట్‌లో ఈ మేరకు పెట్టుబడులు పెట్టినట్టుగా భావించాలి. మరీ ముఖ్యంగా ఈక్విటీ పెట్టుబడుల్లో 99.60 శాతం లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేసి ఉంది. స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో కేవలం 0.40 శాతమే పెట్టుబడులు కలిగి ఉంది. అంటే సమీప భవిష్యత్తులో స్మాల్ క్యాప్ పెట్టుబడులు సురక్షితం కాదని ఫండ్ మేనేజర్లు భావిస్తున్నట్టు అర్థం అవుతోంది. ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో మొత్తం 24 స్టాక్స్ ఉన్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ స్టాక్స్‌లోనే 46 శాతం వరకు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం. ఆ తర్వాత టెక్నాలజీ రంగ కంపెనీల్లో 10 శాతం, ఎఫ్‌ఎంసీజీ కంపెనీల్లో 7 శాతం వరకు ఇన్వెస్ట్ చేసి ఉంది.

టాప్ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	9.19
బజాజ్ ఫైనాన్స్	8.38
కోటక్ బ్యాంకు	8.02
ఐసీఐసీఐ బ్యాంకు	7.90
అవెన్యూ సూపర్‌మార్ట్స్	6.01
హెచ్‌డీఎఫ్‌సీ	5.88
ఇన్ఫోసిస్	5.60
ఏషియన్ పెయింట్స్	4.24
బజాజ్ ఫిన్‌సర్వ్	3.67
హిందుస్తాన్ యూనిలీవర్	3.47

"అపజయాలెదురైనా... అలుపెరుగని శ్రమ వల్లే విజయం సాధ్యం."
- విన్‌స్టన్ చర్చిల్

బొమ్మ-బొరుసు

సంక్షోభాన్ని అధిగమించేందుకు ఆర్థిక చేయూత కావాలి...

- ఉద్దీపన చర్యలు ప్రకటించండి...
- రుణ చెల్లింపులపై మారటోరియం..
- కేంద్రానికి పరిశ్రమల వినతి



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ ప్రభావాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం చేయూతనివ్వాలని దేశీయ పరిశ్రమలు కేంద్రాన్ని కోరాయి. రుణ చెల్లింపులపై మారటోరియం విధించడం, పన్నుల తగ్గింపు, ప్రజలకు రూ.2లక్షల కోట్ల ఆర్థిక ఉద్దీపనలు అందించాలని సూచించాయి. మన దేశ ఆర్థిక వ్యవస్థ కరోనా వైరస్ రాకముందే మందగమనంలో ఉంది. గత డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఏడేళ్ల కనిష్ట స్థాయి 4.7 శాతానికి పడిపోయింది. తాజాగా కరోనా వైరస్‌తో దేశవ్యాప్తంగా అన్నీ మూతేయాల్సి వస్తుండడంతో ఆర్థిక వృద్ధి మరింత పడిపోయే ప్రమాదం ఉంది. విధానపరమైన చర్యలను ప్రభుత్వం వెంటనే అమల్లోకి తీసుకురాకపోతే 2020-21 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 5 శాతం లోపునకు పడిపోవచ్చంటూ దేశీయ పరిశ్రమలు ఆందోళన వ్యక్తం చేశాయి. ద్రవ్య, పరపతి పరమైన ఉద్దీపన చర్యలను తక్షణమే ప్రకటించాలని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కోరారు. దేశ జీడీపీలో ఒక శాతానికి సమానమైన రూ.2 లక్షల కోట్లను పేదలకు ఆధార్ ఆధారిత ప్రత్యక్ష నగదు బదిలీ రూపంలో అందించాలని సీఐఐ కోరింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసింది. స్టాక్ మార్కెట్లలో అస్థిరతలను తగ్గించేందుకు దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నును తొలగించడాన్ని పరిశీలించాలని.. అలాగే, డివిడెండ్ పంపిణీ పన్నును 25 శాతంగా నిర్ణయించాలని కోరింది. రెపో రేటును 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించడంతోపాటు, వసూలు కాని రుణాలను ఎన్‌పీఏలుగా గుర్తించడానికి ప్రస్తుతమున్న 90 రోజుల గడువును తాత్కాలికంగా అయినా 180 రోజులకు పెంచాలని సీఐఐ సూచనలు చేసింది.

ఏడాది చివరి వరకు విరామం..

కార్పొరేట్ కంపెనీలు, వ్యక్తులకు రుణ చెల్లింపులపై ఈ ఏడాది చివరి వరకు మారటోరియం (విరామం) ప్రకటించాలని అసోచామ్ కోరింది. ఎల్ఐసీ ద్వారా వెంటనే ఎన్‌బీఎఫ్‌సీలకు నిధులను అందించాలని సూచించింది. మన దేశంపై కరోనా ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న అసోచామ్.. దురదృష్టవశాత్తూ దేశ రుణ మార్కెట్ బలహీనంగా ఉన్న, ఆర్థిక వ్యవస్థ మందగమనం సమయంలో ఈ సంక్షోభం వచ్చిందని వ్యాఖ్యానించింది.

ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపుల గడువు పెంపు

ముంబై: కరోనా వైరస్ కారణంగా సకాలంలో ప్రీమియం చెల్లించలేని వారిని దృష్టిలో ఉంచుకుని ఎల్ఐసీ ఏప్రిల్ 15 వరకు గడువు పొడిగించింది. పాలసీలు అమల్లో ఉండి, ఇప్పటికే ప్రీమియం చెల్లించాల్సిన వారికి గడువు పెంపు వెసులుబాటు కల్పించనుంది. చాలా రాష్ట్రాలు ఈ నెలాఖరు వరకు లాక్‌డౌన్ ప్రకటిస్తున్న నేపథ్యంలో ఎల్ఐసీ నుంచి ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

కరోనా పరిణామాలే కీలకం..!

- గురువారం ఎఫ్ అండ్ ఓ సిరీస్ ముగింపు
- భారీ ఒడిదుడుకులకు ఆస్కారం: మోతీలాల్ ఓస్వాల్
- వైరస్ పరిణామాలతోనే ఈ వారం సూచీలకు దిశా నిర్దేశం

న్యూఢిల్లీ: కోవిడ్-19 (కరోనా) వైరస్ ధాటికి ప్రపంచం దాదాపుగా స్తంభించిపోయింది. దేశాలకు దేశాలు షట్‌డౌన్ ప్రకటిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడిపోయింది. వైరస్ వ్యాప్తి వేగం తగ్గకపోతే ఎకానమీ మాంద్యంలోకి జారిపోయే ప్రమాదం ఉందని ఆర్థిక వేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కేవలం కరోనా వైరస్ పరిణామాలు మాత్రమే ఈ వారంలో దేశీ స్టాక్ మార్కెట్‌కు దిశా నిర్దేశం చేయనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. వైరస్ విస్తృతి ఆధారంగానే ఈ వారంలో సూచీల కదలికలు ఉండనున్నాయని మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీస్ విశ్లేషకులు చందన్ తపారియా అన్నారు. మార్కెట్లో ఒడిదుడుకులను సూచించే వోలటాలిటీ ఇండెక్స్ (ఇండియా వీఐఎక్స్) జీవితకాల గరిష్టస్థాయికి చేరినందున భారీ హెచ్చుతగ్గులకు అవకాశం ఉందని విశ్లేషించారు. వైరస్ ఇబ్బందుల దృష్ట్యా వీలైనంత త్వరలో ఆర్థిక ప్యాకేజీని ప్రకటిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భరోసా ఇవ్వడం వంటి ఆశాజనక వార్తలు రిలీఫ్ ర్యాలీకి ఆస్కారం ఇచ్చినప్పటికీ.. వైరస్ వ్యాప్తి అంశమే అత్యంత కీలకంకానుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

మార్చి సిరీస్ ముగింపు ఈవారంలోనే..

గురువారం (26న) మార్చి నెల ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్ ఓ) సిరీస్ ముగియనుంది. ఈ సిరీస్‌లో సూచీలు 35 శాతం నష్టపోయాయి. వోలటాలిటీ 72 శాతానికి చేరుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో షార్ట్ రోలోవర్స్ కొనసాగుతున్నాయని, నిఫ్టీ 7,800-8,000 పాయింట్ల స్థాయికి పడిపోతే ట్రేడర్లు పొజిషన్లను క్లోజ్ చేసే అవకాశం ఉందని ఐసీఐసీఐ డైరెక్ట్ అనలిస్ట్ అమిత్ గుప్తా విశ్లేషించారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా మరణాలు పెరిగితే సూచీలు కుప్పకూలిపోతాయని చెప్పడంలో సందేహం లేదని ట్రేడింగ్ బెల్స్ సీనియర్ అనలిస్ట్ సంతోష్ మీనా వ్యాఖ్యానించారు. మరణాలు ఆగితేనే మార్కెట్ నిలబడుతుందని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. షార్ట్ సెల్లింగ్‌పై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పరిమితులను విధించిన నేపథ్యంలో ఎఫ్ అండ్ ఓలోని 10-12 శాతం షేర్లపై ఈ ప్రభావం ఉందనుందని సామ్కో సెక్యూరిటీస్ అనలిస్ట్ జిమీత్ మోడీ అన్నారు.

ఎక్ఛేంజీలు పనిచేస్తాయ్..

దేశీ స్టాక్ ఎక్ఛేంజీలు సోమవారం యథావిధిగా పనిచేస్తాయని సెబీ ప్రకటించింది. వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై షట్‌డౌన్‌లో ఉన్నప్పటికీ.. స్టాక్ ఎక్ఛేంజీలు, క్లియరింగ్ కార్పొరేషన్లు, డిపాజిటరీలు మాత్రం పనిచేస్తాయని స్పష్టంచేసింది. బోంబే స్టాక్ ఎక్ఛేంజ్‌లోని అన్ని విభాగాలు సోమవారం యథావిధిగా పనిచేస్తాయని బీఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశిష్‌కుమార్ చౌహాన్ ప్రకటించారు. నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్ కూడా ఇదే ప్రకటన చేసింది.

స్టాక్ బ్రోకర్లకు వర్క్ ఫ్రమ్ హోమ్ సౌలభ్యం

కరోనా వైరస్ వేగంగా విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా భారత్‌లో మృతిచెందిన వారి సంఖ్య ఇప్పటికే ఏడుకు చేరింది. ఇటువంటి పరిస్థితుల్లో స్టాక్ బ్రోకర్లకు ఇంటి వద్ద నుంచి పని చేసే సౌలభ్యం కల్పించినట్లు దేశీ స్టాక్ ఎక్ఛేంజీలు ప్రకటించాయి. ఈనెల 30 వరకు ఈ ఫెసిలిటీని ఇస్తున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు స్పష్టంచేశాయి. ఈ క్రమంలో ఎటువంటి అవకతవకలు జరగకుండా బ్రోకర్ల వద్ద నుంచి వారి టెర్మినల్ లొకేషన్ల అడ్రస్‌లను సేకరిస్తున్నట్లు వివరించాయి.

ఈ నెలలో రూ. లక్ష కోట్లు వెనక్కి..

భారత క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈ నెల్లో రూ. 1,08,697 కోట్లను ఉపసంహరించుకున్నారు. డిపాజిటరీల డేటా ప్రకారం.. మార్చి 2-20 మధ్యలో ఈక్విటీ మార్కెట్ నుంచి రూ. 56,248 కోట్లను, డెట్ మార్కెట్ నుంచి రూ. 52,449 కోట్లను వెనక్కు తీసుకున్నారు. కరోనా వైరస్ కారణంగా దేశీ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐలు భారీ స్థాయిలో పెట్టుబడులను వెనక్కు తీసుకుంటున్నారని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సీనియర్ అనలిస్ట్ హిమాన్షు శ్రీవాస్తవ విశ్లేషించారు.

వాహనాల తయారీకి వైరస్ బ్రేక్..

- ఉత్పత్తి నిలిపివేస్తున్న ఆటోమొబైల్ కంపెనీలు
- జాబితాలో మారుతీ, హోండా, ఫియట్ తదితర సంస్థలు

న్యూఢిల్లీ: కరోనా వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా నిరోధక చర్యల్లో భాగంగా ఆటోమొబైల్ దిగ్గజాలు ఉత్పత్తి కార్యకలాపాలను నిలిపివేస్తున్నాయి. ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) గురుగ్రామ్, మానెసర్‌లోని (హరియాణా) తమ ప్లాంట్లలో తక్షణం ఉత్పత్తి నిలిపివేస్తున్నట్లు ఆదివారం ప్రకటించింది. ఈ రెండు ప్లాంట్లలో ఏటా 15.5 లక్షల వాహనాలు ఉత్పత్తవుతాయి. అటు రోహతక్‌లోని పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని కూడా మూసివేస్తున్నట్లు పేర్కొంది. షట్‌డౌన్ ఎన్నాళ్ల పాటు ఉంటుందనేది ప్రభుత్వ విధానంపై ఆధారపడి ఉంటుందని వివరించింది. అటు హోండా కార్స్ ఈ నెలాఖరు దాకా తమ రెండు ప్లాంట్లలో ఉత్పత్తి నిలిపివేయాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. తప్పనిసరి సర్వీసుల విభాగాల సిబ్బంది మినహా మిగతా ఉద్యోగులంతా ఇళ్ల నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తారని హెచ్‌సీఐఎల్ ప్రెసిడెంట్ గకు నకానిషి తెలిపారు.

మరోవైపు, మహీంద్రా అండ్ మహీంద్రా కూడా మహారాష్ట్రలోని ప్లాంట్లలో ఉత్పత్తి నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. నాగ్‌పూర్ ప్లాంట్‌లో ఇప్పటికే ఆపివేశామని, చకన్ (పుణే), కాండివిలి (ముంబై) ప్లాంట్లలో సోమవారం నుంచి నిలిపివేస్తామని పేర్కొంది. అటు ఫియట్ క్రిస్లర్ ఆటోమొబైల్స్ సైతం తమ ప్లాంట్లో ఈ నెలాఖరుదాకా ఉత్పత్తి కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఎంజీ మోటార్ ఇండియా సంస్థ గుజరాత్‌లోని హలోల్ ప్లాంటును మార్చి 25 దాకా మూసివేస్తున్నట్లు తెలిపింది.

ఇతర దేశాల్లోనూ..: హీరో మోటోకార్ప్

ఉద్యోగుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్‌తో పాటు కొలంబియా, బంగ్లాదేశ్ తదితర విదేశీ ప్లాంట్లలో కూడా కార్యకలాపాలు తక్షణమే నిలిపివేస్తున్నట్లు ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ వెల్లడించింది. మార్చి 31 దాకా ఇది అమలవుతుందని పేర్కొంది. జైపూర్‌లోని సెంటర్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ సహా ఇతర ప్రాంతాల్లోని ఉద్యోగులు నివాసాల నుంచే విధులు నిర్వర్తిస్తారని వివరించింది. అత్యవసర సర్వీసుల సిబ్బంది మాత్రమే కార్యాలయాలకు హాజరవుతారని పేర్కొంది. హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) భారత్‌లోని మొత్తం నాలుగు ప్లాంట్లలోనూ కార్యకలాపాలు తక్షణమే నిలిపివేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది.

మహీంద్రా ఫండ్...

మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా కొద్ది వారాల పాటు లాక్‌డౌన్ చేయాలంటూ ప్రతిపాదించారు. పెద్ద ఎత్తున తాత్కాలిక ఆస్పత్రుల ఏర్పాటు అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం, ఆర్మీకి తమ గ్రూప్ ప్రాజెక్ట్ టీమ్ పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమని చెప్పారు. 'మా మహీంద్రా హాలిడేస్ సంస్థ తరపున రిసార్ట్‌లను తాత్కాలిక వైద్య కేంద్రాలుగా మార్చి, సేవలు అందించేందుకు కూడా సిద్ధం' అని ఆనంద్ మహీంద్రా తెలిపారు. వెంటిలేటర్ల కొరత తీవ్రంగా ఉన్నందున.. తమ ప్లాంట్లలో వాటి తయారీపై తక్షణం కసరత్తు ప్రారంభించామని తెలిపారు. అత్యంత ప్రతికూల ప్రభావాలెదుర్కొనే చిన్న వ్యాపార సంస్థలు, స్వయం ఉపాధి పొందేవారికి తోడ్పాటు అందించేందుకు మహీంద్రా ఫౌండేషన్ ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తుందని మహీంద్రా చెప్పారు. తన పూర్తి వేతనాన్ని ఫండ్‌కు విరాళమిస్తున్నట్లు.. ఇతర ఉద్యోగులు స్వచ్ఛందంగా విరాళమివ్వొచ్చన్నారు.

కరోనాపై ఆర్‌బీఐ 'వార్'..!!

- ఆర్థిక కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా చర్యలు
- వ్యాపార విపత్తు ప్రణాళిక అమలు
- వార్ రూమ్ ఏర్పాటు

ముంబై: కరోనా వైరస్ మహమ్మారి కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా రిజర్వ్ బ్యాంక్ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంది. మార్చి 19 నుంచే వ్యాపార విపత్తు ప్రణాళిక (బీసీపీ)ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా ముంబైలోని ఒక రహస్య ప్రదేశంలో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసింది. కేవలం 24 గంటల వ్యవధిలో వార్ రూమ్ అందుబాటులోకి తెచ్చినట్లు ఆర్‌బీఐ అధికారి ఒకరు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన 90 మంది కీలక సిబ్బందితో పాటు ఇతరత్రా విభాగాలకు చెందిన 60 మంది ముఖ్యమైన ఉద్యోగులు, ఫెసిలిటీ స్టాఫ్ 70 మంది ఇందులో విధులు నిర్వర్తిస్తుంటారని పేర్కొన్నారు. ఈ వార్ రూమ్ .. ప్రత్యేకంగా డెట్ నిర్వహణ, రిజర్వుల నిర్వహణ, ద్రవ్యపరమైన కార్యకలాపాలు పర్యవేక్షిస్తుందని అధికారి తెలిపారు. బీసీపీ కింద నగదు బదిలీ లావాదేవీ సేవలైన రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్‌టీజీఎస్), నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్), స్ట్రక్చర్డ్ ఫైనాన్షియల్ మెసేజింగ్ సిస్టమ్ (ఎస్ఎఫ్ఎంఎస్) మొదలైనవి పర్యవేక్షిస్తారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సేవలకు సంబంధించిన ఈ-కుబేర్, ఇంటర్‌బ్యాంక్ లావాదేవీల్లాంటివి కూడా వీటిలో ఉంటాయని వివరించారు.

ప్రపంచంలోనే తొలిసారి..

'ఒక కేంద్రీయ బ్యాంకు ఇలాంటి బీసీపీని అమలు చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. చరిత్రలో కూడా ఇదే తొలిసారి. ఎందుకంటే రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కూడా ఇలాంటివి ఏర్పాటు కాలేదు' అని అధికారి వివరించారు. 'సాధారణంగా సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సమస్యలు, అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తులు మొదలైన వాటికి మాత్రమే బీసీపీ లాంటిది ఉంటుంది. కానీ కరోనా వైరస్ మహమ్మారితో యుద్ధంలో ఆర్‌బీఐ ప్రకటించిన బీసీపీ లాంటిది మరెక్కడా లేదు' అని చెప్పారు. దేశవ్యాప్తంగా 31 ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలు, ప్రధాన కార్యాలయంలో 14,000 మంది పైగా సిబ్బంది ఉన్నారు. అత్యంత కీలక కార్యకలాపాలను 1,500 మంది దాకా సిబ్బంది నిర్వహిస్తుంటారు. ప్రధాన కార్యాలయంలో 2,000 దాకా సిబ్బంది ఉండగా.. గత వారం రోజులుకాగా కేవలం 10% మందే విధులకు హాజరవుతున్నారు.

ఇలా ఏర్పాటు చేశారు..

వార్ రూమ్ ఏర్పాటు చేసిన తీరుతెన్నులను అధికారి వివరించారు. 150 మంది ఆర్‌బీఐ సిబ్బంది, 60 మంది సర్వీస్ ప్రొవైడర్లు, 70 శాతం మంది ఫెసిలిటీ స్టాఫ్ (మెయింటెనెన్స్, సెక్యూరిటీ, కిచెన్, ఫ్రంట్ డెస్క్, అడ్మినిస్ట్రేషన్ వంటి విభాగాల వారు)కి సరిపడే ఒక భవంతిని ఆర్‌బీఐ తీసుకుంది. ఈ సిబ్బంది అందరూ నిరంతరం ఆ భవంతిలోనే ఉంటారు. తీవ్ర విపత్తు పరిస్థితులైతే తప్ప బైటికి రావడానికి ఉండదు. వారందరికీ అవసరమైన వాటిని అత్యంత పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ, సరఫరా చేసేందుకు ప్రత్యేక సిబ్బంది ఉంటారు. రెండు బ్యాచ్‌ల కింద వార్ రూమ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తారు.

నోట్లను ముట్టుకుంటే చేతులు కడుక్కోండి: ఐబీఏ

కరోనా మహమ్మారి నేపథ్యంలో కరెన్సీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ) ప్రజలకు విజ్ఞప్తి చేసింది. నోట్లను లెక్కపెట్టిన తర్వాత, ముట్టుకున్న తర్వాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలంటూ సూచించింది. సాధ్యమైనంత వరకూ బ్యాంకు శాఖలకు వెళ్లకుండా ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్‌ను వినియోగించాలని కోరింది. ఇందుకు 'కరోనా సేడరో న, డిజిటల్ కరో నా' (కరోనాతో భయం వద్దు.. డిజిటల్ సర్వీసులు ఉపయోగించుకోండి) అనే ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించింది.

కోడిగుడ్లు

(హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 23-3-2020

విశాఖ	245-00
చిత్తూరు	223-00
వరంగల్	213-00
విజయవాడ	225-00
గోదావరి	225-00
22-3-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	210-00

మూడేళ్ల కనిష్ట స్థాయికి ఏటీఎఫ్ ధరలు

న్యూఢిల్లీ: విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర 12 శాతం తగ్గింది. కోవిడ్-19 (కరోనా వైరస్) పాజిటివ్ నిర్ధారణ కేసులు పెరిగిపోతుండడం, ఈ వైరస్ కారణంగా మరణిస్తున్న వారి సంఖ్య పెరగడం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో ఏటీఎఫ్ ధరను కిలోలీటర్‌కు రూ. 6,688 మేర తగ్గించినట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. తాజా తగ్గింపుతో ఢిల్లీలో కిలోలీటర్ ధర రూ. 50,171కు తగ్గింది. 2017 సెప్టెంబర్ నాటి కనిష్టానికి దిగివచ్చింది. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు కిలోలీటర్‌కు రూ.14,152 (22 శాతం) తగ్గింది. లీటరు ఏటీఎఫ్ ధర రూ. 50.17 వద్దకు పడిపోయింది. అంటే.. పెట్రోల్, డీజిల్ కంటే విమాన ఇంధనమే చౌకగా లభిస్తోంది.

సెన్సెక్స్ ప్రధాన మద్దతు 26,714

మార్కెట్ పంచాంగం

అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను జీరో స్థాయికి తగ్గించినప్పటికీ, గతవారం అటు అమెరికా గానీ, ఇటు ఇండియాగానీ 12 శాతం మార్కెట్ నష్టాన్ని చవిచూశాయి. ఈ తరుణంలో శుక్రవారం మన మార్కెట్ ముగిసిన తర్వాత...షార్ట్ సెల్లింగ్‌పై నియంత్రణలు విధిస్తున్నట్లు సెబి ప్రకటించింది. ఇటువంటి నియంత్రణలు ఏ దేశంలోనూ సానుకూల ప్రభావాన్ని చూపించిన దాఖలాలు లేవు. 2001లో ఇండియాలో కూడా షార్ట్ సెల్లింగ్‌ని నిషేధించిన తర్వాతి రోజుల్లో స్టాక్ సూచీలు 15 శాతం వరకూ పడిపోయాయి. ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీ అయిన యాపిల్ షేరుగానీ, ఇండియాలో విలువైన కంపెనీ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ గానీ నెలరోజుల్లోనే 40,50 శాతం పతనమైన తీరును చూస్తుంటే...అంతటి షేర్ల భారీ పతనానికి కారణం షార్ట్ సెల్లింగ్ ఎంతమాత్రం కాదని చెప్పవచ్చు. కరోనా వైరస్ వ్యాప్తి ప్రభావంతో ఆయా కంపెనీల లాభాలు వచ్చే రెండు, మూడు క్వార్టర్లల్లో పుంజుకోవన్న భయాలు తలెత్తినందున ఇన్వెస్టర్లు తెగనమ్మడమే ఈ షేర్ల పతనానికి కారణం. అయితే షార్ట్ సెల్లింగ్‌పై నియంత్రణలు వుంటే... షార్ట్ కవరింగ్ ద్వారా ఇటువంటి పెద్ద కంపెనీల షేర్లు వేగంగా కోలుకునే అవకాశం వుండదు. ఇక మన సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి...

సెన్సెక్స్ సాంకేతికాంశాలు...



మార్చి 20తో ముగిసినవారంలో 26,714 పాయింట్ల కనిష్టస్థాయికి పతనమైన బీఎస్ఈ సెన్సెక్స్ చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 4,187 పాయింట్ల భారీనష్టంతో 29,916 పాయింట్ల వద్ద ముగిసింది. వరుసగా రెండు వారాల్లో దాదాపు 7,500 పాయింట్ల పతనం సంభవించింది. ఈ సోమవారం గ్యాప్‌డౌన్‌తో సెన్సెక్స్ మొదలైతే తొలుత 27,930 పాయింట్ల వద్ద చిన్నపాటి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు కోల్పోతే తిరిగి 26,714 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 25,550 పాయింట్ల వరకూ పడిపోవొచ్చు. ఈ వారం రెండో మద్దతు స్థాయిని పరిరక్షించుకున్నా, పాజిటివ్‌గా మొదలైనా 30,420 పాయింట్ల వద్ద తొలి అవరోధం కలగవచ్చు. అటుపైన ముగిస్తే వేగంగా 31.101 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ స్థాయిని సైతం ఛేదిస్తే 32,658 పాయింట్ల వరకూ రిలీఫ్ ర్యాలీ జరిగే అవకాశం వుంటుంది.

నిఫ్టీ కీలక మద్దతు 7,830 పాయింట్లు...



క్రితంవారం ఎన్ఎస్ఈ నిఫ్టీ 7,830 పాయింట్ల వరకూ పతనాన్ని కొనసాగించి, చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 1,210 పాయింట్ల భారీ నష్టంతో 8,745 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీ గ్యాప్‌డౌన్‌తో ప్రారంభమైతే 8,175 పాయింట్ల వద్ద తొలుత మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే గతవారపు కనిష్టస్థాయి అయిన 7,830 పాయింట్ల స్థాయిని తిరిగి పరీక్షించవచ్చు. ఈ లోపున వేగంగా 7,420 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు. ఈ వారం రెండో మద్దతు స్థాయిని పరిరక్షించుకోగలిగినా, పాజిటివ్‌గా మొదలైనా నిఫ్టీ 8,880 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన ముగిస్తే 9,130 పాయింట్ల వరకూ పెరగవచ్చు. ఆపైన 9,590 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు.

- పి. సత్యప్రసాద్

క్వాంట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చా?

Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్ ప్రస్తుతం పతన బాటలో ఉంది కదా! ఈ సమయంలో కూడా మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్‌లు కొనసాగించాలా?

-తులసి, హైదరాబాద్

మార్కెట్ పతన బాటలో ఉన్నప్పటికీ, బుల్ రన్‌లో ఉన్నప్పటికీ, మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్(సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) కొనసాగించడమే ఉత్తమం. బుల్ రన్ కానీ, మార్కెట్ పతనం కానీ ఎప్పుడు ఆగిపోతాయో ఎవరూ అంచనా వేయలేరు. ఉదాహరణకు 2003 నుంచి 2007 వరకూ బుల్‌రన్ కొనసాగింది. సెన్సెక్స్ 2,800 పాయింట్ల నుంచి 3,000కు, ఆ తర్వాత 4,000, ఆ పైన 5,000కు, అటు తర్వాత 6,000 పాయింట్లకు ఎగసింది. దానిని బుల్ రన్‌గా విశ్లేషకులు గుర్తించారు. తర్వాత సెన్సెక్స్ 20,000 పాయింట్ల వరకూ పెరిగిపోయింది. బుల్ రన్ ఉంది కదాని సిప్‌లను ఆపేస్తే, ఈ పెరుగుదల ప్రయోజనాలను మనం మిస్ అయ్యే వాళ్లం కదా ! మార్కెట్ పతన బాటలో ఉన్నప్పటికీ, అది ఎంత కాలం ఉంటుంది ? ఎంత కాలం కొనసాగుతుంది ? ఇలాంటి విషయాలను మనం అంచనా వేయలేం. మార్కెట్ దశలపై మన అంచనాలు ఒక్కోసారి విఫలమవుతూ ఉంటాయి. అందుకని దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధన కోసం సిప్‌లను కొనసాగించడమే మంచిది. మార్కెట్ బుల్ రన్‌లో ఉన్నప్పుడు విలువలు బాగా పెరిగిపోతాయని, మార్కెట్ పతనమైనప్పుడు పెట్టుబడుల విలువ క్షీణిస్తుందనే భయం సాధారణంగా ఇన్వెస్టర్లలో ఉంటుంది. అలాగే మార్కెట్ పతన బాటలో ఉన్నప్పుడు ఎంత కాలం పతనం కొనసాగుతుందో, పెట్టుబడుల విలువ ఎంత మేర తగ్గుతుందో అనే భయాలూ ఉంటాయి. అందుకని బుల్‌రన్ ఉన్నప్పుడు ఒకింత లాభాలు స్వీకరించండి. పతన బాటలో ఉన్నప్పుడు మరింతగా పెట్టుబడులు పెట్టండి. అవసరమనుకుంటే మీ పోర్ట్‌ఫోలియోను మార్కెట్ దశలను బట్టి రీ బ్యాలెన్స్ చేస్తూ ఉండండి. ఇలా రీ బ్యాలెన్స్ చేసేటప్పుడు ఎగ్జిట్ లోడ్, పన్ను భారం అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

**నేను గత కొంతకాలంగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. నా పోర్ట్‌

అతికొద్ది మంది సమక్షంలో జరుగుతున్న పెళ్లి

హడావుడి లేకుండా వివాహం

ధారూరు: కరోనా వైరస్ ప్రభావం వివాహాలపై పడింది. ఎంతో అట్టహాసంగా, కుటుంబీకులు, బంధుమిత్రుల మధ్య జరగాల్సిన పెళ్లిళ్లు అతికొద్ది మంది మధ్య జరిగాయి. వికారాబాద్ ధారూరు మండలం నాగసమందర్ గ్రామానికి చెందిన మామిళ్ల మల్లప్ప, యాదమ్మ దంపతుల కొడుకు మహేశ్ వివాహంతోపాటు కుమ్మర్ పల్లి అనుబంధ నాగారం తండాకు చెందిన బాబియానాయక్, అంతీబాయి కూతురు మంజుల వివాహం ఆదివారం జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి కుటుంబీకులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. జనతా కర్ఫ్యూ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పోలీసులు వెళ్లి వారితో మాట్లాడారు. వివాహాలు రద్దు చేసుకోవాలని సూచించారు. దీంతో అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం.. పెళ్లిళ్లు రద్దయితే ఇబ్బందులు తలెత్తుతాయని వారు వేడుకున్నారు. దీంతో 20 మంది కంటే ఎక్కువ ఉండొద్దని, వారు కూడా దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. దీంతో ఆయా గ్రామాల్లో అతికొద్ది మంది సమక్షంలో ఏ హడావుడి లేకుండా వివాహాలు జరిగాయి.

పరిమిత సిబ్బందితో పనిచేయాలి

కార్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

న్యూఢిల్లీ: కోవిడ్ నిర్మూలనలో భాగంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పరిమిత సంఖ్యలో సిబ్బంది పనిచేయాలని సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అత్యవసర సేవలను మినహాయించి, మిగతా కార్యాలయాల్లోని ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేసేందుకు అనుమతినిచ్చింది. 'ఇంటి నుంచి విధులు నిర్వహిస్తున్న అధికారులందరూ టెలిఫోన్‌లో అందుబాటులో ఉండాలి. అవసరమనుకుంటే వారు కార్యాలయాలకు హాజరు కావాల్సి ఉంటుంది'అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే సంబంధిత కార్యాలయాల విభాగాధిపతులు ప్రతి విభాగంలో అత్యవసర సేవల విధులు నిర్వర్తించాల్సిన అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రోస్టర్‌ను రూపొందించాలని సూచించింది. అలాంటి సిబ్బంది మాత్రం సోమవారం నుంచి ఈనెల 31 వరకు హాజరుకావాలని తెలిపింది. ఇంటి నుంచి విధులు నిర్వహించాలన్న నిబంధనలు అత్యవసర సేవలందించే వారికి వర్తించవని స్పష్టం చేసింది.

అంత్యక్రియలు ఆగిపోయాయి

విషాదంలో సోని కుటుంబసభ్యులు

చేవెళ్ల: దేశవ్యాప్తంగా జనతా కర్ఫ్యూ విధించిన నేపథ్యంలో ఓ మహిళ అంత్యక్రియలు వాయిదా పడ్డాయి. చేవెళ్ల మండలం న్యాలట గ్రామానికి చెందిన సోని (25) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కుటుంబసభ్యులు ఆదివారమే అంత్యక్రియలు చేయాలని అనుకున్నారు. కానీ, బయట అంతా కర్ఫ్యూ ఉండటంతో ఎవరూ బయటకు వచ్చే పరిస్థితి కనిపించలేదు. బంధువులు కూడా ఎవరూ వచ్చే పరిస్థితి లేదని గమనించిన గ్రామ సర్పంచ్ లక్ష్మీ సత్యనారాయణ మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడి సోమవారం అంత్యక్రియలు చేయడం మంచిదని చెప్పారు. దీనికి మృతురాలి కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలోనే భద్రపరిచారు.

సెల్యూట్ జనతా కర్ఫ్యూ కారణంగా ఆదివారం ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. పోలీసులు, వైద్యులు, పారిశుధ్య కార్మికులు తదితర అత్యవసర సేవల సిబ్బంది తమతమ విధులను నిర్వర్తించారు.

వాహనదారుడితో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ సజ్జనార్

గాంధీ ఆస్పత్రిలో అత్యవసర సేవలు అందిస్తున్న వైద్యులు

హైదరాబాద్ గుడి మల్కాపూర్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు

పల్లె గప్‌చుప్

- జనతా కర్ఫ్యూకు గ్రామాల మద్దతు
- ఇళ్ల నుంచి బయటకు రాని జనం

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ప్రధాని మోదీ పిలుపునిచ్చిన దేశవ్యాప్త జనతా కర్ఫ్యూకు తెలంగాణ పల్లెవాసులు సంపూర్ణ మద్దతు పలికారు. గ్రామీణ ప్రజానీకం దృఢ సంకల్పంతో కర్ఫ్యూలో పాల్గొని ఐక్యతను చాటింది. ఆదివారం ఉదయం 6 నుండి సోమవారం ఉదయం 6 వరకు రాష్ట్ర ప్రభుత్వం జనతా కర్ఫ్యూకు పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రోజువారీ కార్యక్రమాలు నిలిచిపోయాయి. వైరస్ వ్యాప్తిని నిరోధించే క్రమంలో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా స్వీయ నియంత్రణ పాటించారు. గ్రామాల్లో చిన్న దుకాణాలు, బడ్డీకొట్లు మొదలు అన్నీ మూతబడ్డాయి. రైతులు సైతం సాగు పనులు నిలిపివేసి ఇంటిపట్టునే ఉన్నారు. అన్ని వర్గాలు జనతా కర్ఫ్యూలో పాల్గొని విజయవంతం చేశారు.

ముందస్తు ప్రణాళికతో...

జనతా కర్ఫ్యూపై గ్రామ పంచాయతీలు ముందస్తు చర్యలు చేపట్టాయి. గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో రెండ్రోజుల ముందు నుంచే కర్ఫ్యూపై దండోరా వేయించారు. సామాజిక మాధ్యమాలు, మీడియాలో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పోలీసులు సైతం ముందస్తుగా సూచనలు చేశారు. దేశభక్తి, ఐక్యతపై సోషల్ మీడియాలో పలు రకాల వీడియోలు, చిత్రాలు వైరల్ కావడంతో కర్ఫ్యూపై లోతుగా ప్రచారం జరిగింది. దీంతో దాదాపు అన్ని వర్గాల ప్రజలు ముందస్తుగా సిద్ధమయ్యారు. ఇంటికి కావాల్సిన సరుకులను ముందు రోజే సమకూర్చుకున్నారు. ముందు రోజు చేసే కార్యక్రమాలను వీలైనంత మేర ముందస్తుగా ముగించుకోవడం, లేదా తర్వాతి రోజుకు వాయిదా వేసుకోవడం లాంటివి చేసుకున్నారు. సాధారణంగా గ్రామాల్లో సెలవు వాతావరణం ఉంటే ఇంటి బయట అరుగుల పైనో, రోడ్డు పక్కన ముచ్చట్లు పెట్టుకోవడం కనిపించేది. కర్ఫ్యూతో అలాంటివేవీ కనిపించలేదు. మెజార్టీ ప్రజలు తలుపుదాటి బయటకు రాలేదు. కొన్నిచోట్ల అవసరం లేకుండా రోడ్లపైకి వచ్చే వారిపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. అరగంట, గంటకోసారి పోలీసు వాహనాలు సైరన్‌తో వెళ్లడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. దీంతో మెజార్టీ ప్రాంతాల్లో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు.

నిర్మానుష్యంగా మారిన కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు

Nalgonda, Miryalguda, Suryapet: 7303762953

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com